www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
# నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 17 సోమవారం | ఫిబ్రవరి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 153
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur










# ట్రిపుల్ ఇంజిన్ సర్కార్

- కొత్త నినాదం ఎత్తుకున్న బీజేపీ
- ఢిల్లీ ఎన్నికల్లో విజయం తర్వాత బీజేపీలో జోష్
- ఇప్పటికే దేశంలో 15 రాష్ట్రాల్లో బీజేపీ పాలన
- మరో ఐదురాష్ట్రాల్లో బీజేపీ-ఎన్డీఏ కూటమి పాలన
- ట్రిపుల్ ఇంజిన్ అంటే కేంద్రంలోనూ,రాష్ట్రాల్లోనూ బీజేపీ పాలన
- ఆ దిశగా బీజేపీ సర్కార్ వ్యూహాత్మకంగా ముందుకు

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

2014 నుంచి తాజాగా ఢిల్లీ అసెంబ్లీకి జరిగిన వరుస ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాలు మెజార్టీ రాష్ట్రాల్లో కొలువుదీరాయి. మొత్తం 28 రాష్ట్రాలకు 15 చోట్ల బీజేపీ ప్రభుత్వాలే పాలిస్తున్నాయి. ఎన్నికల్లో బీజేపీ పాపులర్ నినాదం డబుల్ ఇంజిన్ సర్కార్.. ఇలా ప్రచారం చేసుకునే దేశంలో 15 రాష్ట్రాల్లో ప్రభుత్వాలను స్థాపించింది బీజేపీ. అదేవిధంగా మరో 5 రాష్ట్రాల్లో బీజేపీ భాగస్వామ్య కూటమి అధికారంలో కొనసాగుతోంది. ఈ రాష్ట్రాల్లో అధికారం సాధించేందుకు బీజేపీ ఎక్కువగా డబుల్ ఇంజిన్ సర్కార్ స్థాపించాల్సిన అవసరం ఉందనే ప్రచారం చేసింది. అయితే ఇప్పుడు డబుల్ ఇంజిన్ సర్కారు బదులుగా ట్రిపుల్ ఇంజన్ అంటూ కమల నాథులు కొత్త పల్లవి ఎత్తుకున్నారు. అదేంటి కేంద్ర, రాష్ట్రాల్లో ఒకే పార్టీ ప్రభుత్వం ఉండటమే డబుల్ ఇంజన్ కదా.. మరి ట్రిపుల్ ఇంజన్ ఏంటా? అని అనుమానిస్తున్నారా? అయితే ఈ కథనం పూర్తిగా చదవండి.. దేశంలో 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చాక.. రాష్ట్రాల్లోనూ కాషాయ జెండా ఎగరేయాలని ప్రధాని మోదీ ప్లాన్ చేశారు. కేంద్రంలో అధికారం వచ్చిన నుంచి గత పదేళ్లుగా జరిగిన ఎన్నికల్లో బీజేపీకి కాస్త బలం ఉన్నా, ఆ రాష్ట్రంలో కమలం జెండా ఎగిరేలా వ్యూహ రచన చేశారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా రాజకీయ చతురతతో దేశవ్యాప్తంగా కమలం హవా కొనసాగింది. 2014 నుంచి తాజాగా ఢిల్లీ అసెంబ్లీకి జరిగిన వరుస ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాలు మెజార్టీ రాష్ట్రాల్లో కొలువుదీరాయి. మొత్తం 28

# డిపాజిటర్లకు కుచ్చుటోపీ!

- వేలాది మంది వద్ద చిన్న మొత్తాల డిపాజిట్లు సేకరించిన ఫాల్కన్
- దేశవ్యాప్తంగా 6,979 మంది వద్ద 17వేల కోట్ల వసూళ్లు
- ఒక్క హైదరాబాద్‌లోనే రూ.850 కోట్లు వసూళ్లు
- డిపాజిటర్ల ఫిర్యాదుతో ముందుకు కదిలిన పోలీసులు
- ఫాల్కన్ క్యాపిటల్ ప్రొటెక్షన్ డైరెక్టర్ కావ్య,పవన్ అరెస్టు
- దుబాయికి చెక్కేసిన ముగ్గురు కీలక వ్యక్తులు..లుకౌట్ నోటీసు జారీ

2




**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

హైదరాబాద్‌లో మరో భారీ స్కాం వెలుగు చూసింది. ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంట్ పేరుతో వేలాది మంది ప్రజల నుంచి చిన్న మొత్తాలుగా పెద్ద ఎత్తున సేకరించినట్లు పోలీసులు గుర్తించారు. ఒక్క హైదరాబాద్‌లోనే ఏకంగా రూ. 850 కోట్లు వసూలు చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసిన పోలీసులు.. ఫాల్కన్ క్యాపిటల్ ప్రొటెక్షన్ డైరెక్టర్ కావ్య నల్లూరితోపాటు సంస్థ వైస్ ప్రెసిడెంట్ పవన్ కుమార్ ఓదెలును అరెస్ట్ చేశారు. దేశవ్యాప్తంగా 6979 మంది బాధితుల నుంచి 17 వేల కోట్లు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. బ్రిటానియా, గోద్రెజ్, అమెజాన్ వంటి సంస్థలో పెట్టుబడుల పేరుతో మోసం చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఫాల్కన్ అనుబంధంగా 14 సంస్థలు ఏర్పాటు చేసి వసూళ్లకు పాల్పడ్డారని తెలిపారు.కాగా, ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంట్ సంస్థకు చెందిన ముగ్గురు కీలక వ్యక్తులు ఇప్పటికే దుబాయ్ పారిపోయినట్లు తెలిసింది. ఎఫ్ఐడీ ఛైర్మన్ అమర్‌దీప్ కుమార్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఆర్యన్‌సింగ్, సందీప్ దుబాయ్‌కు పారిపోయారు. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురిపై పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ

## బంగారుగనిలో
# మృత్యుక్రీడ

- 42 మంది కార్మికులను చిదిమేసిన బంగారు గని
- ఆఫ్రికా దేశం మాలిలో దుర్ఘటన
- ఒక్కసారిగా విరిగిపడిన కొండచరియలు
- తప్పించుకునేలోపే మృత్యువాత పడిన కార్మికులు

2



## హరీశ్ రావు
# పీఏ అరెస్ట్

- ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక అప్డేట్
- గతంలోనూ ఆరోగ్యశ్రీ శాఖలో పని చేస్తూ అవినీతికి పాల్పడ్డట్లు ఆరోపణలు



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి, సిద్దిపేట

# మద్యం అమ్మకాల్లో మనమే టాప్

- దక్షిణాదిలో మద్యం అమ్మకాల్లో తెలంగాణ టాప్
- ఏటేటా పెరుగుతుందే తప్ప తరగని విక్రయాలు
- పురుషుల్లో యాభైశాతం మద్యానికి బానిసలే
- పొరుగునున్న ఏపీలో తగ్గిన అమ్మకాలు
- రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

నిరుటి కంటే తక్కువే.. ఐనా దక్షిణాదిలో తాగేవారు తెలంగాణలోనే ఎక్కువ అయినప్పటికీ ప్రభుత్వాల మద్యం ఆదాయం ఏటేటా పెరుగుతూ పోయిందే కానీ తగ్గలేదు.

2 దశాబ్దాలుగా ప్రభుత్వాలు మద్యాన్ని ఆదాయ వనరుగా చూస్తున్నాయి. కొన్ని ప్రభుత్వాలైతే మద్య నిషేధం అమలు చేస్తామని వాగ్దానాలు ఇచ్చి అమలుకు ప్రయత్నాలు చేశాయి. అయినప్పటికీ ప్రభుత్వాల మద్యం ఆదాయం ఏటేటా పెరుగుతూ పోయిందే కానీ తగ్గలేదు. గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టం అవుతోంది. ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావం తర్వాత మద్యం అమ్మకాలు బాగా పెరిగాయని ఓ ఆరోపణ ఉంది. పొరుగున ఉన్న ఏపీలో కొంతకాలం కిందట నెలకొన్న పరిస్థితులు తెలంగాణలో మద్యం విక్రయాలకు మంచి అవకాశంగా మారాయి. మరోవైపు తెలంగాణ సంస్కృతిలో మద్యం తాగడం ఒక భాగంగా పరిగణిస్తారు. పండుగలు, వేడుకలు, ఇతర సందర్భాల్లో ఇది సర్వసాధారణం. తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవడం.. ఆర్థిక వనరులు పెరగడంతో మద్యం విక్రయాలు పెరుగుతున్నాయనేది అంచనా. అందుకని మద్యం వినియోగంలో తెలంగాణ రికార్డులను తిరగరాస్తోంది. దక్షిణ భారతదేశంలోనే మద్యం విక్రయాల్లో టాప్‌లో ఉందట. రాజ్యసభలో కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ చేసిన ప్రకటన మేరకు.. తెలంగాణలో 50శాతం మంది పురుషులు మద్యం

# మరోసారి కులగణన సర్వే షురూ..

- ఈనెల 28 వరకు మరోసారి కులగణన సర్వే
- 3 పద్ధతుల్లో సర్వే చేపట్టిన సర్కార్
- కాల్‌సెంటర్‌కు ఫోన్ చేస్తే ఇంటికే ఎన్యుమరేటర్లు
- ఎంపీడీఓ,వార్డు ఆఫీసులకు వెళ్లి వివరాల నమోదు
- ప్రజాపాలన కేంద్రానికి వెళ్లి అక్కడే దరఖాస్తు ఇవ్వొచ్చు

2




**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణ వ్యాప్తంగా కులగణన వివరాల నమోదుకు ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది. నేటి నుంచి ఈనెల 28 వరకు మరోసారి కులగణన సర్వేలో నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ సర్వేను ప్రభుత్వం మూడు పద్ధతుల్లో చేపట్టనుంది. గతంలో నిర్వహించిన సర్వేలో మొత్తం 1,15,71,457 కుటుంబాలకు గాను 1,12,15,134 కుటుంబాలను సర్వే చేయడం జరిగిందని అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దీంతో కులగణన సర్వేలో పాల్గొనని 3,56,323 కుటుంబాలకు సర్కారు మరో అవకాశం ఇస్తోంది. రెండోసారి సర్వేకోసం మూడంచెల విధానాన్ని ఎంపిక చేసుకున్నామని అధికారులు తెలిపారు. ఆన్ లైన్‌తో పాటు ఆఫ్ లైన్ లోనూ

# త్వరలో మెగా డీఎస్సీ

- 16,347 టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్
- రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులకు పైగా ఒప్పందాలు కుదుర్చుకున్నాం
- 4 లక్షలకు పైగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు
- ఎమ్మెల్సీ ఎన్నికలపై సీఎం చంద్రబాబు సమీక్ష..

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

ఫిబ్రవరి 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించేలా కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన స్ట్రైక్ రేట్ రిపీట్ అవ్వాలని కూటమి నేతలకు ముఖ్యమంత్రి సూచించారు. ప్రతి ఎన్నిక పరీక్షవంటిదేనని, కూటమి అభ్యర్థులు విజయం సాధించేలా ప్రతిఒక్కరూ కష్టపడాలని సూచించారు. 2024 ఎన్నికల్లో 93 శాతం స్ట్రైక్ రేట్‌తో కూటమిని రాష్ట్ర ప్రజలు గెలిపించారని, ఆ దిశగా ఇప్పుడూ ముందుకెళ్లాలని కోరారు. ఉమ్మడి గుంటూరు-కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలతో సీఎం చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై నేతలకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. "ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం

# పురందేశ్వరికి ఢిల్లీ పిలుపు

- రాష్ట్ర బీజేపీ నాయకత్వం మార్పు తథ్యం
- సామాజిక వర్గాల పరంగా నేత ఎంపిక
- ఇప్పటికే కసరత్తు చేసిన అమిత్ షా
- మార్పుపై సంకేతాలిచ్చిన బీజేపీ అధిష్టానం
- కొత్త అధ్యక్షుడిని నియమించిన పక్షంలో పురంద్రేశ్వరికి జాతీయ స్థాయిలో పార్టీ పదవి?

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

ఏపీ రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. కూటమిలోని మూడు పార్టీలు కొత్త వ్యూహాలతో ముందుకు వెళ్తున్నాయి. రాజకీయంగా బలోపేతం కావటానికి ఇదే సరైన సమయంగా బీజేపీ తో పాటుగా జనసేన భావిస్తోంది. ఇందు కోసం బీజేపీ అధినాయకత్వం ఏపీ పైన ప్రత్యేకంగా ఫోకస్ చేసింది. పార్టీ ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరికి ఢిల్లీ నుంచి పిలుపు వచ్చింది. రాష్ట్రంలో పార్టీ నాయకత్వ మార్పుకు రంగం సిద్దమైంది. అదే సమయంలో కీలక బాధ్యతలు అప్పగించేందుకు పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏపీ పై ఢిల్లీ ఫోకస్ ఏపీలో తమ పార్టీ బలం పెంచుకునేందుకు బీజేపీ కొత్త వ్యూహాలు అమలు చేస్తోంది. కూటమిలో కొనసాగుతూనే.. పార్టీని క్షేత్ర స్థాయిలో సంస్థాగతంగా బలోపేతం చేయాలని రాష్ట్ర పర్యటనకు వచ్చిన సమయంలోనే అమిత్ షా స్పష్టం చేసారు. ఏపీకి కేంద్రం అందిస్తున్న సాయం గురించి ప్రజల్లోకి వెళ్లాలని నిర్దేశించారు. అదే సమయంలో పార్టీ నాయకత్వ మార్పు పైన చర్చ జరిగింది. ఇప్పటికే పార్టీ నేతలు తమ అభిప్రాయాలను స్పష్టం చేసారు. ఏపీలో సామాజిక సమీకరణాలకు అనుగుణంగా రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక పైన ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో పురందేశ్వరికి ఢిల్లీ నుంచి పిలుపు వచ్చిందికూటమిలో కొనసాగుతున్నా.. ప్రస్తుతం రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్న పురందేశ్వరి స్థానంలో మరొకరిని ఎంపిక చేసే అంశం పైన కొద్ది రోజులుగా పార్టీ నాయకత్వం కసరత్తు

# సైకిలెక్కనున్న వైసీపీ ఎమ్మెల్సీ!

- వైసీపీకి మరో షాక్.. టీడీపీలోకి కీలక నేత!
- ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ వైసీపీకి గుడ్‌బై
- చిలకలూరిపేటలో క్రియాశీలకంగా పనిచేస్తున్న రజిని
- వైసీపీలో ఉండి ప్రయోజనం లేదని భావిస్తున్న రాజశేఖర్

2



**గుంటూరు-నవభూమిబ్యూరో**

చిలకలూరిపేట కు చెందిన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ కూడా వైసీపీకి టాటా చెప్పేయనున్నారని ప్రచారం జరుగుతోంది. పార్టీ అధికారం కోల్పోయిన నుంచి వలస వెళ్లే నేతల్లో మర్రి రాజశేఖర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అయితే అధినేత జగన్‌తో ఉన్న సాన్నిహిత్యం వల్ల ఇంతకాలం వాయిదా పడుతూ వస్తోందంటున్నారు. అయితే ఇటీవల పార్టీలో తనకు ప్రాధాన్యం తగ్గడం, ఆయన సొంత నియోజకవర్గం చిలకలూరి పేటలో మాజీ మంత్రి విడదల రజిని తిరిగి యాక్టివ్ అవ్వడంతో ఇక తాను వైసీపీలో ఉండి ప్రయోజనం లేదని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ డిసైడ్ అయినట్లు చెబుతున్నారు. ఈ కారణంగానే పార్టీ కార్యక్రమాలకు ఆయన దూరంగా ఉంటున్నట్లు టాక్ నడుస్తోంది. ఇటీవల వైసీపీ అధినేత జగన్ సమక్షంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా నేతల సమీక్ష సమావేశానికి మర్రి డుమ్మా కొట్టారు. ఆయన స్థానికంగా అందుబాటులో ఉన్నా, తాడేపల్లి వైపు వచ్చేందుకు ఆసక్తి చూపలేదంటున్నారు. దీంతో ఆయన పార్టీ మారుతారనే ప్రచారానికి మరింత బలం చేకూరినట్లైంది. వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో ఉన్న మర్రి రాజశేఖర్ కి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం దక్కడం లేదు. భవిష్యత్ లో కూడా వైసీపీలో ఉంటే ఆ చాన్స్ వచ్చే పరిస్థితి లేదని ఆయన అనుమానిస్తున్నారు. 2009లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పనిచేసిన మర్రి రాజశేఖర్.. 2014లో వైసీపీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. 2019లో మళ్లీ పోటీ చేద్దామనుకుంటే ఆఖరి క్షణంలో పార్టీలో చేరిన విడదల రజిని ఆయన టికెట్ ను తన్నుకుపోయారు. 2024లో చాన్స్ వస్తుందని ఆశించారు. కానీ ఆ ఎన్నికల్లో చిలకలూరిపేట ఎమ్మెల్యేగా ఉన్న రజినిని గుంటూరు వెస్ట్‌కు మార్చారు. ఆమె స్థానంలో గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడికి చాన్స్ ఇచ్చారు. ఇక ఎమ్మెల్యే టికెట్ నిరాకరించిన వైసీపీ ప్రత్యామ్నాయంగా మర్రికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చింది. అయితే ప్రజలతో నేరుగా సంబంధాలు లేకపోవడం వల్ల ఆయన ఆ పదవిని ఇష్టపడటం లేదని చెబుతున్నారు. 2029లో అయినా పార్టీ తరఫున అవకాశం వస్తుందని ఇన్నాళ్లు ఆయన ఆశించారు.







# మస్తాన్ సాయి కేసులో కీలక పరిణామం

**హైదరాబాద్-నవభూమి:** లావణ్య రాజ్ తరుణ్‌ల వివాదం ఆ మధ్య తెలుగు చిత్రపరిశ్రమలో తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితుడిగా మస్తాన్ సాయి ఉన్నారు. ఇప్పుడు ఈ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. మస్తాన్ సాయి కేసుపై ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లావణ్య న్యాయవాది నాగూరుబాబు ఇవాళ(ఆదివారం) లేఖ రాశారు. మస్తాన్ సాయి కుటుంబాన్ని గుంటూరు మస్తాన్ దర్గా ధర్మకర్తలుగా తొలగించాలని గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లావణ్య న్యాయవాది కోరారు.దర్గా ప్రతిష్టతకు భంగం..ధర్మకర్త కొడుకు అయిన మస్తాన్ సాయి నేరాలతో దర్గా పవిత్ర, భద్రతకు, భంగం వాటిల్లుతుందని లేఖలో న్యాయవాది ప్రస్తావించారు. మస్తాన్ సాయిపై ఇప్పటికే మహిళల నగ్న చిత్రాలు, డ్రగ్స్ కేసులు, అత్యాచారం, ఇలా సుమారు ఐదు క్రిమినల్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. భక్తుల భద్రత, దర్గా ప్రతిష్టతకు భంగం వాటిల్లుతుందని లేఖలో న్యాయవాది నాగూరు బాబు తెలిపారు. మస్తాన్ దర్గా ధర్మకర్త రావి రామ్మోహన్ రావు కుటుంబ ఆధిపత్యాన్ని తొలగించి, ప్రభుత్వం లేదా వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో దర్గాను నిర్వహించాలని లేఖలో వివరించారు. మస్తాన్ సాయిపై ఇప్పటివరకు ఉన్న అన్ని కేసుల వివరాలు లేఖలో లావణ్య న్యాయవాది నాగూరు బాబు పేర్కొన్నారు.

దూకుడు పెంచిన పోలీసులు..మస్తాన్ సాయి కేసులో కేసులో నార్కోటిక్స్ పోలీసులు దూకుడు పెంచారు. ఈ కేసులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. విచ్చలవిడిగా డ్రగ్స్ వీడియోలు వైరల్‌గా మారాయి. మస్తాన్ సాయి హార్డ్ డిస్క్‌లో డ్రగ్స్ వాడకం వీడియోలు భారీగా లభించాయి. దీంతో డ్రగ్స్ తీసుకున్న వారి వివరాలను నార్కోటిక్ పోలీసులు సేకరిస్తున్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై బిగ్ అప్డేట్.. అధికారులకు సర్కార్ కీలక ఆదేశాలు.. ఇక చకచకా పనులు..!



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ప్రజల్లో కాస్త అయోమయం నెలకొన్న నేపథ్యంలో.. బిగ్ అప్డేట్ వచ్చింది. అధికారులకు ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల జాబితాను ప్రభుత్వం ప్రకటించినప్పటికీ.. నిర్మాణం విషయంలో మాత్రం ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇండ్ల పనులు ఎప్పుడు మొదలుపెట్టాలి.. అసలు ప్రాసెస్ ఏంటీ.. నిధుల సంగతేంటీ..? అన్న విషయాలపై ప్రజలకు ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. మరోవైపు.. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఎలక్షన్ కోడ్ అమల్లో ఉంది. దీంతో.. ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయన్న ఆనందం కంటే.. ఇప్పుడు ఏం చెయ్యాలన్న అయోమయమే ప్రజల్లో ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో.. ప్రభుత్వం కీలక అప్డేట్ ఇచ్చింది.గృహనిర్మాణ, రెవెన్యూ, ఐ అండ్ పీఆర్ అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారలకు భట్టి విక్రమార్క కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ముందుగా.. మహబూబ్ నగర్ నుంచే నిర్మాణాలు మొదలుపెట్టాలని సూచించారు. ఈ బడ్జెట్ సమీక్ష సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరయ్యారు. ప్రభుత్వం ఆదేశాలతో ఇక పనులు చకచకా జరగనున్నాయి.మరోవైపు.. ప్రభుత్వ భూముల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు భట్టి విక్రమార్క సూచించారు. ప్రభుత్వ పథకాలను షార్ట్ ఫిల్మ్ రూపంలో క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలని తెలిపారు. అలాగే.. శాటిలైట్ టౌన్ షిప్ నిర్మాణాలపై గృహనిర్మాణ శాఖ దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ ఇండ్ల నిర్మాణంతో మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సాకారం అవుతుందని భట్టి చెప్పుకొచ్చారు. డిజిటల్ భూ సర్వేకు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు.

# మానవత్వం చచ్చిపోయిందా..? దీనస్థితిలో పదిరోజులుగా నడిరోడ్డుపై తల్లీకూతురు.. ఇంత కాఠిన్యమా..?



**హైదరాబాద్-నవభూమి:**ఆమెది మహబూబ్‌నగర్ జిల్లా మారేడుపల్లి. ఆరు నెలల కిందటే అనారోగ్యంతో భర్త కాలం చేశాడు. భర్త చనిపోయిన నెల రోజులుకే.. రోడ్డు ప్రమాదంలో కుమారుడు కూడా మరణించాడు. ఓవైపు భర్త, కుమారుడు చనిపోయారన్న బాధ చంపేస్తోన్నా.. ఆరేళ్ల కూతురి బాధ్యత తనపై ఉందన్న ఒకే ఒక్క కారణం తనను బతికిస్తోంది. కానీ.. విధి ఎంత కఠినమైనదంటే.. ఇంత బాధలో, ఇన్ని కష్టాల్లో ఉన్న ఆమె తీవ్ర అనారోగ్యానికి గురయ్యేలా చేసింది. విధికంటే మనుషులు ఇంకా కఠినాత్ములు కాబోలు.. ఆధార్ కార్డు లేదన్న కారణంతో వైద్యం చేసేందుకు నిరాకరించటంతో.. పది రోజులుగా రోడ్డుపైనే అత్యంత దీనస్థితిలో కాలం వెళ్లదీస్తున్నారు.సమాజంలో రోజురోజుకు మానవత్వం సన్నగిల్లుతోంది. మనుషుల్లో క్రూరత్వం, కాఠిన్యం పెరిగిపోతురీ.. కనికరం, జాలి, కరుణ, సహాయ గుణాలకు చోటులేకుండా పోతోంది. అందుకు నిదర్శనమే.. పదిరోజులుగా నడిరోడ్డుపై తల్లీకూతుర్లు దీనమైన పరిస్థితి. తల్లికి ఏమైందో తెలియదు.. ఎందుకు ఆస్పత్రిలో చేర్చుకోలేదో అర్థం కాదు.. ఏం చెయ్యాలో తోచని ఆ చిన్నారి.. ఒడిలో అమ్మను పడుకోబెట్టుకుని సపర్యలు చేస్తున్న దీనస్థితి చూస్తుంటే.. గుండెల్లో నుంచి కన్నీళ్లు రాకమానదు. అలాంటిది.. ఆస్పత్రి సిబ్బందికి మాత్రం ఇవేవి అవసరం లేదు. ఆధార్ కార్డు లేదన్న ఒకే ఒక్క కారణంతో.. ఆమె పరిస్థితి కూడా అర్థం చేసుకోకుండా నిర్ధాక్షిణ్యంగా వైద్యం చేసేందుకు నిరాకరించారు. దీంతో.. దిక్కుతోచని పరిస్థితిలో, ఏ దిక్కుకెళ్లాలన్న సత్తువలేదని దుస్థితిలో.. అక్కడే రోడ్డుపైనే పది రోజులుగా కాలం వెళ్లదీస్తున్నారు ఆ తల్లీకూతుళ్లు.అసలు ఆ మహిళ భర్త ఎటు పోయాడు.. ముందు వాడిని పట్టుకుని తన్నాలి. అనారోగ్యంతో ఉన్న తల్లిని, చిన్నపిల్లని వదిలేసి వాడు ఏం వెలగబెడుతున్నాడంటూ.. మనకు ఎక్కడలేని కోపం రావటం సహజమే. కానీ.. అసలు బాధకరమైన విషయం ఏమిటంటే.. మహబూబ్‌నగర్ జిల్లా మారేడుపల్లికి చెందిన ప్రమీల అనే ఈ మహిళ భర్త సురేష్.. ఆరు నెలల కింద అనారోగ్యంతో కన్నుమూశాడు. ఆ బాధలో నుంచి పూర్తిగా కోలుకోకముందే.. నెల రోజులకే కొడుకు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు వదిలాడు. అటు భర్త, ఇటు కుమారుడు ఇద్దరూ ఉన్నట్టుండి ప్రాణాలు కోల్పోవటంతో.. ఆ బాధ ఆమెను అన్నిరకాలుగా కుంగదీసింది.భర్త, కొడుకు ఎలాగూ వెళ్లిపోయారు.. ఇక ఉన్న ఆరేళ్ల కూతురి కోసమైనా బతకాలి కదా అని గుండెను రాయి చేసుకుని.. బాధనే ధైర్యంగా మలుచుకుని.. కన్నీళ్లను, కన్నబిడ్డను వెంటబెట్టుకుని.. బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చింది. దొరికితే ఏదైనా చిన్నా చితక కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించడం.. లేదంటే భిక్షాటనతో చేసి.. వచ్చిన పదో పరకతో తమ రెండు ప్రాణాలను నిలుపుకునేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తోంది ప్రమీల. కానీ.. మనుషుల్లాగే విధికి కూడా ఏమాత్రం కనికరం లేకుండా పోయింది. కష్టాలతో కాపురం చేస్తూ, బాధలతోనే కడుపు నింపుకుంటున్న ఆమెను ఇంకా ఇంకా పరీక్షిస్తూనే ఉంది. భర్త, కొడుకు పోయారన్న బాధతోనే, బిడ్డ భవిష్యత్ ఏమవుతుందోనన్న బెంగతోనో.. ప్రమీల అనారోగ్యానికి గురైంది. పెద్దగా పట్టించుకోకపోవటం వల్లో, సరైన తిండి నిద్ర లేకనో.. ఆ ఆరోగ్య సమస్య ముదిరి.. సత్తువ కూడా లేని స్థితికి చేరుకుంది.ప్రైవేటు క్లినిక్‌లో కూడా చూపించుకునే పరిస్థితి లేక.. ప్రభుత్వ ఆస్పత్రి అయితే ఉచితంగానే వైద్యం చేస్తారన్న ఆశతో హైదరాబాద్లోని ఉస్మానియా ఆసుపత్రికి తన కూతురిని పట్టుకుని ఎలాగోలా కష్టపడి వెళ్లింది. రోగి ఆరోగ్య పరిస్థితిని చూసి వైద్యం చేయాల్సిన వైద్య సిబ్బంది, రూల్స్ పేరుతో కేవలం ఆధార్ కార్డు లేదన్న కారణంతో వైద్యం చేసేందుకు నిరాకరించారు. ప్రమీలను కనీసం ఆస్పత్రిలో కూడా చేర్చుకోలేదు.మరెక్కడికైనా వెళ్లి ప్రయత్నిద్దామంటే.. నగరంలో వేరే ఏమీ తెలియదు.. గడ్డమో కాళ్లో పట్టుకుని తెలుసుకునైనా వెళ్దామన్నా ఒంట్లో కదిలేందుకు కూడా సత్తువ లేదు.. నా అనేవారు కూడా ఎవ్వరూ పట్టించుకోకపోవటంతో.. పది రోజులుగా తన కూతురితో ఉస్మానియా ఆస్పత్రి బయటే.. కటిక నేలపై దీనస్థితిలో కాలం వెళ్లదీస్తోంది. తన తల్లికి వచ్చింది చిన్న జ్వరమేనని భావిస్తున్న ఆ చిన్నారి.. ఒళ్లో పడుకోబెట్టుకుని సపర్యాలు చేస్తుండటం అక్కడున్నవారి మనసుల్ని మెలిపెడుతోంది.

# తెలంగాణలో వారందరికీ గుడ్‌న్యూస్.. 3 కొత్త కార్పొరేషన్లు, అదనంగా ఇండ్లు.. సీతక్క కీలక ప్రకటన



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో ఎస్టీలందరికీ మంత్రి సీతక్క భారీ శుభవార్త వినిపించింది. నిర్మల్ జిల్లా బాసరలోని నిర్వహించిన సంత్ సేవాలాల్ 286వ జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి సీతక్క.. ఎస్టీల కోసం తెలంగాణలో మరో మూడు కొత్త కార్పొరేషన్లు ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి సీతక్క కీలక ప్రకటన చేశారు. కొమురం భీం, సేవా లాల్, ఏకలవ్య పేర్లతో కొత్త కార్పొరేషన్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ క్రమంలోనే ఎస్టీల కోసం అదనంగా ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సీఎంను కోరినట్టు తెలిపారు.తెలంగాణలో ఎస్టీల కోసం మూడు కొత్త కార్పొరేషన్లు ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి సీతక్క కీలక ప్రకటన చేశారు. కొమరం భీం, సేవా లాల్, ఏకలవ్య పేరిట కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. నిర్మల్ జిల్లా బాసరలోని గోదావరి నది ఒడ్డున నిర్వహించిన శ్రీ సంత్ సేవాలాల్ 286వ జయంతి ఉత్సవాలకు మంత్రి సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క ఎస్టీలకు గుడ్ న్యూస్ వినిపించారు. ఎస్టీల కోసం మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. మైదాన ప్రాంతాల్లో సైతం ఐటీడీఏలు ఏర్పాటు చేసి ఆ ప్రాంత గిరిజనులకు అభివృద్ధికి ఫలాలు అందేలా చేస్తామని సీతక్క తెలిపారు.మరోవైపు.. ఎస్టీల కోసం అదనపు ఇండ్లు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని మంత్రి సీతక్క తెలిపారు. పూర్వీకుల చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాలని తెలిపారు. ఈ క్రమంలోనే.. సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని బంజారా ఉద్యోగులకు సెలవులు ఇచ్చామని తెలిపారు. అన్ని వర్గాలు వైశమ్యాలు లేకుండా కలిసికట్టుగా ఉండాలని తెలిపారు. 286వ సంత్ సేవాలాల్ జయంతి వేడుకలకు పౌర గాడ్ పీఠాధిపతి బాబుసింగ్ మహరాజ్, ఎంపీ గోడం నగేష్ పలువురు ఎమ్మెల్యేలు, మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్ ముఖ్య నాయకులకు సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవ సమితి సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.మరోవైపు.. శనివారం (ఫిబ్రవరి 15న) రోజున హైదరాబాద్ బంజారా హిల్స్‌లోని బంజారాభవన్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న సీతక్క.. బంజారా భాషను అధికారంగా గుర్తించి, రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో పెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. ఈ అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని సీతక్క తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌తో పాటు ఐటీడీఏలను కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిందని చెప్పుకొచ్చారు. 286 ఏండ్ల క్రితం జన్మించిన సంతు సేవాలాల్ ఎప్పటికీ చిరస్మరణీయుడేనని, సేవా సిద్ధాంతాలే ఆయనను సజీవంగా నిలుపుతున్నాయని వివరించారు. బంజారాలను సంచార జీవితం నుంచి విముక్తి కల్పించిన మహనీయుడు, బంజారాల స్థిర నివాసం కోసం తండాలు ఏర్పాటు చేసిన గొప్ప వ్యక్తి సేవలాల్ అని మంత్రి కొనియాడారు. జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలు మరవొద్దని, వేష భాషలను మర్చిపోవద్దని, బంజారా డ్రెస్సులు ధరించాలని సూచించారు. మన జాతి గురించి సగర్వంగా చెప్పుకోవాలని, జాతి ప్రయోజనాలు పొందుతున్నా.. జాతి గురించి చెప్పుకునేందుకు కొందరు ఇబ్బందులు పడుతుంటారని అన్నారు. వచ్చే ఏడాది సేవాలాల్ జయంతి ఉత్సవాన్ని ఎల్ బీ స్టేడియంలో నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరుతామని సీతక్క తెలిపారు.

సంత్ సేవలాల్ జయంతి ఉత్సవాల నిర్వహణకు గతంలో కోటి రూపాయలు కేటాయిస్తే ఈసారి ప్రభుత్వం.. రూ.2 కోట్లు కేటాయించినట్టు సీతక్క తెలిపారు. ఎస్టీల సంక్షేమ కోసం బడ్జెట్లో రూ.17 వేల కోట్లు కేటాయించామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఇతర పథకాలకు వాడుకున్నారని సీతక్క ఆరోపించారు.

# హైదరాబాద్ మెట్రో రెండో దశలో కొత్త లేఅవుట్లు.. ఆ 2 రూట్లలో అండర్ గ్రౌండ్ కారిడార్లు, సరికొత్త టెక్నాలజీతో..!



**హైదరాబాద్-నవభూమి:**హైదరాబాద్ మెట్రో సెకంట్ ఫేజ్‌లో రేవంత్ రెడ్డి సర్కార్ రెండు కొత్త మార్గాలను ప్రతిపాదించిన విషయం తెలిసిందే. అయితే.. ఈ మార్గాల్లో హైదరాబాద్ మెట్రో.. సరికొత్త టెక్నాలజీతో అండర్ గ్రౌండ్ కారిడార్లు నిర్మించేందుకు ప్లాన్ సిద్ధం చేస్తోంది. ఈ మేరకు.. డీపీఆర్లు సిద్ధం చేసేందుకు కసరత్తు కూడా ప్రారంభించింది. ఇందుకోసం ఇప్పటికే ఆయా మార్గాల్లో భూసామర్థ్య పరీక్షలు కూడా చేపట్టింది. మార్చి నెలాఖరు వరకల్లా డీపీఆర్‌లు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించనున్నట్టు ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

రేవంత్ రెడ్డి సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హైదరాబాద్ మెట్రో రెండో దశ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. అయితే.. ఈ మెట్రో రెండో దశలో సరికొత్త టెక్నాలజీని ఆవిష్కరించేందుకు సర్కార్ సిద్ధమవుతోంది. ఆయా మార్గాల్లో అండర్ గ్రౌండ్ కారిడార్లను నిర్మించేందుకు హైదరాబాద్ మెట్రో కొత్త లేఅవుట్లను సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు హైదరాబాద్ మెట్రో సారథ్యంలో సాంకేతిక నిపుణులు, అధికారులు కొత్త మెట్రో మార్గాలను రూపొందించేందుకు ఇప్పటికే కసరత్తు కూడా ప్రారంభించారు.23 కిలోమీటర్ల మేర నిర్మించే ప్యారడైజ్- మేడ్చల్ కారిడార్, 22 కిలోమీటర్ల జేబీఎస్- శామీర్‌పేట్ ప్రతిపాదిత కారిడార్ అలైన్‌మెంట్లకు సంబంధించి అధికారులు ఇప్పటికే కసరత్తు పూర్తి చేశారు. ఇక.. జేబీఎస్ నుంచి మేడ్చల్, జేబీఎస్ నుంచి శామీర్ పేట్ మెట్రో కారిడార్లకు డీపీఆర్‌ల తయారీకై అవసరమైన వివిధ రకాల సర్వే పనులు జోరుగా సాగుతున్నాయని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.డీపీఆర్‌ల తయారీకి ముఖ్యంగా ట్రాఫిక్ సర్వే, భూసామర్థ్య పరీక్షలు, పర్యావరణ ప్రభావ అధ్యయనం లాంటి 3 రకాల అధ్యయనాలు అవసరమని మెట్రో అధికారులు గుర్తించారు. ట్రాఫిక్ సర్వేకి సంబంధించిన అధ్యయనంలో ఈ కారిడార్లలో ప్రస్తుతం జరుగుతున్న రోజువారీ ప్రయాణాల సంఖ్య, భవిష్యత్తులో రోజువారీ ప్రయాణాల అంచనాలు, జంక్షన్ల వద్ద ప్రయాణికులు తీసుకునే మలుపులు, పాదచారుల సంఖ్య, వాహన ప్రయాణాలకు పట్టే సమయం, వాహన ప్రయాణాల్లో ఎంత శాతం మెట్రో రైలుకు మారే అవకాశం, వివిధ మెట్రో స్టేషన్లు ఏర్పాటయ్యే ప్రదేశాల ప్రయాణ సాంద్రత వంటి అనేక అంశాలు మెట్రో అధికారులు పరిశీలిస్తున్నారు.ఇక.. పర్యావరణ ప్రభావ అధ్యయనంలో ప్రస్తుతం ఈ మార్గాల్లో ఉన్న గాలి పరిశుభ్రత, గాలిలో ఉన్న దూళికణాల శాతం, కాలుష్య కారకాల నిర్ధారణ, శబ్ద కాలుష్యం, నీటి వనరులు, వృక్ష, జంతుజీవాల జీవ వైవిధ్యం, జీవనాధారభ్రుతులపై ప్రాజెక్టు చూపే ప్రభావం వంటి అంశాలు పరిశీలన చేయవల్సి ఉంటుందని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.ఇక.. భూసామర్థ్య పరీక్షల్లో భాగంగా ఈ మార్గాల్లో ఉండే వివిధ రకాల మట్టి, రాతి పొరల నమూనాలు, వివిధ నిర్మాణాలకు కావాల్సిన భూ సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. భూగర్భంలో నిక్షిప్తమైన నీటి లెవెల్స్ అంచనాలు, భూకంపాలు ఏర్పడే అవకాశాలు వంటి విషయాలు క్షుణ్ణంగా అధ్యయనం చేసి మెట్రో స్తంభాలు, స్టేషన్లు, ఇతర నిర్మాణాలను ఎంత బలంగా డిజైన్ చేయాలో నిర్ణయిస్తారు. సాధారణంగా ప్రతి అర కిలోమీటర్‌కు ఒక బోర్ హోల్ చొప్పున భూసామర్థ్య పరీక్షల నమూనాలు తీసుకోవడం జరుగుతోంది. ఒక్కొక్క హోల్‌ను 50 నుంచి 100 అడుగుల లోతు వరకు డ్రిల్లింగ్ చేసి పరిశీలించనున్నట్టు ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే హెచ్ఎండీఏ, జాతీయ రహదారుల

# త్వరలో మెగా డీఎస్సీ

**(1వపేజీ తరువాయి)**కోసం మూడు పార్టీల అభ్యర్థులూ కలిసికట్టుగా పనిచేయాలి. క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకోవాలి. ఓటర్లను చైతన్యపరచాలి. 2024 ఎన్నికల్లో 93 శాతం స్ట్రైక్ రేట్‌తో కూటమికి ప్రజలు తీర్పునిచ్చారు. అలాంటి గెలుపు కోసం కృషి చేయాలి. ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇంకా 10 రోజులు మాత్రమే సమయం ఉంది. మూడు పార్టీల నేతలు నిత్యం సమన్వయంతో ఉండాలి. నేతలు కూటమి ధర్మాన్ని పాటిస్తూ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించకుండా విజయం కోసం పని చేయాలి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వచ్చే మెజారిటీ సార్వత్రిక ఎన్నికల్లో వచ్చిన దాని కంటే మెరుగ్గా ఉండాలి.ఆంధ్రప్రదేశ్ ప్రజలు మనకు పట్టం కట్టారు. వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకు ప్రతిరోజూ పని చేస్తున్నాం. వ్యవస్థలను గాడిలో పెట్టి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించాం. పాలనలో స్పష్టమైన మార్పు తీసుకొచ్చాం. బ్రాండ్ ఏపీతో పెట్టుబడులు సాధించి యువతకు ఉద్యోగాలు కల్పించే ప్రయత్నం చేస్తున్నాం. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెట్టుబడిదారుల్లో నమ్మకం కల్పించాం. దాదాపు రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులకు పైగా ఒప్పందాలు కుదుర్చుకున్నాం. దీని ద్వారా 4 లక్షలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా రాష్ట్రమంతటా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం.ప్రతి నెలా 64 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నాం. 16,347 టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వబోతున్నాం. గత ప్రభుత్వం విద్యార్థులకు బకాయిపెట్టిన ఫీజురీయింబర్స్‌మెంట్‌లో రూ.780 కోట్లు చెల్లించాం. ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతినెలా ఒకటో తేదీనే డబ్బులు చెల్లిస్తున్నాం. విద్యావంతులైన మహిళలకు వర్క్ ఫ్రమ్ హోమ్ ద్వారా ఆదాయ మార్గాల కల్పనకు ఆలోచనలు చేస్తున్నాం. ఇవన్నీ 8 నెలల్లోనే కూటమి ప్రభుత్వం చేపట్టింది. చేసిన మంచి కార్యక్రమాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కూటమి నేతలపై ఉందని" చెప్పారు.

# కేశినేని ఈజ్ బ్యాక్...ఆపరేషన్ ఢిల్లీ..!!

**విజయవాడ-నవభూమి:** కేశినేని నాని..పరిచయం అక్కర్లేని పేరు. విజయవాడ ఎంపీగా తనదైన ముద్ర వేశారు. టీడీపీలోనే ఉంటూ ఆ పార్టీకే చుక్కలు చూపించిన నేత. ఇక 2024 ఎన్నికలకు ముందు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ కండువా అలా కప్పుకున్నారో లేదో.. ఇక టీడీపీ భరతం పట్టడం ప్రారంభించారు. 2024 ఎన్నికల్లో తన తమ్ముడు కేశినేని చిన్ని చేతిలో ఓటమిపాలయ్యారు. ఇక ఆ తర్వాత రాజకీయాలకు గుడ్‌బై చెప్పేశారు. పొలిటికల్ పవర్ రుచి చూసిన వారు దాన్ని అంత తేలిగ్గా మరిచిపోలేరు. కేశినేని నాని విషయంలో కూడా అదే జరుగుతున్నట్లుగా కనిపిస్తోంది. తాజాగా కేశినేని నాని తిరిగి రాజకీయాల్లో యాక్టివ్ అవుతున్నట్లు కనిపిస్తున్నారు. కేశినేని నాని ఈజ్ బ్యాక్ : విజయవాడ మాజీ ఎంపీ కేశినేని నాని తిరిగి యాక్టివ్ పాలిటిక్స్‌లోకి ఎంటర్ అవుతున్నట్లు సమాచారం.

# పురందేశ్వరికి ఢిల్లీ పిలుపు

**(1వపేజీ తరువాయి)**చేసింది. కొత్తగా ఎవరికి అవకాశం ఇవ్వాలనే దాని పైన ఒక నిర్ణయానికి వచ్చింది. ఈ సమయంలో పురందేశ్వరి ఢిల్లీలో పార్టీ నాయకత్వానికి అందుబాటు లో ఉండనున్నారు. కూటమిలో ఉన్నా.. పార్టీలో చేరికల విషయంలో ఎలాంటి అలసత్వం వద్దని పార్టీ నాయకత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. అయితే, బీజేపీలో చేరికల పైన టీడీపీ నేతలు కొంత మంది అభ్యంతరాలు వ్యక్తం చేయటం పైన బీజేపీ నాయకత్వం ఆరా తీస్తోంది. కూటమిలో బీజేపీ ఉన్నా.. పార్టీలో చేరికల విషయంలో ఏ మాత్రం సంకోచించాల్సిన అవసరం లేదని తేల్చేసారు. కీలక మార్పులు విశాఖ, గోదావరి జిల్లాల్లో వైసీపీ నుంచి కొందరు నేతలు బీజేపీలో చేరేందుకు ప్రయత్నాలు చేసా రు. అయితే.. టీడీపీ నుంచి వచ్చిన అభ్యంతరాలతో వారి చేరికలు ఆగినట్లు పార్టీ నాయకత్వానికి సమాచారం అందింది. బీజేపీలో చేరికల పైన ఇతర పార్టీలు అభ్యంతరం చెప్పటం ఏంటని ఢిల్లీ నేతలు అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇదే సమయంలో పురందేశ్వరిని పార్టీ అధ్యక్షురా లెగా కొనసాగింపు పైన ప్రతిపాదనలు వచ్చాయి. అయితే.. పార్టీ నాయకత్వం మార్పు పైనే ఎక్కువ గా ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో.. పురందేశ్వరికి పార్టీ జాతీయ స్థాయిలో బాధ్యతలు కేటాయిస్తారని సమాచారం. తాజా పరిణామాలతో బీజేపీ ఏపీ విషయంలో తీసుకునే నిర్ణయాల పైన రాజకీయంగా ఆసక్తి కొనసాగుతోంది.

# సైకిలెక్కనున్న వైసీపీ ఎమ్మెల్సీ!

**(1వపేజీ తరువాయి)**అయితే గుంటూరు వెస్ట్‌లో ఓడిన మాజీ మంత్రి విడదల రజినీని మళ్లీ చిలకలూరిపేటకు మార్చారు. దీంతో తనకు ఎదురుచూపులు తప్ప.. అవకాశం రాదని భావించిన ఆయన పార్టీ మారడమే బెటర్ అనే నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. నరసారావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు ద్వారా మర్రి టీడీపీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే టీడీపీ పెద్దలతో సంప్రదింపులు కూడా పూర్తయినట్లు చెబుతున్నారు. అయితే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి టీడీపీలో చేరాలా? లేక ఎమ్మెల్సీగానే కొనసాగాలా? అనే విసయమై ప్రస్తుతం ఆయన తర్జనభర్జన పడుతున్నట్లు చెబుతున్నారు. అసెంబ్లీలో సంపూర్ణ మెజార్టీ ఉన్న ప్రభుత్వానికి మండలిలో బలం లేదు. మండలిలో మెజార్టీ రావాలంటే మరో రెండేళ్లు ఆగాల్సివస్తోంది. దీంతో కీలక బిల్లులు ఆమోదం విషయంలో ప్రభుత్వానికి చిక్కులు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఎవరు రాజీనామా చేసినా గెలిపించుకునే పరిస్థితి ఉన్నందున నైతిక విలువలు పాటించామని చెప్పుకునేందుకు రాజీనామాలు చేయించాలని ప్రభుత్వ పెద్దలు ఆలోచనగా చెబుతున్నారు. ప్రస్తుతం వైసీపీ నుంచి వచ్చిన ఎమ్మెల్సీలు అంతా రాజీనామా చేస్తూనే ఉన్నారు.

# ట్రిపుల్ ఇంజిన్ సర్కార్

**(1వపేజీ తరువాయి)**రాష్ట్రాలకు 15 చోట్ల బీజేపీ ప్రభుత్వాలే పాలిస్తున్నాయి. డబుల్ ఇంజిన్ సర్కారు ఉంటే నిధుల విడుదలలో సమస్య ఉండదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి అభివృద్ధిని పరుగులు పెట్టించవచ్చని ప్రతి ఎన్నికల్లోనూ ప్రచారం చేసేవారు బీజేపీ నేతలు. వారి మాటలను ప్రజలు విశ్వసించి పట్టం కట్టారు. అయితే ఇప్పుడు బీజేపీ ప్రచారాన్ని మరింత విస్తరించింది. డబుల్ ఇంజన్ పోయి ట్రిపుల్ ఇంజన్ సర్కారు తెద్దామంటూ ప్రజలకు పిలుపునిస్తోంది. అయితే ట్రిపుల్ ఇంజిన్ ఏంటన్న సందిగ్ధత చాలామందిలో కనిపిస్తోంది. దీనికి తనదైన స్టైల్ లో సమాధానం చెప్పారు ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేందర సచ్ దేవ్. ఢిల్లీ రాష్ట్ర అసెంబ్లీలో సుదీర్ఘ కాలం తర్వాత గెలిచిన బీజేపీ.. ఇప్పుడు తన నెక్స్ట్ టార్గెట్ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ అంటోంది. ప్రస్తుతం ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఆప్ చేతిలో ఉంది. వచ్చే ఏప్రిల్ లో కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్నాయి. ఎలాగూ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించిన ప్రజలు.. కార్పొరేషన్ లోనూ గెలిపించి ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు చేసేలా మద్దతు పలకాలని బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్ దేవ్ పిలుపునిస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిచిన తర్వాత ఆప్ పార్టీకి చెందిన ముగ్గురు కార్పొరేటర్లు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన ఢిల్లీ ప్రజలకు ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ సాధనకు మద్దతు పలకాలని పిలుపునివ్వడం పొలిటికల్ సర్కిల్స్ లో చర్చకు దారితీసింది. ఏదైనా కమలనాథులు అనుకుంటే సాధించేవరకు విశ్రమించరని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు రుజువు చేశాయి. దాదాపు 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ గద్దెపై జెండా ఎగరేసిన కమలం నేతలు నెక్స్ట్ తమ గురి కార్పొరేసన్ అంటున్నారు. మరి వారి ఆశలు ఫలిస్తాయా? డబుల్ ఇంజిన్ సర్కారుకు ఓటు వేసిన ప్రజలు.. ట్రిపుల్ ఇంజిన్ ప్రచారానికి మద్దతుగా నిలుస్తారో? లేదో? చూడాల్సివుంది.

# డిపాజిటర్లకు కుచ్చుటోపీ!

**(1వపేజీ తరువాయి)**చేశారు. ప్రజలను మోసం చేసిన సంస్థకు చెందిన 20 మందిపై సైబర్ క్రైం పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎఫ్ఐడీ డైరెక్టర్లు అమర్ దీప్ కుమార్, కావ్యలను పోలీసులు ఏ1, ఏ2గా కేసులో చేర్చారు. ఈ సంస్థకు చెందిన మరో ఆరుగురు కీలక ఉద్యోగులు దేశంలోనే ఉన్నట్లు భావిస్తున్న పోలీసులు.. వారి కోసం గాలింపు చేపట్టారు. ఎఫ్ఐడీ బిజినెస్ హెడ్ పవన్‌ను అరెస్ట్ చేసిన సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు.. రిమాండ్‌కు తరలించారు.

# బంగారుగనిలో మృత్యుక్రీడ

**మాలి-నవభూమిబ్యూరో:**ఓ బంగారు గని కుప్పకూలిన ఘటన ఆఫ్రికా దేశం మాలిలో చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో 42 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మాలి దేశంలోని తూర్పు ప్రాంతంలో ఉన్న ఈ గని కొందరు చైనా జాతీయులు నిర్వహణలో ఉంది. ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడడంతో కార్మికులు తప్పించుకోలేకపోయారు. కొన్ని రోజుల వ్యవధిలోనే మాలి దేశంలో జరిగిన రెండో ప్రమాదం ఇది. గత నెల 29న కౌలికోరో ప్రాంతంలో ఉన్న ఓ బంగారు గని కూలిపోయిన ఘటనలోనూ ప్రాణనష్టం జరిగింది.

మాలి దేశం ఆఫ్రికాలోని మూడో అతి పెద్ద బంగారం ఉత్పత్తిదారుగా ఉంది. ఇక్కడి జనాభాలో 10 శాతం కంటే ఎక్కువమంది గనులపై ఆధారపడి మనుగడ సాగిస్తున్నారు. గతేడాది కూడా మాలిలో ఓ బంగారు గని కుప్పకూలి 70 మంది మృత్యువాతపడ్డారు. ఇక్కడి గనుల్లో చాలా వరకు అనుమతులు లేనివే ఉంటాయని తెలుస్తోంది.

# హరీశ్ రావు పీఏ అరెస్ట్

**(1వపేజీ తరువాయి)**బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పీఏ వంశీకృష్ణతోపాటు ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ చేయడంతోపాటు బెదిరింపులకు పాల్పడిన ఆరోపణలతో వంశీకృష్ణతోపాటు సంతోష్ కుమార్, పరశురాములును అదుపులోకి తీసుకున్నారు. చక్రధర్ కు బెదిరింపు కాల్స్, మెసేజ్‌లు చేస్తూ డబ్బులు వసూలు చేశారని ముగ్గురు నిందితులపై ఆరోపణలు ఉన్నాయన్నారు. కేసులో ఏ1గా హరీశ్ రావు, ఏ2గా రాధాకృష్ణన్ రావు ఉన్నారు. సిద్దిపేట జిల్లాలో చక్రధర్ గౌడ్ ఎలాంటి సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనకుండా వంశీకృష్ణ, సంతోష్ కుమార్, పరశురాములు కలిసి ఓ రైతు గుర్తింపు కార్డులతో సిమ్ కార్డు కొనుగోలు చేసి బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపణలున్నాయి. అంతేగాక, గతంలో ఆరోగ్యశ్రీ శాఖలో పనిచేస్తూ అవినీతికి పాల్పడినట్లు హరీశ్‌రావు పీఏ వంశీకృష్ణపై ఆరోపణలున్నాయి. ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్నారు. ఆరోగ్యశాఖ మంత్రిగా హరీశ్ రావు ఉన్నప్పుడు ఆయన పేషీలో వంశీకృష్ణ పనిచేశారు. ఫోన్ ట్యాపింగ్, బెదిరింపులపై చక్రధర్ గౌడ్ గత సంవత్సరం పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు తాజాగా, నిందితుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఫిబ్రవరి 28 వరకు ముగ్గురు నిందితులకు రిమాండ్ విధించారు.

# మద్యం అమ్మకాల్లో మనమే టాప్

**(1వపేజీ తరువాయి)**తాగున్నారట. అయితే, వీరి సంఖ్య గతం కంటే కాస్త తగ్గిందని పేర్కొంది. రాజ్య సభలో ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ.. దేశంలో తెలంగాణలోనే అత్యధిక మంది మద్యం తాగుతున్నట్లు తెలిపారు. 50శాతం మంది పురుషులు రాష్ట్రంలో మద్యం తాగుతున్నారని పేర్కొన్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే -4 ప్రకారం.. ఏపీలో 34.9 శాతం, తెలంగాణలో 53.8 శాతం మంది పురుషులు మద్యం తాగుతున్నారు. 21 నాటి 5వ సర్వే నివేదిక ప్రకారం.. రెండు రాష్ట్రాల్లో ఆ సంఖ్య కాస్త తగ్గింది. ఏపీలో 31.2శాతం, తెలంగాణలో 50 శాతం మంది పురుషులు మద్యం తాగుతున్నారట. 2024 జూన్ నాటికి తెలంగాణలో 2,620 మద్యం దుకాణాలు, 1,200 బార్లు, క్లబ్బులు ఉన్నాయి. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరానికి మద్యం అమ్మకాల ద్వారా వ్యాట్, ఎక్సైజ్ డ్యూటీ రూపంలో రూ.36 వేల కోట్ల ఆధాయం వస్తుందని తెలంగాణ ప్రభుత్వం అంచనా వేసింది. తెలంగాణలో మద్యం దుకాణాలు, బార్లు విస్తృతంగా ఉన్నందునే మద్యం వినియోగం పెరుగుతోందని కేంద్రం తెలిపింది.

# మరోసారి కులగణన సర్వే షురూ..

**(1వపేజీ తరువాయి)**వివరాలు సేకరించనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు టోల్ ఫ్రీ నెంబర్ కూడా ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ కాల్ సెంటర్ పని చేస్తుందని తెలిపారు. ఫోన్ చేసిన వారి ఇళ్లకి వెళ్లి ఎన్యుమరేటర్లు వివరాలు నమోదు చేసుకోనున్నారు. ఎంపీడీవో కార్యాలయం, వార్డు ఆఫీసులకు వెళ్లి కూడా వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. ఇందుకోసం ప్రభుత్వ వెబ్ సైట్ నుంచి అప్లికేషన్ డౌన్ లోడ్ చేసుకోని వివరాలు నమోదు చేసి, సంతం చేసిన తర్వాత అధికారులకు సమర్పించాలని ప్లానింగ్ డిపార్ట్మెంట్ అధికారులు తెలిపారు. ఇక మూడో విధానంలో నేరుగా ప్రజా పాలన కేంద్రానికి వెళ్లి అక్కడే దరఖాస్తు నింపి ఇవ్వొచ్చన్నారు. ఆధార్ నంబర్, మొబైల్ నెంబర్, అడ్రస్‌తో పాటుగా పోస్టల్ పిన్ కోడ్ నెంబర్ ను తెలియజేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.



## వీడెం భర్త సామి.. న్యూడ్ కాల్స్ చేయిస్తూ డబ్బులు సంపాదిస్తున్నాడు



**న్యూఢిల్లీ-నవభూమి:**బంధాలు.. అనుబంధాల రూపురేఖలు మారిపోతున్నాయి. గడిచిన కొన్నేళ్లుగా చోటు చేసుకుంటున్న పరిణామాలు షాకింగ్ గా మారుతున్నాయి. భార్యను కొందరు భర్తలు చూసే తీరు.. అనుసరించే విధానాల్ని చూస్తే.. దేవుడా.. అనుకోకుండా ఉండలేం. అలాంటి కోవకు చెందిన మరో ఉదంతం తెర మీదకు వచ్చింది. తిరుపతికి చెందిన ఒక ఇల్లాలు తాజాగా పోలీసుల్ని ఆశ్రయించింది. తన భర్త చేసే తప్పుడు పనుల జాబితాను చెప్పటమే కాదు.. తనకు జరుగుతున్న అన్యాయం మీద ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.తిరుపతి జిల్లాకు చెందిన బాధితురాలు.. కరోనా వేళ దారుణంగా మారిన ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఒక ప్రైవేట్ యాప్‌లో న్యూడ్ కాల్స్ మాట్లాడాలని చెప్పాడన్నారు. అలా చేస్తే డబ్బులు వస్తాయని నచ్చజెప్పి.. ఆ పని చేయించాడన్న ఆమె.. "నా చేత అలా మాట్లాడించి డబ్బులు సంపాదించాడు. రెండేళ్లలో రూ.18 లక్షలు వచ్చాయి. దీంతో ఇక నుంచి ఆ పని చేయనని తేల్చి చెప్పా. దీంతో భౌతిక దాడులకు పాల్పడుతున్నాడు" అంటూ ఆమె వాపోయారు. కొన్ని రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు తన ఫోటోలు.. వీడియోలు సోషల్ మీడియాలో పెట్టారని.. దీంతో నింద తన మీద వేసిన భర్త.. కుటుంబ సభ్యులు తనను ఇంటి నుంచి బయటకు వెళ్లగొట్టారన్నారు. తనపై భర్త దాడికి పాల్పడినట్లుగా పేర్కొన్నారు. "నా పిల్లల్ని సైతం చూడనివ్వటం లేదు. ఇదే అంశంపై రామచంద్రాపురం పోలీసు స్టేషన్‌లో కంప్లైంట్ చేశా. కానీ ఎలాంటి స్పందన లేదు.

## చంపుతామంటూ బెదిరిస్తున్నారు.. ఇన్‌స్టా పోస్ట్‌లో రణ్‌వీర్



**న్యూఢిల్లీ-నవభూమి:** 'ఇండియాస్ గాట్ లాటెండ్' షోలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియా తాజాగా ఒక పోస్ట్‌లో తనను చంపుతామంటూ బెదిరింపు కాల్స్ వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తానెక్కడికీ పారిపోవడం లేదని, పోలీసులకు తాను సహకరిస్తానని అన్నారు.

రణ్‌వీర్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండటం, అతని కోసం ముంబై పోలీసులు గాలిస్తున్న నేపథ్యంలో ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో తాజా పోస్ట్ పెట్టారు. "నేను, నా టీమ్ టీమ్ మొత్తం పోలీసులకు, ఇతర అధికారులకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నాం. అన్ని ఏజెన్సీలకు అందుబాటులో ఉంటాం. తల్లితండ్రుల మీద నేను చేసిన వ్యాఖ్యలు అగౌరవపరచేలా ఉన్నాయని అంగీకరిస్తున్నాను. మనస్ఫూర్తిగా క్షమాపణలు తెలియజేస్తున్నాను" అని రణ్‌వీర్ పేర్కొన్నారు. తాను ఎక్కడికీ పారిపోవడం లేదని, తనను చంపుతామని, తన కుటుంబాన్ని అవమానంపాలు చేస్తామని బెదిరింపులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పేషెంట్ల పేరుతో తన తల్లి క్లినిక్‌కు వచ్చి ఆమెను కొందరు బెదిరించినట్టు చెప్పారు. అసలు ఏం జరుగుతోందో తెలియని భయాందోళనలో ఉన్నట్టు చెప్పారు. తాను పారిపోయేది లేదని, పోలీసులు, న్యాయవ్యవస్థపై తనకు ఎంతో నమ్మకం ఉందని చెప్పారు.

జరిగిందిదే...సమయ్ రైనా 'ఇండియాస్ గాట్ లాటెండ్' షోలో పాల్గొన్న ఓ వ్యక్తిని తల్లిదండ్రులు, శృంగారంపై రణ్‌వీర్ ప్రశ్నించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. దీనిపై వివిధ రాష్ట్రాల్లో ఆయనపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అయితే వెంటనే ఆయన తన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పారు. అయినప్పటికీ దర్యాప్తులో భాగంగా మహారాష్ట్ర ఖార్ పోలీసుల ముందు హాజరయ్యారు. ఇదే సమయంలో తనపై వివిధ రాష్ట్రాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఒకేచోట క్లబ్ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టును రణ్‌వీర్ ఆశ్రయించారు.

## రణ్‌వీర్ తరపున వాదిస్తున్న లాయర్ ఎవరో తెలుసా?



**న్యూఢిల్లీ-నవభూమి:**'ఇండియాస్ గాట్ లాటెండ్' షోలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియా సుప్రీంకోర్టును ఆశ్రయించడం ఇప్పుడు ఆసక్తిగా మారింది. అయితే అంతకంటే ఆసక్తికరమైన మరో అంశం కూడా వెలుగు చూసింది. ఆయన తరఫున అభినవ్ చంద్రచూడ్ లాయర్‌గా వ్యవహరిస్తున్నారు. అభినవ్ మరెవరో కాదు, ఇటీవల సుప్రీంకోర్టు సీజేఐగా బాధ్యతల నుంచి పదవీ విరమణ చేసిన జస్టిస్ డీవై చంద్రచూడ్ కుమారుడు కావడం విశేషం.

సమయ్ రైనా 'ఇండియాస్ గాట్ లాటెండ్' షోలో పాల్గొన్న ఓ వ్యక్తిని తల్లిదండ్రులు, శృంగారంపై రణ్‌వీర్ ప్రశ్నించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. దీనిపై వివిధ రాష్ట్రాల్లో ఆయనపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అయితే వెంటనే ఆయన తన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పారు. అయినప్పటికీ దర్యాప్తులో భాగంగా మహారాష్ట్ర ఖార్ పోలీసుల ముందు హాజరయ్యారు. ఇదే సమయంలో తనపై వివిధ రాష్ట్రాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఒకేచోట క్లబ్ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టును రణ్‌వీర్ ఆశ్రయించారు. ఈ కేసులో ఆయన తరఫు న్యాయవాదిగా అభినవ్ చంద్రచూడ్ వాదించనున్నారు.

అభినవ్ వివరాలివే..మాజీ సీజేఐ డీవై చంద్రచూడ్ కుమారుడు అభినవ్ కాగా, ఆయన తాతగారు వైవి చంద్రచూడ్ సైతం సుదీర్ఘకాలం చీఫ్ జస్టిస్‌గా పనిచేశారు. అభినవ్ విద్యావేత్తగా, రచయితగా పేరు తెచ్చుకున్నారు. ముంబై ప్రభుత్వ న్యాయకళాశాలలో 2008లో పట్టభద్రులయ్యారు. ఆ తర్వాత అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలలో ఎల్ఎల్ఎం చేశారు. అంతర్జాతీయ న్యాయ సంస్థల్లో ప్రాక్టీస్ చేశారు. పలు పుస్తకాలు కూడా రచించారు. రిపబ్లిక్ ఆఫ్ రొటోరిక్: ఫ్రీ స్పీచ్ అండ్ ది కన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా (2017), సుప్రీం విష్పర్స్: కన్వర్షేషన్స్ విత్ జడ్జెస్ ఆఫ్ సుప్రీంకోర్ట్ ఆఫ్ ఇండియా 1980-1989(2018) వంటి రచనలు చేశారు. ఆసక్తికరంగా, అభినవ్ ఇంతవరకూ సుప్రీంకోర్టులో ఏ కేసు వాదించలేదని తెలుస్తోంది.

## కుంభమేళాను పొడిగించండి.. యోగి సర్కార్‌ను కోరిన అఖిలేష్



**లక్నో-నవభూమి:** ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాను మరికొద్ది రోజులు పొడిగించాలని సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని శనివారంనాడు కోరారు. లక్షలాది మంది భక్త జనం పోటెత్తుతుండటం, ఎలాగైనా కుంభ్‌మేళాలో పాల్గొనాలనే ఆశతో వేలాది మంది రోడ్లపైనే నిరీక్షిస్తుండటంతో అఖిలేష్ ఈ విజ్ఞప్తి చేశారు. గతంలో మహాకుంభ్, కుంభ్‌మేళాలు 75 రోజుల పాటు నడిచేవని, ఇప్పుడు కుంభ్‌మేళాకు నిర్దేశించిన రోజులు తక్కువగా ఉన్నాయని ఆయన తెలిపారు."ఇప్పుడు కూడా చాలా మంది మహాకుంభ్‌కు వెళ్లాలని అనుకుంటున్నా వెళ్లలేకపోతున్నారు. ఆ పరిస్థితుల్లో మహాకుంభ్ కాలవ్యవధిని ప్రభుత్వం పొడిగించాలి" అని అఖిలేష్ కోరారు. కాగా, కొద్దిరోజులుగా మహాకుంభ్ మేళాకు వెళ్తున్న రైళ్లు కిటకిటలాడుతుండటం, రోడ్డన్నీ కిక్కిరిసి ఉండటం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఘాట్లకు వెళ్లే దారిలో కిలోమీటర్ల పొడవునా క్యూలు కనిపిస్తున్నాయి. విపరీతమైన రద్దీ కారణంగా ప్రయాగ్‌రాజ్ సంగమ్ రైల్వే స్టేషన్‌ను తాత్కాలికంగా మూసేశారు.ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక ఉత్సవంగా నిర్వహిస్తున్న మహాకుంభ్ మేళా జనవరి 13న మొదలై ఫిబ్రవరి 26వ తేదీ 'మహాశివరాత్రి'తో ముగియనుంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఫిబ్రవరి 14వ తేదీ శుక్రవారం సాయంత్రం వరకూ త్రివేణి సంగమంలో స్నానాలు చేసిన వారి సంఖ్య 50 కోట్లకు చేరింది.

# కోడలికి ఎయిడ్స్ ఇంజెక్షన్ ఇచ్చి.. అత్తింటివారి దారుణం




**న్యూఢిల్లీ-నవభూమి:**ఆ కోడలికి అత్తగారింట్లో అడుగడుగునా వేధింపులే ఎదురయ్యాయి. భర్తను, అత్తామామలను ఎంత బాగా చూసుకున్నా.. వారు కనికరించలేదు. కూతురిలాగా చూడాల్సిన కోడలిని.. వారు కనీసం మనిషిగా కూడా చూడలేదు. పుట్టింటి నుంచి భారీగా కట్నం తీసుకువచ్చినా.. మరింత కట్నం తీసుకురావాలని ఒత్తిడి తీసుకువచ్చారు. వినకపోవడంతో ఆమెను చిత్రహింసలకు గురి చేశారు. ఈ క్రమంలోనే ఎంతకు తెగించారంటే.. అత్తమామలు కలిసి.. కోడలికి ఎయిడ్స్ ఇంజెక్షన్ కూడా ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఆ యువతి తండ్రి.. కోర్టును ఆశ్రయించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఉత్తరాఖండ్‌లో జరిగిన ఈ ఘటన ఇప్పుడు తీవ్ర విమర్శలకు తావిస్తోంది.ఉత్తర్‌ప్రదేశ్ సహరాన్‌పూర్‌కు చెందిన ఒక యువతికి.. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌కు చెందిన అభిషేక్ అలియాస్ సచిన్‌తో పెళ్లి జరిగింది. 2023 ఫిబ్రవరి 15వ తేదీన వారి వివాహం జరిగింది. కట్నకానుకల కింద యువతి తల్లిదండ్రులు మొత్తంగా రూ.15 లక్షలు ముట్టజెప్పారు. ఈ క్రమంలోనే పెళ్లి జరిగిన కొన్నిరోజులు ఆ యువతి పట్ల భర్త, అత్తామామలు బాగానే ఉన్నా.. ఆ తర్వాతే వాళ్ల అసలు రాక్షసరూపం బయటికి వచ్చింది. కట్నం డబ్బులు కాకుండా.. స్కార్పియో కారు కొనాలని.. అందుకు రూ.25 లక్షలు పుట్టింటి నుంచి తీసుకురావాలని.. ఆ యువతిని అత్తామామలు వేధించసాగారు.

అయితే జరిగిన విషయాన్ని పుట్టింటివారికి ఆ యువతి చెప్పగా.. అంత డబ్బు తాము ఇచ్చుకోలేమని వారు చెప్పడంతో.. ఆ యువతిని ఇంటి నుంచి పుట్టింటికి వెళ్లగొట్టారు. దీంతో గ్రామంలో పంచాయితీ పెద్దలను ఆశ్రయించగా.. అత్తింటివారికి నచ్చజెప్పి ఆ యువతిని తిరిగి కాపురానికి పంపించారు. అయినప్పటికీ బుద్ధి మారని ఆ అత్తమామలు.. ఆమెను మరిన్ని డబ్బులు తీసుకురావాలనే వేధింపులు మాత్రం ఆపలేదు. అదనపు కట్నం తీసుకురావాలని ఆ యువతిని మానసికంగా, శారీరకంగా తీవ్ర చిత్రహింసలకు గురి చేశారు.ఈ క్రమంలోనే తమ కుమారుడికి మరో పెళ్లి చేస్తే.. మళ్లీ కట్నం వస్తుందని ఆశపడ్డ తల్లిదండ్రులు ఆ యువతిని హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే భయంకరమైన ఎయిడ్స్ వ్యాధి కలిగిన ఇంజెక్షన్‌ను ఆ యువతికి ఇచ్చారు. ఆ ఇంజెక్షన్ ఇచ్చిన కొన్నిరోజులకు ఆ యువతి తీవ్ర అనారోగ్యానికి గురైంది. ఆస్పత్రికి తీసుకెళ్లి మెడికల్ టెస్ట్‌లు చేయించగా.. ఆమెకు హెచ్ఐవీ సోకినట్లు డాక్టర్లు చెప్పడంతో అంతా షాక్ అయ్యారు. దీంతో ఆమె భర్త అభిషేక్‌కు ఎయిడ్స్ టెస్ట్ చేయగా.. అతడికి హెచ్ఐవీ లేదని తేలింది. దీంతో బాధితురాలి కుటుంబసభ్యులు ఆమె అత్తమామలపై అనుమానంతో.. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో.. చివరికి బాధితురాలు తండ్రి స్థానిక కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో గంగో కొత్వాలి పోలీసులు.. అభిషేక్, అతని తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులపై వరకట్న వేధింపులు, దాడి, హత్యాయత్నం సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అనంతరం ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

## మహా కుంభమేళాలో మరో అగ్ని ప్రమాదం.. మూడోసారి ఘటన,



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:**ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభ మేళాకు కోట్లాది మంది భక్తులు తరలివస్తున్నారు. మరికొన్ని రోజుల్లో మహా కుంభ మేళా ముగియనున్న నేపథ్యంలో రోజురోజుకూ భక్తుల తాకిడి పెరుగుతోంది. ఈ క్రమంలోనే మహా కుంభమేళా నిర్వహణ కోసం.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం.. అనేక చర్యలు చేపడుతోంది. అయితే మహా కుంభమేళా సందర్భంగా మహా కుంభ్‌నగర్‌లో తరచూ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటుండటం.. తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఇప్పటివరకు 2 సార్లు మహా కుంభమేళాలో ఫైర్ యాక్సిడెంట్లు జరిగాయి. తాజాగా శనివారం మరోసారి మహా కుంభమేళాలో అగ్ని ప్రమాదం జరిగింది.మహా కుంభ్‌నగర్‌లోని లవకుష్ ధామ్ శిబిరంలో ఈ అగ్నిప్రమాదం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈ అగ్నిప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని.. ఫైరింజన్లతో మంటలను అదుపు చేశారు. అయితే ఈ అగ్నిప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం ఏమీ జరగలేదని వెల్లడించారు. ఈ అగ్ని ప్రమాదం కారణంగా అక్కడ ఏర్పాటు చేసిన మండపాలు, టెంట్లు కాలిబూడిదయ్యాయి. కాగా ఈ అగ్ని ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు వెల్లడి కాలేదు.మహా కుంభమేళాలో ఇప్పటికే రెండుసార్లు అగ్ని ప్రమాదాలు జరిగాయి. ఫిబ్రవరి 9వ తేదీన సెక్టార్-23లో గ్యాస్ సిలిండర్ లీకేజీ కారణంగా ఫైర్ యాక్సిడెంట్ సంభవించింది. వెంటనే ఫైరింజన్లను తరలించి మంటలను అదుపు చేశాయి. అంతకుముందు జనవరి 30వ తేదీన తొలిసారి అగ్నిప్రమాదం జరిగింది. ఛత్నాగ్ ఘాట్ వద్ద టెంట్ సిటీలో మంటలు చెలరేగి.. దాదాపు 10 టెంట్లు దగ్ధం అయ్యాయి. మొత్తం మీద.. మహా కుంభమేళా ప్రారంభం నుంచి అనేక అగ్నిప్రమాదాలు సంభవించాయి. జనవరి 19వ తేదీన గోరఖ్‌పూర్‌లోని గీతా ప్రెస్ క్యాంప్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనతో 150కి పైగా కుటుంబాలు ప్రభావితం అయ్యాయి. ఆ అగ్నిప్రమాదానికి గ్యాస్ సిలిండర్ లీకేజీ కారణమని తెలుస్తోంది. అయితే గీతా ప్రెస్ వ్యక్తులు మాత్రం అగ్నిప్రమాదం బయటి వారి వల్ల జరిగిందని పేర్కొన్నారు.

## రూ.200 కోసం పోలీస్‌తో పోరాడిన ఆర్మీ మ్యాన్...



**న్యూఢిల్లీ-నవభూమి:**అభివృద్ధి చెందుతున్న భారతదేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల గురించి చాలా మంది చాలా చెబుతారనే సంగతి తెలిసిందే. అయితే... వీటితో పాటు ప్రభుత్వ అధికారుల దోపిడీ కూడా ఒక కారణమని స్వీయానుభవం ఉన్నవారు నొక్కి చెబుతుంటారు. ఈ క్రమంలో తాజాగా ఓ పోలీసుతో రూ.200 కోసం పోరాడిన ఆర్మీ మ్యాన్ కి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ గా మారింది. నెట్టింట ఓ వీడియో వైరల్ అవుతోంది. ఈ వీడియో చూసినవారు తమ ఆగ్రహాన్ని కామెంట్స్ సెక్షన్ లో చూపిస్తున్నారు. ఇలాంటి వాటిని తీవ్రంగా ఖండించాలని చెబుతున్నారు. అదనపు డబ్బులు వసూలు చేస్తున్న పోలీసుపై పోరాడిన ఆర్మీ మ్యాన్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. అసలు ఏమి జరిగిందనేది ఇప్పుడు చూద్దామ్...! తాజాగా వైరల్ అవుతోన్న వీడియో... ఒక పోలీసు, ఒక ఆర్మీ మ్యాన్, ఒక పౌరుడికి మధ్య జరుగుతున్న పోరాటానికి సంబంధించినది. ఈ ఘటనలో రైలులోని ఓ పోలీసు.. ప్రయాణికుడి నుంచి రూ.200 అడిగాడు. దీంతో... ఆర్మీ మ్యాన్ రియాక్ట్ అయ్యారు. ఆ డబ్బులు ఇచ్చినందుకు ఆ వ్యక్తిని తిట్టడంతో పాటు పోలీసును ప్రశ్నించాడు. ఈ సమయంలో... అదనపు డబ్బులు వసూల్ చేస్తున్న పోలీసుకు - ఆర్మీ మ్యాన్ కు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. దీనిపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కామెంట్లు పెడుతున్నారు. ఈ సందర్భంగా... సదరు ఆర్మీ మ్యాన్ కు మద్దతుగా నిలబడుతున్నారు. ఈ సందర్భంగా స్పందించిన ఓ యూజర్... సదరు సైనికుడికి సెల్యూట్ అని చెబుతూ.. అలాంటి పోలీసులే ఈ సమాజానికి చీడ పురుగులు అని కామెంట్ చేయగా... ఈ తరహా వేదింపులకు ముగింపు ఎప్పుడో? అని మరొకరు స్పందించారు.

# ఢిల్లీ తొక్కిసలాటలో చనిపోయింది వీళ్లే..

## మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం





**ప్రయాగ్‌రాజ్-నవభూమి:**ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు వెళ్తూ న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో 18 మంది చనిపోయారు. వారిలో 14 మంది మహిళలు.. నలుగురు చిన్న పిల్లలు ఉన్నారు. వీరే కాకుండా మరో 30 మంది ప్రయాణికులు కూడా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు అధికారులు వెల్లడించారు. చివరి నిమిషంలో రైలు ప్లాట్‌ఫాం మార్చడంతో.. తీవ్ర ఆందోళనకు గురైన ప్రయాణికులు.. ఉన్న ప్లాట్‌ఫాం నుంచి మరో ప్లాట్‌ఫాం వైపు పరుగులు తీయడంతో తోపులాట జరిగి తొక్కిసలాట చోటు చేసుకున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ క్రమంలోనే ఈ ఘోర విషాదంలో చనిపోయిన 18 మంది వివరాలను అధికారులు విడుదల చేశారు. మృతులంతా ఢిల్లీ, బీహార్ రాష్ట్రాలకు చెందినవారిగా గుర్తించినట్లు తెలిపారు.ఇక మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.10 లక్షల చొప్పున రైల్వేశాఖ ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఈ తొక్కిసలాట ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితులకు రూ.2.50 లక్షల చొప్పున పరిహారం చెల్లించనున్నట్లు తెలిపింది. స్వల్పంగా గాయాలు అయిన వారికి రూ.లక్ష చొప్పున సహాయం చేయనున్నట్లు వెల్లడించింది. మృతుల పేర్లను రైల్వే అధికారులు వెల్లడించారు. ఆహాదేవి, పింకి దేవి, షీలా దేవి, వ్యోమ్, పూనమ్ దేవి, లలితా దేవి, సురుచి, కృష్ణ దేవి, విజయ్, నీరజ్, శాంతిదేవి, పూజాకుమార్, పూనమ్, సంగీతా మాలిక్, రియా సింగ్, బేబి కుమారి, మనోజ్, మమతార్ఝా.. ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో చనిపోయిన వారిగా గుర్తించారు.

**ఢిల్లీలో తొక్కిసలాట.. 18 మంది దుర్మరణం**

మరోవైపు.. ఈ ఘోర దుర్ఘటనపై ఇప్పటికే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు వారంతా సంతాపం తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకుని ఆస్పత్రుల నుంచి ఇంటికి వెళ్లిపోవాలని ఆకాంక్షించారు.

## తెరపైకి 'ఫ్రెంచ్ చక్రవర్తి' ప్రస్థావన... ట్రంప్ నిజమైన నియంతా..?



**వాషింగ్టన్-నవభూమి:** రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న పలు నిర్ణయాలు తీవ్ర వివాదాస్పదమవుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... జన్మతః పౌరసత్వం రద్దు నుంచి మొదలు ట్రంప్ నిర్ణయాలు తీసుకుంటూ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు ఇప్పుడు వ్యాజ్యాలను ఎదుర్కొంటున్నాయి. ఈ సమయంలో ఆయన పెట్టిన ఓ పోస్ట్ వైరల్ గా మారింది. అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నిత్యం పదుల సంఖ్యలో ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్ పై సంతకాలు చేస్తున్నారు డొనాల్డ్ ట్రంప్. వీటిలో ప్రధానంగా బర్త్ రైట్ సిటిజన్ షిప్ తో పాటు యూఎస్ ఆర్మీలో పనిచేయకుండా నిషేధం విధించడం, ప్రభుత్వ నియామకాలపై బ్యాన్, క్యాపిటల్ హిల్ పై దాడిచేసిన వారికి క్షమాభిక్ష పెట్టడం, డోజ్ కు కీలక బాధ్యతలు అప్పగించడం ఇందులో ప్రధానం. ఆయన పలు వ్యాఖ్యలను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పలు నిర్ణయాలపై కోర్టులు స్టేలు విధించినట్లు చెబుతున్నారు. ఈ సమయంలో... అమెరికా రాజ్యాంగానికి విరుద్ధంగా ఆయన నిర్ణయాలు తీసుకుంటున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఈ సమయంలో సోషల్ మీడియా ట్రూత్ వేదికగా డొనాల్డ్ ట్రంప్ ఓ పోస్ట్ పెట్టారు. ఈ పోస్టులో ఫ్రెంచ్ చక్రవర్తి నెపోలియన్ వ్యాఖ్యలను ప్రస్థావించారు. ఇందులో భాగంగా... "తన దేశాన్ని రక్షించేవాడు ఎటువంటి చర్యలు తీసుకున్నా.. అది చట్టాల్ని ఉల్లంఘించినట్లు కాదు" అనే వ్యాఖ్యలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. దీంతో... నెపోలియన్ ను ప్రస్థావిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడంతో.. ఆయన తన చర్యలను సమర్థించుకున్నట్లు స్పష్టమవుతోంది. చక్రం తిప్పిన యనమల వాస్తవానికి ఫ్రాన్స్ ను పరిపాలిస్తున్న సమయంలో.. తన నిరంకుశ పాలనను సమర్థిస్తూ నెపోలియన్ తరచూ ఈ వ్యాఖ్యలను చేసేవారంట. ఈ నేపథ్యంలోనే స్పందించిన కాలిఫోర్నియా సెనేటర్ ఆడమ్ షిఫ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... అమెరికా అధ్యక్షుడు నిజమైన నియంతలా మాట్లాడారు అని రాసుకొచ్చారు. ఇలా ట్రంప్ తాను తీసుకుంటున్న నిర్ణయాలను సమర్థించుకోవడానికి అన్నట్లు చేస్తోన్న వ్యాఖ్యల నేపథ్యంలో నెపోలియన్ వ్యాఖ్యలను ఉటంకించడంతో.. ప్రెసిడెంట్ కు ఆ ఫ్రెంచ్

# అయ్యప్ప భక్తులకు గుడ్‌న్యూస్..



**శబరిమల-నవభూమి:**శబరిమల అయ్యప్ప భక్తులకు.. స్వామి దర్శనంలో ఉన్న అడ్డంకులు త్వరలోనే తొలిగిపోనున్నాయి. అయ్యప్ప మాల వేసుకుని.. ఇరుముడి కట్టుకుని.. శబరిమలకు వచ్చే భక్తులకు నేరుగా అయ్యప్ప స్వామి దర్శనం కల్పించేందుకు ఆలయ నిర్వహణ చూసుకునే ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. ఇరుముడితో వచ్చే స్వాములు.. 18 బంగారు మెట్లు (పదునెట్టాంబడి)ఎక్కిన తర్వాత నేరుగా అయ్యప్ప స్వామి దర్శనం కలిగించేలా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటివరకు అక్కడ ఉన్న ఫ్లైఓవర్‌ను అక్కడి నుంచి తీసివేయనున్నారు. దీని వల్ల బంగారు మెట్లు ఎక్కిన వెంటనే భక్తులకు అయ్యప్ప స్వామి కనిపించనున్నారు.అయితే మార్చి 14వ తేదీ నుంచి శబరిమలలో మీనమాస పూజల కోసం అయ్యప్ప ఆలయాన్ని భక్తుల కోసం తెరవనున్నారు. ఆ సమయంలో ఈ అవకాశం కల్పిస్తామని ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు ఇరుముడితో వెళ్లే భక్తులు.. పవిత్రమైన 18 మెట్లు ఎక్కగానే.. ఎడమవైపునకు మళ్లించేవారు. అక్కడి నుంచి ఆలయం చుట్టూ.. సుమారు 500 మీటర్ల దూరం ఉండే ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా నడిచి వచ్చిన తర్వాత సన్నిధానం చేరుకోవాల్సి ఉండేది.తాజాగా శబరిమల ఆలయ అభివృద్ధిలో భాగంగా అధికారులు కొత్త లేఅవుట్‌ను రూపొందించారు. దీని ప్రకారం సన్నిధానం చుట్టూ ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జిని తొలగించాలని నిర్ణయించారు. మీనమాస పూజల సందర్భంగా ఇరుముడితో వెళ్లే భక్తులు.. 18 మెట్లు ఎక్కగానే నేరుగా ధ్వజస్తంభానికి ఇరువైపులా ఏర్పాటు చేయనున్న రెండు లేదా నాలుగు లైన్ల ద్వారా వెళ్లి అయ్యప్ప సన్నిధానానికి చేరుకోవచ్చని తెలిపారు. భక్తులు బలికల్‌పుర(కణిక్క వంచి-నైవేద్య పాత్ర) మీదుగా ఎదురుగా ఉండే అయ్యప్ప సన్నిధికి చేరుకునే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.తాజా నిర్ణయం వల్ల.. కణిక్కవంచి నుంచి వెళ్లేప్పుడు 30 సెకన్ల నుంచి నిమిషం పాటు అలాగే అయ్యప్పను దర్శించుకుంటూ ముందుకు సాగే అవకాశం ఉంటుంది. గతంలో సన్నిధానానికి ఎదురుగా వచ్చినప్పుడు మాత్రమే కేవలం 2, 3 సెకన్ల పాటు మాత్రమే అయ్యప్ప దర్శనం లభించేది. ఇక భక్తుల రద్దీ అధికంగా ఉన్నప్పుడు.. తోపులాట కారణంగా పోలీసులు లాగేసేవారు. ఎంతో కష్టపడి మండలకాలం కఠిన దీక్షను పూర్తిచేసుకుని.. శబరిమలకు వెళ్లినా.. దర్శనం సరిగ్గా జరగలేదనే బాధ ఉండేది. తాజా నిర్ణయంతో అది కాస్త తగ్గనుంది.శబరిమల అయ్యప్ప ఆలయంలో ప్రస్తుతం కుంభమాస పూజలు జరుగుతున్నాయి. ఈనెల 21వ తేదీ వరకు శబరిమల అయ్యప్ప భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఇక ఫుట్ ఓవర్ బ్రిడ్జి తొలగింపు, ఇతర అభివృద్ధి పనులను ఈనెల 17వ తేదీ నుంచే చేపట్టనున్నారు. ఇక ఈ ఆలయ అభివృద్ధి పనులకు కేరళ హైకోర్టు కూడా ఆమోదం కల్పించింది. హైకోర్టు నియమించిన శబరిమల ప్రత్యేక కమిషనర్ ఆర్.జయకృష్ణన్, ట్రావెన్‌కోర్ బోర్డు అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ పర్యవేక్షణలో పనులు పర్యవేక్షించనున్నారు. ప్రస్తుతం తొలగిస్తున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జిని భక్తుల రద్దీ నేపథ్యంలో 1989లో ఏర్పాటు చేశారు.

## ప్రాశ్చాత్య దేశాలు.. స్వయం ప్రకటిత మేధావులతోనే..



ఆచితూచి మాట్లాడటం.. నొప్పించిన వారిని సైతం వినమ్రతతో వ్యవహరించటం లాంటివి గతంలో భారతదేశ విదేశాంగ పాలసీగా ఉండేవి. గతంతో పోలిస్తే.. వర్తమానంలో మార్పు కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. గతంలో ప్రాశ్చత్య దేశాలు మనపై నోటికి వచ్చినట్లు మాట్లాడితే మౌనంగా భరించేటోళ్లం. ఏమైనా అంటే.. ఇంకేమైనా అవుతుందేమోనన్న భయం.. బెంగ.. బెరుకు ఉండేవి. కానీ.. పరిస్థితి ఇప్పుడు అలా లేదు. అందుకు తాజాగా జర్మనీలో జరిగిన భద్రతా సమావేశంలో పాల్గొనే కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ తన అభిప్రాయాల్ని స్పష్టంగా చెప్పేశారు. ప్రాశ్చత్యదేశాలు కాస్త దిగాలన్న ఆయన.. వారి తీరుపై విమర్శలు చేసేందుకు అస్సలు తగ్గలేదు. ఆ మాటకు వస్తే.. ఓరేంజ్ లో ఏసుకున్నారనే చెప్పాలి. ప్రపంచ వేదికల మీద ఈ మాత్రం ధైర్యం ప్రదర్శించటం అభినందనీయమనే చెప్పాలి. ప్రజాస్వామ్యంపై ప్రాశ్చాత్య దేశాలు అనుసరిస్తున్న రెండు నాల్కుల ధోరణిపై తన అభిప్రాయాల్ని కుండబద్దలు కొట్టారు జైశంకర్. ప్రాశ్చాత్య దేశాలకు చెందిన ప్రజాస్వామ్య విధానాలను మాత్రమే ఆ దేశాలు అనుసరిస్తున్నాయని.. అదే సమయంలో ప్రజాస్వామ్య విరుద్ధమైన భావాలను వర్ధమాన దేశాలపై ఎగదోస్తున్న వైనాన్ని తప్పు పట్టిన ఆయన.. "ప్రజాస్వామ్యంలో భారత్ అనుసరిస్తున్న విధానం ప్రపంచంలోని పలు దేశాలకు అనుసరించేందుకు వీలుగా ఉంది. వర్ధమాన దేశాల్లో విజయవంతమైన నమూనాలను ప్రాశ్చాత్యదేశాలు అనుసరించేందుకు వీలుగా కిందకు దిగి రావాలి. ఇప్పటికీ మాదే సరైన ప్రజాస్వామ్యమని ప్రాశ్చత్య దేశాలు భావిస్తున్నాయి. ఇతరులది తక్కువని భావిస్తున్నారు.



## కులమేందిరా.. మతమేందిరా..

పుణ్యభూమిలో కులాల పేరిట..మతాల పేరిట రచ్చ జరుగుతోంది. రెండు దశాబ్ధాల నుంచే కుల,మత రాజకీయాలు పెచ్చురిల్లిపోతూ ప్రజలను నిద్రకు దూరం చేస్తున్నాయి. నిన్నటి దాకా రాజకీయాలకు పరిమితమైన కుల మతాలు ఇప్పుడు అన్ని రంగాలను పట్టి పీడిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజకీయాలు కుల వాసనతో ఎంత భ్రష్టుపడిపోయాయో అందరికీ తెలుసు. తమ స్ఫూర్తి దాయకులుగా భావించి సినీ హీరోలకు సైతం కుల మకిలి పట్టి, కులాల వారీగా వారిని ఆరాధించే పరిస్థితికి వెళ్లిందంటే కులం నానాటికీ ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవాలి.

ఉత్తరాదిన కుల వ్యవస్థ నిస్వార్థ రహిత రాజకీయాల పునాదిని కూకటివేళ్లతో పెకలించి వేస్తోంది. అగ్ర కులాలు నిమ్న కులాలను అణిచివేసి ఏళ్లుగా గద్దె నేలుతున్న చారిత్రక సత్యాలు మన కళ్ల ముందు కదలాడుతూనే ఉన్నాయి. అగ్రకుల పెత్తందారీ తనాన్ని తుత్తునియలు చేసిన కాన్షిరాం స్థాపించిన బహుజన సమాజ్ పార్టీ, దేశంలో నూతన అధ్యాయాన్ని సృష్టిస్తోందని అందరూ తలపోశారు. దేశంలోనే అతి పెద్ద రాష్ట్రమై, దేశ భవిష్యత్తును శాసించగల అత్యధిక లోక్‌సభ సీట్లు కలిగిఉన్న ఉత్తరప్రదేశ్‌ను కైవసం చేసుకొని మాయావతి నాయకత్వంలో యుపిలో బహుజనుల ఆశలను,ఆకాంక్షలను నెరవేరుస్తుందని అందరూ భావించారు. బహుజనుల రాజ్యం పదేళ్లల్లో ఎలా క్షీణదశకు చేరుకుందో, చివరకు స్వంతంగా కూడా పోటీ చేయలేని స్థితికి ఆ పార్టీ దిగజారిందో మనం చూస్తూనే ఉన్నాం.

కుల,మత ప్రస్థావన లేకుండా ఇప్పట్లో రణక్షేత్ర పర్వాన్ని ప్రస్తుతించలేం. ఒకే పార్టీ, ఒకే దేశం పేరిట కాషాయ పార్టీ సాగిస్తోన్న హనన కాండలో ప్రత్యర్థి పార్టీలన్నీ చిత్తయిపోతున్నాయి. ఒక బలమైన సామాజిక వర్గాన్ని తమవైపు తిప్పుకోవడం ద్వారా రెండు మూడు దశాబ్ధాలు దేశాన్ని ఏలాలన్న లక్ష్యంతో మోదీ,వీలైనంత వరకు కులాలను, మతాలను తమ అస్త్రంగా వినియోగించుకుంటూ ఫలితాలను సాధిస్తూ,ఫలాలను అందిపుచ్చుకుంటున్నారు.

కుల,మత ప్రస్థావన లేకుండా ఈ పార్టీ అధికారంలోకి రావడం ఎంత కష్టమో మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు ఇచ్చిన తీర్పును బట్టి అవగతమవుతోంది. బీహార్,ఏపీ రాష్ట్రాలు ఎన్డీఏకు బాసట నిలవక పోతే, ఎన్డీఏ హ్యాట్రిక్ సాధించేది కాదన్నది వాస్తవం. అయోధ్యలో బాల రాముడి నిర్మాణం తర్వాత కూడా అక్కడి బీజేపీ ఎంపీ ఓటమి పాలవ్వడం దేనికి సంకేతం? ప్రజా పాలనకు, అభివృద్ధికి మత రాజకీయాలకు ముడి పెట్టవద్దని అయోధ్య ప్రాంత ప్రజలు మొట్టికాయ వేసి మరీ చెప్పారు. మరి బీజేపీ వినిపించుకుంటుందా?

ఇక ఇప్పుడు రాజకీయ అంగడిలో రాహుల్‌గాంధీ కులం మతం అనే కొత్తసరుకు వచ్చింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కులగణనను సమీక్షిస్తూ మోదీ బీసీ కాదని, గుజరాత్ ముఖ్యమంత్రి అయిన తర్వాత తన కులాన్ని బీసీలోకి మార్చుకున్నారని ఆరోపించారు. బీసీ కన్వర్టెడ్ పీఎంగా మోదీని రేవంత్ అభివర్ణించారు. రేవంత్ అన్యాపదేశంగా మోదీ గురించి వ్యాఖ్యానించారే తప్ప, అందులో వ్యక్తిగత విమర్శ కనిపించదు. కానీ బీజేపీ ఈ వ్యవహారాన్ని భుజానికెత్తుకుంది. వాస్తవానికి ఈ రగడ బీజేపీకి రేవంత్ రెడ్డికి మధ్య జరగాలి. రేవంత్‌రెడ్డితో రాజకీయమెలా అవుతుంది. దీన్ని జాతీయ రాజకీయాలకు అంటగడితేనే చాలా మైలేజీ వస్తుందనుకున్న బీజేపీ నాయకమ్మన్యులు వెంటనే రాహుల్‌గాంధీతో వైరానికి దిగారు.


అసలు రాహుల్ గాంధీ కులమేందీ..మతమేందీ అంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో సహా నేతలు ధుమమాడారు. దీనికి కాంగ్రెస్ రాష్ట్ర నేత జగ్గారెడ్డి గట్టిగానే కౌంటర్ ఇచ్చారు. రాహుల్ గాంధీ బ్రాహ్మణ కులానికి,హిందూ మతానికి చెందిన వాడని పేర్కొన్నారు. బీజేపీ నేతలు అంతటితో ఆగక రాజీవ్‌గాంధీ తండ్రి ఫిరోజ్‌ఖాన్ గాంధీ,అలాగే ప్రియాంక, క్రిష్టియన్ అయిన వాద్రేను వివాహమాడారంటూ కాంగ్రెస్ తాత ముత్తాతల చరిత్రను చదివించే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ పార్టీని ఖాన్‌గ్రేస్‌గా పేర్కొంటూ ఎద్దేవా చేశారు. హిందూ మతంలో భర్త కులం,మతం భార్యకు వస్తుందని, సోనియా విషయంలో అదే జరిగిందని చెబుతూ ఇందిరమ్మ విషయంలో ఆమెను వివాహమాడిన ఫిరోజ్,తర్వాత కాలంలో హిందూమతాన్ని స్వీకరించాడని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. అలాంటప్పుడు రాహుల్ కులం గురించి మతం గురించి ఎందుకు ప్రస్తావిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నేతలు మరింత గట్టి సమాధానమే ఇచ్చారు. ఇక చాలా మంది బీజేపీ అగ్రనేతల పిల్లలు ముస్లిం కుటుంబాల వారినే పెళ్లిళ్లు చేసుకోవడం ఈ బీజేపీ నేతలకు తెలియదా?

వియ్యమందేటప్పుడు కులాలు, మతాలు గుర్తుకు రావు కానీ..ఎన్నికల గోదాలో దిగిన తర్వాత ఇవన్నీ గుర్తుకురావడం బీజేపీ కద్దు.

'ఎక్కడైనా కాని వంగ తోట కాడ సరసన పనికిరాదన్నది' బీజేపీ పాలసీ. కులాలు,మతాల పేరిట దశాబ్ధన్నర పాటు దేశాన్ని ఏక ఛత్రాధిపత్యంగా ఏలిన బీజేపీ వచ్చే మూడు దశాబ్ధాల పాటు దేశాన్ని తమ చెప్పుచేతల్లో ఉంచుకోవాలనే ప్రయత్నాల్లోనే ఉంది. దీని కోసమే రాహుల్‌ను కులం, మతం ముగ్గులోకి లాగుతోంది.

అభివృద్ధిని విస్మరించి కులం,మత రాజకీయాల్లోకి వెళ్లడం ఇప్పుడు కాని పని. ఎంత అభివృద్ధి చేసినా ఒకే ఒక లిక్కర్ మచ్చ ఉన్న కారణంగా కేజ్రీవాల్ చెంప పగిలేలా దిల్లీ ఓటర్లు తీర్పు ఇచ్చారు. ఈ విషయాన్ని రాజకీయ పార్టీలు గమనించి మసులు కోవాలి.

# చారిత్రక చీకటి వెలుగుల్లో లాహోర్




చాలా సంవత్సరాల క్రితం నా పరిశోధనా వ్యాసంగంలో, యాదృచ్ఛికంగా ఒక టెస్ట్ మ్యాచ్‌కు సంబంధించిన వార్తా కథనాలను చూడడం, చదవడం తటస్థించింది. 1955లో లాహోర్‌లో భారత్–పాకిస్థాన్‌ల మధ్య జరిగిన టెస్ట్ మ్యాచ్ అది. ఆ టెస్ట్ మ్యాచ్ జరిగిన సామాజిక సందర్భం చాలా ఆసక్తికరమైనది. తన బహుళ–సంస్కృతీమయ గతాన్ని పునర్దర్శించడానికి, ఆ స్ఫూర్తిదాయక చరిత్రను ఆవాహన చేసుకోవడానికి లాహోర్‌ను 1947 తరువాత ప్రప్రథమంగా అనుమతించిన సందర్భమది. టెస్ట్ మ్యాచ్‌ను చూసేందుకు వాఘా సరిహద్దుకు ఈవల ఉన్న అమృత్‌సర్ నుంచి రోజూ ఉదయం వచ్చి రాత్రికి తిరిగి వెళ్లిపోయే భారతీయ పౌరులకు పదివేల టిక్కెట్లు ప్రత్యేకంగా విక్రయించారు. 'దేశ విభజన అనంతరం భారత్ నుంచి పాకిస్థాన్‌కు జరిగిన అతిపెద్ద సామూహిక వలస' అని భారతీయ క్రికెట్ అభిమానుల వెల్లువను ప్రత్యక్ష సాక్షి ఒకరు అభివర్ణించారు. 29 జనవరి 1955న ఆ టెస్ట్ మ్యాచ్ ప్రారంభమయింది. మరుసటి రోజు 'డాన్'లో వెలువడిన ఒక వార్తా కథనం టిక్కెట్ల కొనుగోలుకు వాఘా ఆవల నుంచి వచ్చినవారు ఎలా బారులు తీరిందీ పేర్కొంది. 'స్టేడియం వద్ద కోలాహలం షాలిమార్ మేలాను జ్ఞప్తికి తెచ్చింది. కాకపోతే ఈ గుంపుల్లో ఉన్న వారందరూ కులీన వర్గాలకు చెందినవారు. భారతీయ సందర్శకులలో ముఖ్యంగా సిక్కులు అందరినీ ఆకర్షించారు. వారు ఎక్కడకు వెళ్లినా సాదర స్వాగతం లభించింది. పాకిస్థానీయులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. కొందరు అనుకోకుండా తమ పాత స్నేహితులను చూసినప్పుడు ఆనంద బాష్పాలు రాల్చారు' అని 'డాన్' వార్తా కథనం పేర్కొంది. ఈ వార్త రాసిన విలేఖరి లాహోర్‌లోని పాకిస్థానీ ముస్లిం అయి ఉంటాడనేది స్పష్టం. సరిగ్గా ఇటువంటి మనోభావాలనే సుదూర మద్రాసులోని హిందూ పాత్రికేయుడు ఒకరు వ్యక్తం చేశారు. 'ఈ టెస్ట్ మ్యాచ్ రోజుల్లో పాకిస్థానీయులు, భారతీయుల మధ్య సౌభ్రాతృత్వం వెల్లివిరిసింది' అని ఆ పాత్రికేయుడు రాశారు. ఇటీవల ప్రచురితమైన మనాన్ అహ్మద్ అసిఫ్ పుస్తకం Disrupted City : Walking the Pathways of Memory and History in Lahoreను చదువుతున్నప్పుడు ఎనభై ఏళ్లనాటి ఆ క్రికెట్ టెస్ట్ మ్యాచ్‌కు సంబంధించిన వార్తాకథనాలు జ్ఞప్తికి వచ్చాయి. అసిఫ్ లాహోర్‌లో పెరిగాడు. ముప్పై ఏళ్ల క్రితం ఉన్నత విద్యాభ్యాసానికి విదేశాలకు వెళ్లిపోయాడు. తరచు కన్న ఊరుకు వస్తుంటాడు. లాహోర్ కథను పాకిస్థాన్‌కే పరిమితం చేయకుండా ఆ నగర విశాల చరిత్రను చెప్పడమే తన ధ్యేయమని అసిఫ్ తన పుస్తకంలో పేర్కొన్నాడు. నగరానికి సంబంధించి తన వ్యక్తిగత స్మృతులను పర్షియన్, ఉర్దూ, పంజాబీ, అరబిక్ భాషా గ్రంథాలలో విద్వత్ శోధనలతో మేళవించి ఆ పురానవ నగర చరిత్రను అసిఫ్ వెలయించాడు. '1947కు పూర్వం లాహోర్ జన జీవనంలోని భిన్నత్వం, బహుళత్వం, హిందూ, సిక్కు మతస్థుల సామూహిక నిష్క్రమణ, ముస్లిం శరణార్థుల రాకతో అంతరించి పోయాయని'అసిఫ్ పేర్కొన్నాడు. 'దేశ విభజనతో సంభవించిన ఆ విచ్ఛిన్నంతో లాహోర్ తన సొంత గతం నుంచి బలవంతంగా బహిష్కృతమయింది' అని అసిఫ్ నిట్టూర్చాడు. అసిఫ్ పుస్తకంలో క్రికెట్ గురించి సందర్భవశాత్తు ప్రస్తావనలు మినహా ఏమీలేదు. 1955 టెస్ట్ మ్యాచ్ గురించి అసలు ఏమీ లేదు. అయినప్పటికీ ఆ టెస్ట్ మ్యాచ్ జరిగిన రోజుల్లో క్రికెట్ అభిమానుల కోలాహలం గురించి ఆయన ఒక ఆసక్తికరమైన వ్యాఖ్య చేశారు. వారి సందడి షాలిమార్ మేలాను గుర్తుకు తెచ్చిందని ఆయన అభివర్ణించాడు. షాలిమార్ మేలా (మేలా చిరాఫున్‌గా కూడా సుప్రసిద్ధం) ఒకప్పుడు లాహోర్ నగర ప్రధాన పండుగలలో ముఖ్యమైనది. 16వ శతాబ్ది సూఫీ సాధువు షా హుస్సేన్ జీవితం, వారసత్వానికి సంబంధించిన ఉత్సవమది. అసిఫ్ ఇలా రాశాడు: 'ఆచారాలకు ప్రాధాన్యమిచ్చే వారిని ఆయన తీవ్రంగా విమర్శించేవాడు. మద్యపాన ప్రియుడు. మత్తు పదార్థాలను సేవించేవాడు. ఆనంద తాండవం చేసేవాడు, తరచు నగ్నంగా'. షా హుస్సేన్ సన్నిహితుడు, ఆంతరంగికుడు ఒక హిందూ యువకుడు. బహుశా అతడి లైంగిక భాగస్వామి కావచ్చు. ఆ ఇరువురిని ఖననం చేసిన స్థలం హిందువులు, ముస్లింలు, సిక్కులకు పుణ్యక్షేత్రం. ఏటా అక్కడ ఉత్సవాన్ని నిర్వహిస్తుంటారు. దేశ విభజన అనంతరం లాహోర్ జన జీవనంలో ఈ బహుళత్వం అంతరించింది. 1955లో టెస్ట్ మ్యాచ్‌ను చూడడానికి వచ్చిన జనసందోహాన్ని చూసి చాలా మంది ఆ సంప్రదాయ ఉత్సవాన్ని గుర్తు చేసుకున్నారు. లాహోర్ బహుళ స్తరిత, బహుళ మత, బహుళ భాషా గతాన్ని అర్థం చేసుకునేందుకు అసిఫ్ పుస్తకం మనకు విశేషంగా తోడ్పడుతుంది. షా హుస్సేన్ గురించే కాకుండా నర్తకి అనార్కలి, మార్మిక సాధువు గంజ్ బక్ష్, మహారాజా రంజిత్ సింగ్ మొదలైన నగర ప్రముఖుల చరిత్రనుకూడా క్లుప్తంగానే అయినప్పటికీ ఆసక్తికరంగా వివరించాడు. రుడ్యార్డ్ కిప్లింగ్‌ను సామ్రాజ్యవాది అని ఆక్షేపించాడు. అది నిజమేకాని కిప్లింగ్ తన 'కిమ్' నవలలో లాహోర్ నగర సామాన్యుల జీవితాలను ఎంతో సహానుభూతితో వర్ణించాడు. లాహోర్ వాస్తుకళా వైభవాన్ని కూడా అసిఫ్ విపులంగా అభివర్ణించాడు సుప్రసిద్ధ చారిత్రక కట్టడాలనే కాకుండా అనామక మసీదుల గురించి కూడా చెప్పాడు. ఇప్పుడు మసీదులతో పాటు శిథిలమైన దేవాలయాలు, గురుద్వారాలు ఎన్నో కనిపిస్తుంటాయి. సుదూర గతంలో లాహోర్ దిగ్మండలంలో హిందూ, సిక్కు పూజా మందిరాలు ప్రముఖంగా కనిపించేవని ఆయన విపులంగా వివరించాడు. 1947కు పూర్వం లాహోర్ నగర ఆర్థిక జీవనంలో హిందువుల, సిక్కుల కీలక పాత్ర గురించి కూడా అసిఫ్ ప్రముఖంగా వర్ణించాడు. 1970లు, 1980లలో లాహోర్‌లో తన బాల్య, కౌమార దశల గురించి గూడా ఆయన రాశారు. రోజూ సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి తిరిగి వెళుతూ ఒక పాత భవనం ద్వార ఫలకంపై దేవనాగరి లిపిలో రాసి ఉన్న పదాలను చూస్తుండేవాడినని పేర్కొన్నాడు. తాను ఆ అక్షరాలను అలా చూసి ఇలా వెళ్లిపోతుండేవాడినని. ఎప్పుడూ ఆ భవనం ముందు ఆట్టే తచ్చాడలేదని అసిఫ్ గుర్తుచేసుకున్నాడు. ఆ దేవనాగరి లిపిలోని మాటలను చదవలేకపోయేవాడినని, ఆ లిపి నేర్చుకునే ప్రయత్నం కూడా తాను చేయలేదని అసిఫ్ తెలిపాడు. ఇంకా ఇలా వ్యాఖ్యానించాడు: 'దేవనాగరి లిపి 'హిందూ మతానికి సంబంధించినది అని నాకు తెలుసు. మా సాంఘికశాస్త్ర పాఠ్య పుస్తకాల ప్రకారం హిందువు అంటే ముస్లింను వెన్నుపోటు పొడవడానికి ప్రయత్నించేవాడు మరి'. ఈ వాక్యాలు చదువుతున్నప్పుడు హిందుత్వ వాదుల పాలనలో హిందూ బాలలు వక్రీకరించిన చరిత్రను చదువుతున్న విషయమై ఆలోచనా మగ్నుడినయ్యాను. ఉర్దూ పూర్తిగా ముస్లింల భాష అని దశాబ్దాలుగా తప్పుడు ప్రచారం జరుగుతోంది. ఎంతో మంది గొప్ప గొప్ప హిందూ, సిక్కు రచయితలు ఉర్దూ భాషకు ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు సాధించినప్పటికీ ఆ భాష పూర్తిగా ముస్లింలదేనని ప్రచారం చేయడమేమిటి? ఇండియా ప్రధానంగా 'హిందూ' దేశం అనే వివరణను, బీజేపీ ఆధ్వర్యంలోని ప్రభుత్వాలు నిర్దేశిస్తున్న చరిత్ర, సాంఘిక శాస్త్ర పాఠ్యగ్రంథాలు మరింతగా బలపరుస్తున్నాయి. ఈ మెజారిటీవాద ప్రపంచ దృక్పథాన్ని హిందుత్వ సామాజిక మాధ్యమ శ్రేణులు విపులీకరిస్తున్నాయి. సమస్త హిందువులు, ముస్లింలు అందరినీ ఎటువంటి మినహాయింపు లేకుండా అనుమానించాలని ఆ శ్రేణులు నిత్యం పదే పదే విజ్ఞప్తి చేస్తున్నాయి. ఒకప్పుడు ప్రజలు అందరూ ఎటువంటి తరతమ భేదాలు లేకుండా పాల్గొన్న మేలా చిరాఫున్, బసంత్ మొదలైన పండుగలు లాహోరీల ఉమ్మడి స్మృతిపథం నుంచి ఎలా బహిష్కృతమయిందీ అసిఫ్ పేర్కొన్నారు. సైనిక పాలకుడు జియా ఉల్ హఖ్ ప్రోత్సహించిన వహాబీ ఇస్లాం సిద్ధాంతాలకు ఆ వేడుకలు విరుద్ధమైనవి కావడంతో లాహోర్ నగర జీవితంలో వాటికి స్థానం లేకుండా పోయిందని అసిఫ్ వివరించారు. 1980ల నాటి నుంచీ పాకిస్థాన్‌లో 'సంతోషం, సద్యోజనిత ప్రేరణలు, సాముదాయికతను అనుమానాస్పద కార్యకలాపాలుగా శంకించడం ఆరంభమయింది. అదే సమయంలో న్యాయమైన, ధర్మబద్ధమైన ఆగ్రహం, మనస్తాపం, విద్వేషం సంస్మరణ కార్యకలాపాలకు ఆధారాలుగా మారాయి'.. హైందవీకరణ అయిన భారత్ పాకిస్థాన్ పోకడలను అనుసరిస్తున్నట్టుగా కనిపించడం లేదూ? సమష్టి సంతోషాలు, సద్యోజనిత ప్రేరణల స్థానంలో మత విద్వేషాలు, ప్రతీకారాత్మక ఆగ్రహావేశాలు విజృంభిస్తున్నాయి. లాహోర్ చారిత్రక గతం నుంచి హిందూ, సిక్కు ప్రభావాలు, ఆనవాళ్లను పూర్తిగా చెరిపివేసేందుకు ఇస్లామిక్ పాకిస్థాన్ నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంది. పాకిస్థాన్‌ను ద్వేషించమని బాహాటంగా ప్రకటిస్తున్న హిందుత్వ వాదులు చారిత్రక ఆనవాళ్లను రూపుమాపే తమ ఎడతెగని ప్రయత్నాలలో బద్ధశత్రువులనే అనుకరిస్తున్నారు! గత యుగాలలో ఉత్తర భారతావనిలోని ముస్లిమేతరుల రాజకీయ పరాధీనతనే కాకుండా మత విశ్వాసాల రీత్యా ముస్లింలు అయిన రచయితలు, కళాకారులు, సంగీతవేత్తలు భారతీయ సమాజం, సంస్కృతి సమున్నతికి అందించిన అజరామర సేవలను కూడా మనం మరచిపోవాలని కోరుతున్నారు. అయితే అవి మన ఉమ్మడి, సమ్మిళిత, బహుళత్వ భారతీయ సంస్కృతిలో అపరిహార్యమైన భాగం కదా. హిందుత్వను వ్యతిరేకించే వారందరూ ఆ సమున్నత సమ్మిళిత సంస్కృతిని స్వీకరించి, స్థిరపరచాలి. మనాన్ అహ్మద్ అసిఫ్ పుస్తకాన్ని పాకిస్థాన్‌లో విస్తృతంగా చదువుతారని, ఉర్దూ, పంజాబీ భాషలలో దాని అనువాదాలు వెలువడగలవని ఆశిస్తున్నాను. ఒక గొప్ప, అయితే వ్యాకులతకు గురిచేస్తున్న నగర ప్రశస్త చరిత్ర అది. వాఘాకు ఆవలే కాదు, ఈవల సైతం ఉన్న వారికి కూడా అసిఫ్ పుస్తకంలో విలువైన పాఠాలు ఉన్నాయి.

# 'విద్యార్థి ఎన్నికల'పై నిషేధం ఎత్తివేయాలి



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో విద్యార్థి సంఘం ఎన్నికల నిర్వహణపై నిషేధం విధించి 36 ఏళ్ళు గడుస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలో 1988లో ఉస్మానియా విశ్వవిద్యాలయ అనుబంధ నిజాం కళాశాలలో రెండు విద్యార్థి గ్రూపుల మధ్య ఘర్షణలో దేవేందర్ యాదవ్ అనే విద్యార్థి హత్య జరిగిందనే నెపంతో అప్పటి పాలకులు ఈ ఎన్నికలపై నిషేధం విధించారు. ఎనభయ్యవ దశకంలో విద్యార్థి సంఘం ఎన్నికలు విద్యార్థుల ఆలోచనలను మెరుగుపరిచి, అభివృద్ధి వైపు నడిపించాయి. విద్యాసంస్థల్లో ఈ ఎన్నికల నుంచి ప్రేరణ, చైతన్యం పొంది రాజకీయాలలోకి వచ్చిన అనేక మంది సాధారణ విద్యార్థులు నేడు భారత పార్లమెంటరీ రాజకీయ వ్యవస్థలో తమ ప్రభావాన్ని చూపుతున్నారు. నాడు క్యాంపస్‌లలో స్టూడెంట్ బాడీ ఎన్నికలలో ఎన్నికైన విద్యార్థులు విద్యారంగ సమస్యలను పరిష్కరించడానికి ముందు వరుసలో ఉండేవారు. దాంతో యూనివర్సిటీలు జ్ఞాన కేంద్రాలుగా, ఉద్యమ కేంద్రాలుగా సమాజంపై గొప్ప ప్రభావాన్ని చూపాయి. నేడు విద్యార్థి ఎన్నికలు లేకపోవడంతో విద్యార్థుల డిమాండ్లను లేవనెత్తడం, ఆయా యాజమాన్యాలు, ప్రభుత్వాలను సంప్రదించి, పరిష్కరించడం సవాలుగా మారింది. కొన్నేళ్లుగా తెలంగాణ యూనివర్సిటీలు, కళాశాలలకు సరైన నిధుల కేటాయింపులు లేక మౌలిక సదుపాయాలు అందక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రొఫెసర్ల నియామకం జరగడం లేదు. నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ కూడ జరగడం లేదు. దీంతో యూనివర్సిటీలలో విద్యాబోధన నిలిచిపోయి పరిశోధనలు కుంటుపడ్డాయి. యూనివర్శిటీల ప్రతిష్ఠ మసకబారుతోంది.

ప్రతి ఏడాది జరిగే విద్యార్థి సంఘం ఎన్నికల్లో అనేక సమస్యలు చర్చకు వస్తాయి. వివిధ బావజాలాల మధ్య స్నేహపూర్వక చర్చ–ఘర్షణ ఉంటుంది. ఇది గమనిస్తూ ఎన్నికలలో పాల్గొనే సాధారణ విద్యార్థులు కూడా సమాజం పట్ల కొంత జ్ఞానాన్ని పెంపొందించుకొని మార్పు వైపు ప్రయాణించేవారు. విద్యార్థుల హక్కులకై, వారి సమస్యల పరిష్కారానికి యాజమాన్యాలతో, పాలక ప్రభుత్వాలతో నిత్యం సంప్రదింపులు, పోరాటం కొనసాగడం వల్ల విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెంపొందేవి. బహుజన సమూహాల విద్యార్థులు నాయకులుగా ఎదిగేవారు. ఇది ఇష్టం లేని పాలకవర్గాలే ఈ మూడున్నర దశాబ్దాలుగా ఎన్నికల వైపు తొంగి చూడటం లేదు. పైగా నిషేధాన్ని కొనసాగిస్తూనే ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాలను, సంఘాలను అణచివేస్తున్నారు.

ఇటీవల కాలంలో తెలంగాణ ముఖ్యమంత్రి విద్యార్థుల పోరాటాలతోనే ప్రత్యేక రాష్ట్రం సాకారమైందని, విద్యార్థులు రాజకీయాలలోకి రావాలని పిలుపునిచ్చారు. ఒకవైపు విద్యార్థి సంఘం ఎన్నికలపై నిషేధాన్ని కొనసాగిస్తూ, మరోవైపు విద్యార్థులు రాజకీయాలలోకి రావాలనడం మోసం చేయడమే. తక్షణమే విద్యార్థి ఎన్నికల నిర్వహణపై ముఖ్యమంత్రి దృష్టి సారించాలి. అందుకు గతంలో భారత మాజీ ఎన్నికల అధికారి జె.యం లింగ్డో కమిటీ సూచనలు పాటిస్తూ, విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) విడుదల చేసిన మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవాలి.

లింగ్డో నివేదికను అమలు చేస్తూ స్టూడెంట్ బాడీ ఎన్నికలు జరపాలని 2006లో సుప్రీంకోర్టు మరో ఆర్డరు జారీచేసింది. తరువాత 2007లో ఎన్నికల నిర్వహణకై యూజీసీ ఆదేశాలు జారీ చేయగా, దేశంలోని అన్ని యూనివర్సిటీలు, కళాశాలల్లో విద్యార్థి సంఘం ఎన్నికలు నిరంతరాయంగా జరుగుతున్నాయి. కానీ నిషేధం కారణంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో విద్యార్థి సంఘం ఎన్నికలు జరగడం లేదు. విద్యార్థి సంఘం ఎన్నికల అంశం తెరమీదకు వచ్చినప్పుడల్లా ఈ రాష్ట్రాల పాలక వర్గాలు, ఆయా యూనివర్సిటీల యాజమాన్యాలు శాంతిభద్రతల అంశాన్ని సాకుగా చూపుతున్నాయి. శాంతిభద్రతలే సమస్యైతే సాధారణ ఎన్నికలు ఎలా నిర్వహిస్తున్నారో సమాధానం చెప్పాలి. విద్యార్థి సంఘం ఎన్నికల ప్రాధాన్యం గుర్తిస్తూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలల్లో ఎన్నికలు తక్షణమే జరపాలని డిమాండ్‌తో పోరాడాల్సిన అవసరం వుంది.

భక్తి

## మనసు ఏం చేస్తోందో గమనిస్తున్నారా?



మనస్సుకు మరో ధోరణి కూడా ఉంది. అది: ప్రతికూలతను అంటిపెట్టుకొని ఉండడం. మన జీవితంలో పది సందర్భాలు, సంఘటనల్లో ఒకటి ప్రతికూలంగా జరిగితే... అనుకూలంగా జరిగినవాటిని మరచిపోతాం. ఆ ఒక్క ప్రతికూలమైన దాని గురించే ఆలోచిస్తూ ఉంటాం.

విద్యను, సమాచారాన్ని పొందడానికి మనకు ఎన్నో మార్గాలు ఉన్నాయి. పాఠశాలకు, కళాశాలకు, విశ్వవిద్యాలయానికి వెళ్ళడం ద్వారా, గురువుల ద్వారా విద్యను సంపాదించగలం. వార్తా పత్రికల ద్వారా ఇతర మాధ్యమాల ద్వారా సమాచారం తెలుసుకోగలం. పుస్తకాలను చదవడం ద్వారా విజ్ఞానాన్ని పొందగలం. ఇలా మనకు ఎన్నో మార్గాలు కనిపిస్తాయి. కానీ జ్ఞానం పొందాలంటే ఇలాంటి మార్గాల ద్వారా సాధ్యం కాదు. మన మనసులో ప్రస్తుతం ఏం జరుగుతోందో తెలుసుకోవడమే జ్ఞానం. కానీ మనసు గురించి అవగాహన చేసుకోవడానికి ఇతర మార్గాలేవీ దోహదపడవు.

%ప్రతి క్షణం మీ మనసు ఏం చేస్తోందో, అక్కడ ఏం జరుగుతోందో మీరు గమనించారా? తరువాత జరగబోయేది ఏమిటో అది ఆలోచిస్తూ ఉంటుంది. అది గతానికి, భవిష్యత్తుకు మధ్య ఊగిలాడుతూ ఉంటుంది. గతంలో జరిగిన దాని గురించి విచారంగా, లేదా కోపంగా ఉంటుంది. లేదా భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతుంది. మనస్సుకు మరో ధోరణి కూడా ఉంది. అది: ప్రతికూలతను అంటిపెట్టుకొని ఉండడం. మన జీవితంలో పది సందర్భాలు, సంఘటనల్లో ఒకటి ప్రతికూలంగా జరిగితే... అనుకూలంగా జరిగినవాటిని మరచిపోతాం. ఆ ఒక్క ప్రతికూలమైన దాని గురించే ఆలోచిస్తూ ఉంటాం. ఈ ధోరణిని మార్చుకోవడమే మీకు మీరు చేసుకోగలిగే పెద్ద సహాయం. ఈ ధోరణి గురించి అర్థం చేసుకోవడం వల్ల మీ జీవితం మరింత సహజంగా, మరింత సరళంగా మారుతుంది. అంతర్గతమైన వికాసం కలుగుతుంది. నిజానికి మనం పుట్టినప్పుడు ఎంతో అమాయకంగా ఉంటాం. పరిణతి చెందుతున్నకొద్దీ, తెలివైనవారిగా మారుతున్న కొద్దీ ఆ అమాయకత్వాన్ని కోల్పోతాం. చివరకు కఠినంగా మారుతాం. దానివల్ల జీవితంలో ఆనందం కోల్పోతాం. ఆ కాఠిన్యాన్ని విడిచిపెట్టండి. అందరిపట్ల, అన్నిటిపట్ల దయగా, ప్రేమగా ఉండండి. అప్పుడు జీవితం మరింత ఆనందదాయకంగా, మరింత సంతృప్తికరంగా, ఆసక్తికరంగా మారుతుంది. ఇదంతా మీ మనసును అవగాహన చేసుకున్నప్పుడు, జరుగుతుంది. అందుకోసం మనసు ఏం చేస్తోందో గమనించాలి. ప్రతికూలమైన విషయాల గురించి ఆలోచించడం మానేయాలి. సానుకూలమైన దృక్పథంతో జీవితాన్ని కొనసాగించాలి. అప్పుడు అంతా ఆనందమే!

## నకిలీ కుంకుమ పువ్వుని గుర్తించండి ఇలా..!



ఒక చిన్న గ్లాసు నీటిలో కుంకుమపువ్వు రేకులు మూడింటిని వేసి కలపాలి. నీళ్లు వెంటనే రంగు మారితే అవి నకిలీవని గుర్తించాలి. నిజమైన కుంకుమపువ్వు రేకులు రంగు విడవడానికి చాలా సమయం తీసుకుంటాయి. ఇవి పాలు, నీళ్లు సహా ఏ ద్రవంలోనూ కరగవు.

కుంకుమ పువ్వు రేకులు ఎరుపు రంగులో ఉంటాయి. కానీ వాటిని ఆహార పదార్థాల్లో కలిపినప్పుడు లేత పసుపు రంగుని విడుస్తాయి. రేకులు వేసిన నీళ్లు లేదా పాలు ఎరుపు రంగులోకి మారినా రేకులు రంగు వెలిసి కనిపించినా అవి నకిలీవని తెలుసుకోవచ్చు.

రెండు రేకులను నోట్లో వేసుకుని నమిలితే నోరంతా చేదుగా అవుతుంది. అలా కాకుండా నాలుకమీద తీపిదనం తెలిస్తే అవి నకిలీవని గుర్తించాలి.

రేకులకు నిప్పు పెడితే అవి మండని పక్షంలో శుద్ధమైన కుంకుమ పువ్వుగా గుర్తించాలి. నకిలీ రేకులు వెంటనే మండిపోతాయి.

శుద్ధమైన కుంకుమ పువ్వు ...మట్టి, గడ్డి, తేనె వాసనల కలయికతో ఉంటుంది. నకిలీదానికి ఎటువంటి వాసన ఉండదు.ఒక కప్పు నీటిలో రెండు కుంకుమ పువ్వు రేకులు వేసి పది నిమిషాలు నానబెట్టాలి. తరవాత ఈ రేకులను నీళ్లలో నుంచి తీసి వేళ్లతో నలిపితే అవి చిన్న ముక్కలు కాని పక్షంలో శుద్ధమైనవని గుర్తించాలి. రేకులు తెగిపోతుంటే మాత్రం నకిలీవని తెలుసుకోవచ్చు.

# కొత్తవాటిలా మెరవాలంటే..!






బాత్‌రూమ్‌లో ఉపయోగించే బకెట్లు, మగ్గులపై తెల్లని నీటి మరకలు ఏర్పడుతుంటాయి. రోజూ ఉపయోగిస్తున్నప్పటికీ వాటిపై మురికి చేరి నల్లగా మారుతుంటాయి. ఇలాంటి మరకలను ఇంటి చిట్కాలతో సులువుగా వదిలించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

ఒక గిన్నెలో మూడు చెంచాల బేకింగ్ సోడా, రెండు చెంచాల నిమ్మరసం, రెండు చెంచాల పాత్రలు శుభ్రం చేసే లిక్విడ్ సోప్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పాత టూత్ బ్రష్‌తో తీసుకుంటూ బకెట్లు, మగ్గులకు మరకలు ఉన్న చోట పట్టించాలి. అరగంట ఆరిన తరవాత స్టీల్ స్క్రబ్బర్‌తో రుద్ది కడిగితే మరకలన్నీ పోయి కొత్తవాటిలా మెరుస్తాయి.

ఒక గిన్నెలో మూడు చెంచాల బేకింగ్ సోడా లేదా ఉప్పు, నాలుగు చెంచాల వెనిగర్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని టూత్ బ్రష్ సహాయంతో మరకలపై రాయాలి. పావుగంట తరవాత మంచినీళ్లతో కడిగితే అన్ని రకాల మరకలు పోతాయి.

ఒక గ్లాసు నీటిలో మూడు చెంచాల బ్లీచింగ్ పౌడర్ వేసి కలపాలి. చేతులకు తొడుగులు వేసుకోవాలి. ఒక పలుచని గుడ్డని గుండ్రంగా మడిచి ఈ నీళ్లలో ముంచి దానితో బకెట్లను మగ్గులను తోమాలి. పావు గంట తరవాత వాటిని మంచి నీళ్లతో శుభ్రం చేస్తే మరకలన్నీ వదిలిపోతాయి.

ఒక గిన్నెలో రెండు ప్యాకెట్ల ఈనో పొడి, నాలుగు చెంచాల నిమ్మరసం వేసి కలపాలి. ఈ మిశ్రమంలో స్క్రబ్బర్‌ని అద్ది దానితో బకెట్లను, మగ్గులను గట్టిగా రుద్దుతూ తోమాలి. అయిదు నిమిషాలు ఆరనివ్వాలి. తరవాత మంచి నీళ్లతో కడిగేస్తే మరకలు పోతాయి.

రసం పిండిన తరవాత నిమ్మచెక్కలను పారేసేముందు వాటితో ఇంట్లోని బకెట్లు, మగ్గులు రుద్ది కడుగుతూ ఉంటే అవి ఎప్పుడూ కొత్తవాటిలాగే ఉంటాయి.

## చూపు లేని వారికి చుక్కానిలా

అంధ విద్యార్థులకు పాఠాలు చెప్పడంతో మొదలై, వారికి అన్నీ తానై నిలిచే వరకూ... మీరా బద్వే ది సుదీర్ఘమైన ప్రయాణం. దాదాపు ముప్ఫయ్యేళ్లుగా... వేలమంది అంధులకు విద్య, ఆశ్రయం, ఉపాధి కల్పన ద్వారా వారి సర్వతోముఖాభివృద్ధికి ఆమె దోహదం చేస్తున్నారు. "ఎవరో వస్తారని ఎదురుచూడడం కన్నా మనమే ముందడుగు వెయ్యాలి" అంటున్న మీరా బద్వే కథ ఆమె మాటల్లోనే...

"ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సమయంలో 'నా జీవితానికి అర్థమేమిటి?' అనే ప్రశ్న ఎదురవుతుంది. జీవితాన్ని అర్థవంతంగా చేసుకోవడానికి మనం చేసే ప్రయత్నాల్లో... ఎంతో ఆలోచించి అమలు చేసినవి విఫలమవుతాయి. కానీ ఎలాంటి ప్రణాళిక లేకుండా చేసిన కొన్ని పనులు మన జీవితానికి వినూత్నమైన నిర్వచనాన్ని ఇస్తాయి. అలాంటి మార్పు తెచ్చిన సంఘటన ముప్ఫయ్యేళ్ళ క్రితం జరిగింది. నేను పుట్టింది మహారాష్ట్రలోని పుణేలో. చదువు పూర్తయ్యాక పాఠశాలలు, కళాశాలల్లో ఆంగ్ల బోధకురాలుగా పని చేశాను. వివాహమై, మా అమ్మాయి ఉమ పుట్టిన తరువాత ఉద్యోగం వదిలి, పూర్తిగా ఇంటి బాధ్యతలకే పరిమితం అయిపోయాను. అయితే ఏదో వెలితిగా ఉండేది. అందుకే మా అమ్మాయి కాస్త పెద్దది కాగానే... ఒక కాలేజీ నుంచి వచ్చిన అవకాశాన్ని అంగీకరించాను. కానీ అక్కడ చేరేలోగా... స్థానికంగా ఉన్న అంధుల పాఠశాల సందర్శన నన్ను కొత్త దారిలో నడిపించింది.

**వారి భరోసాతో కళ్ళలో నీళ్ళు తిరిగాయి...**

నా భర్తకు చాలా సంవత్సరాలుగా ఒక అంధుల పాఠశాలకు విరాళాలు ఇవ్వడం ఆనవాయితీ. ఒకసారి ఆయనతోపాటు ఆ పాఠశాలకు వెళ్ళాను. అప్పుడు అక్కడ అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఎంతోమంది పిల్లలు క్యూలో నిలబడి ఉన్నారు. 'అపరిచితమైన కొత్త ప్రదేశంలో ఎలా ఉండాలా?' అనే బాధ, దిగులు వారిలో కనిపిస్తున్నాయి. ఇంతలో ఒక పిల్లాడు ఆ క్యూ మధ్యలోనుంచి పరిగెత్తుతూ వచ్చాడు. దారిలో ఉన్న



నన్ను గట్టిగా పట్టుకున్నాడు. నేను అతని తల్లిని అనుకున్నాడు. ఇంటికి తీసుకువెళ్ళాలంటూ ఏడుస్తున్నాడు. ఈలోగా తల్లితండ్రులు వచ్చి అతన్ని తీసుకుపోయారు. నేను, నా భర్త తిరిగి వెళ్తున్నప్పుడు "ఈ పిల్లల కోసం ఏదైనా చెయ్యాలని ఉంది. ఇక్కడే టీచర్‌గా చేరాలనుకుంటున్నాను" అని చెప్పాను. నాకు గతంలో అనుభవం ఉంది కాబట్టి అక్కడ బోధకురాలుగా చేరడం కష్టం కాలేదు. అయితే చేరిన తరువాత మాత్రం ఎన్నో సవాళ్ళు ఎదురయ్యాయి. అప్పటికి నాకు బ్రెయిలీ రాకపోవడంతో బోధించడానికి తడబడ్డాను. కానీ క్రమంగా పిల్లలతో నాకు మంచి అనుబంధం ఏర్పడింది. నేను ఇబ్బంది పడుతున్నానని గ్రహించిన ఆ పిల్లలు "మీకు బ్రెయిలీ రాదని మమ్మల్ని వదిలేసి వెళ్ళొద్దు టీచర్! మీకు మేము నేర్పిస్తాం" అని భరోసా ఇచ్చినప్పుడు నాకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆ తరువాత బ్రెయిలీ నేర్చుకున్నాను. వారితో మమేకమైన నేను మూడేళ్ళ తరువాత ఆ ఉద్యోగం మానెయ్యాల్సి వచ్చింది.

**ఆ ధోరణి భరించలేక...**

పిల్లలకు వారి వైకల్యాన్ని పదేపదే గుర్తు చేసేలా వ్యవహరించకూడదనేది నా ఉద్దేశం. "వారూ అందరు పిల్లల్లాంటివారే. అల్లరి చేస్తారు. ఆటలు ఆడతారు. కొత్త విషయాలు తెలుసుకోవాలని ఉత్సాహపడతారు. వారికీ ఇష్టాయిష్టాలుంటాయి. ఇవేవీ పట్టించుకోకుండా... వారు కుంగిపోయేలా ప్రవర్తించకూడదు" అని నేను చాలా సందర్భాల్లో స్కూల్ నిర్వాహకులకు చెప్పాను. కానీ పట్టించుకోలేదు. ఆ ధోరణి భరించలేక... రాజీనామా చేశాను. తరువాత ఒక రోజు ఆ స్కూల్ విద్యార్థి నన్ను వెతుక్కుంటూ వచ్చాడు. అతను చదువుతున్నది తొమ్మిదోతరగతి. కానీ వయసు పద్దెనిమిదేళ్ళు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం... అతను వయోజనుడయ్యాడు కాబట్టి బ్లయిండ్ స్కూల్‌లో అతను ఉండడం కుదరదు. అతని చదువు, వసతి, భోజన ఖర్చులను అతనే సంపాదించుకోవాలి. అందుకని అతణ్ణి స్కూల్‌లోంచి బయటకు పంపేశారు. అతణ్ణి తల్లితండ్రులు ఎప్పుడో వదిలేశారు. ఎక్కడికి వెళ్ళాలో తెలియక... మూడు వారాలపాటు సరైన తిండి లేకుండా రోడ్ల మీద తిరిగాడు. చివరకు మా ఇంటికి వచ్చాడు. ఆ పిల్లవాడికి ఆశ్రయం కల్పించి, అతని చదువుకు సాయం చేశాను. ఎంతో కష్టపడి చదివిన అతను పదోతరగతిలో నూరుశాతం మార్కులు తెచ్చుకునప్పుడు... తీవ్రమైన ఉద్వేగానికి గురయ్యాను. మానవీయత కరువైన విధానాల వల్ల ఇలాంటి ఎందరో పిల్లల జీవితాలు నాశనమైపోతున్నాయనే ఆవేదన కలిగింది. సమాజం వారికి సాయం చెయ్యడానికి ముందుకురాదు. ఆర్థిక స్థోమత లేని కుటుంబాలు వారిని భారంగా చూస్తాయి. ఈ పరిస్థితిలో... ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురుచూడడం కన్నా... నేనే వారికో దారి చూపాలనుకున్నాను. 1996లో... 'నివంత్ అంధ్ ముక్త వికాసాలయ్' పేరుతో ఒక సంస్థను ప్రారంభించాను.

**ఆ నమ్మకం ఉంది...**

ఇరవై తొమ్మిది ఏళ్ళ క్రితం... ఒకే ఒక విద్యార్థితో మొదలైన మా 'నివంత్' ఇప్పుడు విద్య, జీవన నైపుణ్యాలను నేర్పిస్తూ, భావోద్వేగమైన మద్దతును అందించే కేంద్రంగా అభివృద్ధి చెందింది. అప్పట్లో మాకు వనరులు, నిధులు తక్కువగా ఉండేవి. బ్రెయిలీ వచ్చిన విద్యార్థులు తక్కువ. బ్రెయిలీలో పుస్తకాలను చేతుల్తో రాసుకోవలసి వచ్చేది. అలా దాదాపు 300కు పైగా పుస్తకాలను మా విద్యార్థులు ఎంతో శ్రమ పడి రాశారు. 2007లో బ్రెయిలీ ప్రింటర్ సమకూర్చుకోవడంతో.. ఈ పని సులభం అయింది. ఆ తరువాత 'విజన్ అన్‌లిమిటెడ్' అనే లైబ్రరీని ఏర్పాటు చేశాం. మూడువేలకు పైగా పుస్తకాలు అందులో ఉన్నాయి. రోటరీ క్లబ్ లాంటి సంస్థల సహాయంతో.... పాఠ్య, పాఠ్యేతర అంశాలతో మేము ఏడాదికి లక్షన్నర పేజీలకు పైగా బ్రెయిలీ పుస్తకాలను ముద్రిస్తున్నాం. మహారాష్ట్ర వ్యాప్తంగా పదిహేడు కేంద్రాల్లో ఈ లైబ్రరీ అంధులకు సేవలు అందిస్తోంది. మా సంస్థలో ఇప్పటివరకూ 3,500 మందికి పైగా అంధ బాలలు ఆశ్రయం పొందారు. అందరూ స్వతంత్రంగా జీవించే నైపుణ్యాలను సాధించారు. ఈ ప్రయత్నంలో. నా భర్త, కుమార్తె కూడా నాకు పూర్తి మద్దతుగా నిలుస్తున్నారు. వారి సహకారంతోనే 'స్వలేఖన్ టైపింగ్ ట్యూటర్' అనే యాప్‌ను ఆరేళ్ళ కిందట ఆవిష్కరించాం. అనేక భాషల్లో టైపింగ్‌ను నేర్పే ఈ యాప్ ద్వారా... అంధులైన విద్యార్థులు ఎవరి సాయం లేకుండా పరీక్షలు రాయవచ్చు. పుణేలో కొన్ని అంధ బాలల పాఠశాలల్లో పిల్లలకు ఈ యాప్ వినియోగంలో శిక్షణ ఇస్తున్నాం. 2,000 మందికి పైగా పిల్లలు దీన్ని ఉపయోగిస్తున్నారు. అలాగే... మేము సొంతంగా 'టెక్ విజన్' అనే సాఫ్ట్‌వేర్‌ను రూపొందించుకున్నాం. దీనిలో వ్యాపార అవకాశాలు ఉన్నాయనే విషయం గ్రహించి... ఇరవైమంది అంధ విద్యార్థుల బృందంతో ఒక కంపెనీని ఏర్పాటు చేశాం. ఇప్పుడు ఈ కంపెనీ ద్వారా ఏడాదికి నాలుగైదు కోట్ల రూపాయల లాభం వస్తోంది. అలాగే మా విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తోంది. వెనక్కి తిరిగి చూసుకుంటే ఎంతో సంతృప్తిగా అనిపిస్తోంది. ఇంకా చేయాల్సింది ఎంతో ఉందని నాకు తెలుసు. కానీ నా తరువాత ఈ బాధ్యతను మా విద్యార్థులు ఇంకా సమర్థవంతంగా నిర్వర్తిస్తారనే నమ్మకం నాకుంది."



# కరెంట్ బిల్‌ని ఇలా తగ్గించుకోండి..!

వేసవికాలం వస్తోంది అనగానే అందరిలో కరెంట్ బిల్‌కు సంబంధించిన ఆందోళన ప్రారంభమౌతుంది. ఇంట్లో విద్యుత్ వినియోగానికి సంబంధించి చిన్న జాగ్రత్తలు పాటిస్తే... కరెంట్ బిల్ భారీగా పెరగకుండా చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. వాటి గురించి తెలుసుకుందాం.

ఎల్ఈడీ బల్బుల వల్ల విద్యుత్ వినియోగం తగ్గుతుంది. ఇంట్లోని ప్రతిగదిలో ట్యూబ్‌లైట్‌తోపాటు ఎల్ఈడీ బల్బును కూడా ఏర్పాటు చేసుకోవడం మంచిది. పిల్లలు చదువుకునేటప్పుడు ట్యూబ్‌లైట్‌ను మిగిలిన అన్ని సందర్భాల్లో ఎక్కువగా ఎల్ఈడీ బల్బులను ఉపయోగించడం వల్ల కొంతమేర కరెంట్ బిల్లు తగ్గించుకోవచ్చు.

వేసవికాలంలో చాలామంది ఇళ్లలో ఏసీని ఉపయోగిస్తూ ఉంటారు. ఏసీ వేసేముందు కిటికీలు, తలుపులు మూసివేయాలి. ఏసీని 26 డిగ్రీల వద్ద ఉంచి గది మొత్తం చల్లగా అయిన తరవాత ఆపివేయాలి. నాన్ ఇన్వర్టర్ ఏసీకి బదులు ఇన్వర్టర్ ఏసీని ఎంచుకోవడం మంచిది. ఇన్వర్టర్ ఏసీ......అవసరం మేరకు కంప్రెసర్ వేగాన్ని నియంత్రిస్తుంది. దీనివల్ల ఎక్కువగా విద్యుత్ వినియోగం కాదు. కరెంట్ బిల్ కూడా తగ్గుతుంది. సాధ్యమైనంత వరకు ఏసీకి బదులు కూలర్ వాడుకోవడం మేలు.

హాల్, లివింగ్ రూమ్, స్టడీరూమ్ ఇలా ప్రతి గదిలో అవసరమైనప్పుడు మాత్రమే ఫ్యాన్ వేసుకోవాలి. గది నుంచి బయటికి వస్తూ ఫ్యాన్‌ని ఆపివేయడం మర్చిపోవద్దు. ఈ అంశానికి సంబంధించి పిల్లలకు అర్థమయ్యేలా వివరించడం మంచిది. దుమ్ము, ధూళి పేరుకుంటే ఫ్యాన్ ఎక్కువ విద్యుత్‌ని వినియోగించుకుంటుంది. వారానికి ఒకసారి ఇంట్లోని ఫ్యాన్లను తప్పనిసరిగా శుభ్రం చేయాలి.

మైక్రోవేవ్ ఎక్కువగా విద్యుత్‌ను వినియోగించుకుంటుంది. దీనిని ఉపయోగించుకున్న తరవాత వెంటనే పవర్ బటన్‌ను ఆపివేయాలి. అలాగే స్టాండ్‌బై మోడ్‌లో ఉంచకూడదు.

ఫ్రిజ్ వాడకంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. ఫ్రీజర్లో ఎక్కువగా ఐస్ గడ్డకడితే విద్యుత్ ఎక్కువగా వినియోగమవుతుంది. మూడు రోజులకు ఒకసారి ఫ్రిజ్‌ను పరిశీలించి డీఫ్రాస్ట్ చేయాలి. ఫ్రిజ్ కొనేటప్పుడు ఎక్కువ స్టార్లు ఉన్నది తీసుకోవాలి. ఐదు స్టార్లు ఉంటే... విద్యుత్ వినియోగం తక్కువగా ఉంటుంది.


గీజర్‌లో నీటిని వేడిచేసిన వెంటనే స్నానాదికాలు ముగించాలి. ఇంట్లో పెద్ద గీజర్ ఉంటే అందులో నీటిని ఒకేసారి వేడిచేసి కుటుంబసభ్యులంతా ఒకరి తరవాత ఒకరు స్నానం ముగించేలా చూసుకోవాలి.

వాషింగ్ మెషిన్‌లో సూచించిన లోడ్‌కు తగ్గట్టు దుస్తులు వేయాలి. అంతకు మించి వేస్తే విద్యుత్ వినియోగం పెరుగుతుంది.

సామాన్య కుటుంబంలో పుట్టిన ఆమె అసాధారణమైన మార్గాన్ని ఎంచుకున్నారు. ఏడు ఖండాల్లోని ఏడు పర్వతాల ఆరోహణ లక్ష్యంగా సాగుతున్న ఆమె ప్రయాణం... ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం నాడు అయిదో శిఖరాగ్రాన్ని చేరుకుంది. అర్జెంటీనాలోని అకాంగోవా పర్వతంపై భారత జాతీయ పతాకాన్ని ఎగురవేసి... 'భారత్‌మాతాకీ జైసామాన్య కుటుంబంలో పుట్టిన ఆమె అసాధారణమైన మార్గాన్ని ఎంచుకున్నారు. ఏడు ఖండాల్లోని ఏడు పర్వతాల ఆరోహణ లక్ష్యంగా సాగుతున్న ఆమె ప్రయాణం... ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం నాడు అయిదో శిఖరాగ్రాన్ని చేరుకుంది. అర్జెంటీనాలోని అకాంగోవా పర్వతంపై భారత జాతీయ పతాకాన్ని
**ఎగురవేసి... 'భారత్‌మాతాకీ జై**
**ఆమె లక్ష్యం, గమ్యం... ఏడు ఖండాల్లో ఏడు శిఖరాలు**

# ఆమె లక్ష్యం, గమ్యం... ఏడు ఖండాల్లో ఏడు శిఖరాలు





సామాన్య కుటుంబంలో పుట్టిన ఆమె అసాధారణమైన మార్గాన్ని ఎంచుకున్నారు. ఏడు ఖండాల్లోని ఏడు పర్వతాల ఆరోహణ లక్ష్యంగా సాగుతున్న ఆమె ప్రయాణం... ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం నాడు అయిదో శిఖరాగ్రాన్ని చేరుకుంది. అర్జెంటీనాలోని అకాంగోవా పర్వతంపై భారత జాతీయ పతాకాన్ని ఎగురవేసి... 'భారత్‌మాతాకీ జై' అంటూ ఆమె చేసిన నినాదం కొండ కోనల్లో ప్రతిధ్వనించింది. రెట్టించిన ఉత్సాహంతో మరో రెండు పర్వతాల అధిరోహణకు సిద్ధమవుతున్న తెలుగు యువతి పడమటి అన్విత సాహసోపేతమైన కథ ఇది..."పర్వతారోహణకు ధైర్య సాహసాలతోపాటు వాతావరణ పరిస్థితులను తట్టుకొనే దారుఢ్యం, ఓర్పు, సమయస్ఫూర్తి ఉండాలి. దాని కోసం నిరంతరమైన సాధన అవసరం అవుతుంది. దక్షిణ అమెరికాలోని అర్జెంటీనాలో ఉన్న అకాంగోవా పర్వతారోహణ కూడా ఎన్నో సవాళ్ళు విసిరింది. ఈ నెల (2025 జనవరి) 10వ తేదీన మన దేశంలో బయలుదేరి... 12వ తేదీన అర్జెంటీనా చేరుకున్నాను. సముద్ర మట్టానికి 6,961 మీటర్ల ఎత్తులో ఉన్న అంకాగోవా పర్వతాన్ని ఎక్కడానికి అవసరమైన డాక్యుమెంటేషన్ పూర్తి చేశాను. మా బృందంలో మొత్తం తొమ్మిదిమంది ఉన్నాం. అయిదుగురు మహిళలం, నలుగురు పురుషులు. మేము 13వ తేదీన బేస్‌క్యాంప్ నుంచి పర్వతారోహణ ప్రారంభించాం.

మైనస్ 25 నుంచి మైనస్ 30 డిగ్రీల అతి శీతలమైన వాతావరణంలో, తీవ్రమైన చలిగాలుల మధ్య మా యాత్ర సాగింది. బేస్‌క్యాంపనకు, గమ్యానికి మధ్య 70 శాతం భాగం మంచుతో కప్పేసి ఉంది. మిగిలిన భాగమంతా జారుడుగా ఉన్న రాళ్ళ మార్గం. దాదాపు 6 వేల మీటర్ల ఎత్తుకు చేరుకొనేసరికి... పరిస్థితులను భరించలేక ఆరుగురు వెనుతిరిగారు. ఇద్దరు పురుషులు, నేను మాత్రమే గమ్యాన్ని చేరుకోగలిగాం. 13 రోజులపాటు సాగిన మా ఆరోహణ.... మన గణతంత్ర దినమైన జనవరి 26వ తేదీ ఉదయంఅకాంగోవా శిఖరాగ్రం దగ్గర ముగిసింది. అక్కడ మన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశాను. 'భారత్ మాతాకీ జై' అని నినదిస్తూ మన దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపాను. ఆ క్షణంలో... నాలో ఏదో మహత్తరమైన భావోద్వేగం.

**భువనగిరి ఖిల్లా మీద...**

మాది తెలంగాణలోని యాదాద్రి-భువనగిరి జిల్లా భువనగిరి. నాన్న పడమటి మధుసూదన్‌రెడ్డి వ్యవసాయం చేస్తారు. అమ్మ చంద్రకళ అంగన్వాడీ టీచర్. నాలుగేళ్ళ క్రితం ఎంబీయే పూర్తి చేశాను. పర్వతారోహణ పట్ల నా ఆసక్తిని గమనించిన ట్రాన్సెండ్ అడ్వంచర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎం.డి. ఎవరెస్టర్ శేఖర్‌బాబు ఆ దిశగా ప్రోత్సహించారు. ఆయన పర్యవేక్షణలో భువనగిరి ఖిల్లా మీద నా ప్రాథమిక శిక్షణ సాగింది. అప్పుడే ఏడు ఖండాల్లోని ఏడు ఎత్తైన పర్వతాలను అధిరోహించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. దేశ, విదేశాల్లోని అనేక పర్వతాల ఆరోహణతో నా సామర్థ్యానికి మెరుగులు దిద్దుకున్నాను. ఆఫ్రికా ఖండంలో... సముద్రమట్టానికి 5,896 మీటర్ల ఎత్తులో ఉన్న ఖిలిమంజారోను 2020 జనవరిలో అధిరోహించడంతో నా సప్త ఖండాల పర్వతారోహణ మొదలయింది. 2021 డిసెంబరు 7న 5,642 మీటర్ల ఎత్తైన ఎల్‌బ్రస్ (యూరప్), 2022 మే 16న ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 8,848.86 మీటర్ల ఎవరెస్ట్ శిఖరం (ఆసియా ఖండం), 2022 డిసెంబరు 17న సముద్రమట్టానికి 4,892 మీటర్ల ఎత్తులో ఉన్న విన్సన్ (అంటార్కిటికా) పర్వతాలను అధిరోహించాను. అయిదవదిగా... దక్షిణ అమెరికా ఖండంలోని అకాంగోవా కూడా పూర్తయింది. దీనికి హైదరాబాద్‌కు చెందిన అన్విత కన్‌స్ట్రక్షన్స్ ఆర్థిక సాయం చేసింది. ట్రాన్సెండ్ అడ్వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రమోటర్‌గా వ్యవహరించింది. ప్రస్తుతం అన్విత ట్రాన్సెండ్ అకాడమీ సీనియర్ ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేస్తున్నాను. ఇంకా... ఉత్తర అమెరికా ఖండంలోని అలస్కాలో... సముద్ర మట్టానికి 6,990 మీటర్ల ఎత్తులో ఉన్న డెనాలీ పర్వతాన్ని, ఆస్ట్రేలియాలో సముద్రమట్టానికి 2,228 మీటర్ల ఎత్తైన ఖోజిస్కో పర్వతాన్ని అధిరోహించాలి. త్వరలోనే వాటిని కూడా ఎక్కి... నా లక్ష్యాన్ని నెరవేర్చుకుంటాను.'

## రైతన్నకు అండగా.. పంట బీమా పాలసీలను అందిస్తున్న ఎస్‌బీఐ జనరల్


**న్యూఢిల్లీ-నవభూమి:**రైతన్నకు ఆపద సమయంలో అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పథకం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన. ఈ పథకం కింద రైతులకు పంట బీమా పాలసీలను అందించేందుకు ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్‌సంస్థ నడుం బిగించింది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖతో కలిసి -మేరీ పాలసీ మేరే హాథ్- క్యాంపెయిన్ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం 2025 ఫిబ్రవరి 1 నుంచి మార్చి 15 వరకు జరగనుంది. ఈ పథకం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రచారం చేస్తోంది ఈ



క్యాంపెయిన్‌లో భాగంగా రైతులకు వారి ఇంటి దగ్గరే పంట బీమా పాలసీ పత్రాలను అందజేస్తారు. అలాగే, పంట బీమా ప్రయోజనాలపై రైతులకు అవగాహన పెంచుతున్నారు. పంట బీమా ప్రాసెస్‌లో పారదర్శకతను పెంచడంపై %--%మేరీ పాలసీ మేరే హాథ్- క్యాంపెయిన్ దృష్టి సారిస్తుంది. ఈ పథకంలో భాగంగా రైతుల ఖరీఫ్, రబీ పంటలకు బీమా చేస్తారు. కేవలం రెండు శాతం ప్రీమియంగా చెల్లిస్తే చాలు.. మిగతా ప్రీమియంను ప్రభుత్వం చెల్లిస్తుంది. రైతులకు ప్రకృతి విపత్తుల కారణంగా నష్టం వాటిల్లితే ఈ ఇన్సూరెన్స్ సంస్థల ద్వారా ప్రభుత్వం రూ. 60 వేల వరకు నష్టపరిహారం చెల్లిస్తుంది.




# గోల్డ్ బాండ్లకు గుడ్‌బై..



**న్యూఢిల్లీ-నవభూమి:**పసిడిలో మదుపు చేయాలనుకునే మదుపరులకు నిన్న మొన్నటి వరకు సావరిన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జీబీ) మంచి పెట్టుబడి సాధనం. అయితే మొన్నటి కేంద్ర బడ్జెట్‌లో ఈ బాండ్స్ జారీకి ప్రభుత్వం ఫుల్‌స్టాప్ పెట్టింది. మరి ఇప్పుడు డిజిటల్ ఫార్మాట్‌లో పసిడిలో మదుపు చేయాలనుకునే మదుపరుల ముందు ఉన్న మార్గాలు ఏమిటి? అయితే ఇది మీ కోసమే..

బంగారానికి, మన సంస్కృతికి అవినాభావ సంబంధం ఉంది. వీసమెత్తు బంగారమైనా లేకుండా మన దేశంలో ఏ ఇంట్లో, ఏ శుభకార్యం జరగదంటే అతిశయోక్తి కాదు. అటు స్టేటస్ సింబల్‌గానే గాక, పెట్టుబడి సాధనంగానూ మన దేశంలో పసిడికి విపరీతమైన డిమాండ్ ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల పొదుపులో కొంత మొత్తాన్ని అయినా డిజిటల్ గోల్డ్ వైపు మళ్లించే ఉద్దేశంతో ప్రభుత్వం 2015లో సావరిన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జీబీ) పథకం తీసుకొచ్చింది. గత పదేళ్లలో ఈ పథకం కింద 67 విడతలుగా 14.7 కోట్ల యూనిట్ల ఎస్‌జీబీలను ప్రభుత్వం జారీ చేసింది.

**పసిడి పైపై చూపులు**

అయితే మొన్నటి కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ఎస్‌జీబీ పథకానికి ఫుల్‌స్టాప్ పెట్టింది. దీంతో డిజిటల్ ఫార్మాట్‌లో పసిడిలో మదుపు చేయాలనుకునే మదుపరులకు ఒక మార్గం మూసుకుపోయింది. మరోవైపు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో పసిడి ధర రికార్డులు సృష్టిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) మేలిమి బంగారం 2,900 డాలర్లకు అటుఇటూగా ఉంది. దేశీయ మార్కెట్‌లోనూ 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం రూ. 86,000–88,000 మధ్య తచ్చాడుతోంది. డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనం, అంతర్జాతీయ ఉద్రిక్తతలతో ధర మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పెట్టుబడి లాభాల కోసం డిజిటల్ ఫార్మాట్‌లో పసిడిలో మదుపు చేయాలనుకునే మదుపరులు ఈ కింది మార్గాలను అన్వేషించవచ్చు.

**ట్రేడ్ ఎస్‌జీబీలు**

ప్రభుత్వం ఇప్పటి వరకు జారీ చేసిన ఎస్‌జీబీలన్నీ బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్టయ్యాయి. డీమ్యాట్ ఖాతా ఉన్న రిటైల్ మదుపరులు ఎవరైనా ఈ రెండు స్టాక్ ఎక్స్ఛేంజీల క్యాష్ సెగ్మెంట్‌లో ఎనిమిదేళ్ల కాలపరిమితి ఉండే ఈ ఎస్‌జీబీల యూనిట్లను కొనుగోలు చేయవచ్చు. కాకపోతే వీటికి ఐదేళ్ల లాక్-ఇన్-పీరియడ్ ఉంటుంది. ఐదు, ఆరు, ఏడేళ్ల చివర్లో ఆర్‌బీఐ ఈ బాండ్స్‌కు బైబ్యాక్ సదుపాయం కల్పిస్తోంది.

**గోల్డ్ ఈటీఎఫ్‌లు**

డిజిటల్ రూపంలో పసిడిలో మదుపు చేయాలనుకునే మదుపరులు మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) అందించే గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోనూ మదుపు చేయవచ్చు. ఒక్కో గోల్డ్ ఈటీఎఫ్ ఒక గ్రాము బంగారానికి సమానం. ఈ పథకాల ద్వారా సమీకరించిన నిధులను మ్యూచువల్ ఫండ్స్.. ఫిజికల్ గోల్డ్‌లో పెట్టుబడులుగా పెడతాయి. ప్రతి ట్రేడింగ్ డే చివర్లో ఆ రోజు బంగారం మార్కెట్ ధర ప్రకారం ఈ యూనిట్ల నికర ఆస్తుల విలువ (ఎన్ఏవీ) ప్రకటిస్తారు. ఈ ఈటీఎఫలు కూడా లిస్టయి ఉంటాయి, కాబట్టి డీమ్యాట్ ఖాతా ఉన్న మదుపరులు ఎప్పుడు కావాలంటే అప్పుడు వీటిని అమ్ముకోవచ్చు. లేదా కొనుగోలు చేయవచ్చు. నగలు లేదా ఫిజికల్ గోల్డ్ మేకింగ్ చార్జీలతో పోలిస్తే వీటి బ్రోకరేజీ చార్జీలూ తక్కువే. గోల్డ్ ఎంఎఫలతో పోలిస్తే ఖర్చులూ తక్కువగానే ఉంటాయి. కాకపోతే ఈ ఈటీఎఫలను అమ్మాలన్నా, కొనాలన్నా ఎగ్జిట్, ఎంట్రీ లోడ్‌లు ఉంటాయి.

## పిల్లల ఇన్‌స్టా అకౌంట్స్..ఇకపై పేరెంట్స్ కంట్రోల్ చేయవచ్చు.. యాక్టివేట్ కోసం..



**న్యూఢిల్లీ-నవభూమి:**నడవడం మొదలుపెట్టీపెట్టగానే అరచేతిలో ఫోన్ ఉండాల్సిందే అంటున్నారు నేటి తరం పిల్లలు. స్కూల్‌కు వెళ్లే పిల్లల నుంచి ప్రతి ఒక్కరికీ ఇన్‌స్టా అకౌంట్ ఉండటం అనేది ప్రస్తుతం కాలంలో సర్వసాధారణ విషయం. ఇంట్లో ఉన్నంతసేపు ఫోన్ చేతిలో పట్టుకుని రీల్స్ స్క్రోల్ చేయడం లేదా క్రియేట్ చేయడం ఇప్పటి పిల్లల అలవాటు. పెద్దలు వారి పనిలో వారుంటే చడీ చప్పుడూ లేకుండా ఒకే చోట కూర్చుని గంటల తరబడి అలా సోషల్ మీడియా మేనియాలో కొట్టుకుపోతుంటారు. ఎలాంటి కంటెంట్ వీక్షిస్తున్నారు? ఎవరితో కమ్యూనికేట్ అవుతున్నారు? అనేది అందరు తల్లిదండ్రులకి తెలుసుకోవడం సాధ్యంకాదు. ఇది దృష్టిలో ఉంచుకుని పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం ఇన్‌స్టాగ్రామ్ భారతదేశంలో టీన్ అకౌంట్‌లను ప్రారంభించింది. మరి, ఈ ఫీచర్ ఏంటి ? పేరెంట్స్ పిల్లల అకౌంట్స్ కంట్రోల్ చేసేందుకు ఎలా యాక్టివేట్ చేసుకోవాలి?

**టీన్ అకౌంట్స్ అంటే ఏమిటి ?**

మెటా ప్రవేశపెట్టిన ఈ టీన్ అకౌంట్స్ ఫీచర్ 16 ఏళ్లలోపు టీనేజర్లకు భద్రతా సెట్టింగ్‌లను వర్తింపజేస్తుంది. ఈ ప్లాట్‌ఫామ్‌లో వారి పిల్లల కార్యకలాపాలను పర్యవేక్షించడానికి పేరెంట్స్‌కు కొన్ని ప్రత్యేక టూల్స్ అందిస్తుంది. ఫాలో అవుతున్న ఖాతాల పోస్టులు మాత్రమే వీక్షించగలరు. ట్యాగ్ చేయగలరు. ఫాలో/ కనెక్ట్ అయిన ఖాతాలతోనే కాంటాక్స్ కాగలిగేలా మెసేట్ సెట్టింగ్స్ ఉంటాయి. తల్లిదండ్రులు యాక్సెప్ట్ చేశాకే ఏ కొత్త ఖాతానైనా ఫాలో చేయగలరు. సెన్సిటివ్ కంటెంట్ కంట్రోల్ ఉండటం వల్ల అసభ్యకరమైన, హానికరమైన కంటెంట్, కామెంట్స్ ఇలాంటి ఖాతాల్లో నిషేధం. ఒక రోజులో 60 నిమిషాల కంటే ఎక్కువసేపు వాడితే పేరెంట్స్‌కు అలర్ట్ మెసేజ్ వస్తుంది. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకూ ఆటోమేటిగ్గా స్లీప్ మోడ్ ఆన్ అవుతుంది. ఆ సమయంలో నోటిఫికేషన్లు మ్యూట్ అయిపోతాయి.

**పిల్లల ఇన్‌స్టా ఖాతాను ఇలా కంట్రోల్ చేయాలి?**

తల్లిదండ్రులు లేదా సంరక్షకులు పిల్లల ఖాతాలు కంట్రోల్‌లోకి తెచ్చుకోవాలంటే తప్పనిసరిగా వారికీ ఇన్‌స్టాలో ఖాతా ఉండితీరాలి. తమ నియంత్రణలోకి తెచ్చుకోవాలంటే వ్యక్తిగత ఖాతా ప్రొఫైల్ ఓపెన్ చేసి అందులో ఉన్న %హావ్ఙఅస్త్రం ఖఅఎ ఖష్ఙఅజట్ఎ%లోని %ఖీుఎఅశ్రీఎ ఎవత్వతీ% ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. తర్వాత మీ పిల్లల ఖాతాను ఎంచుకోగానే వారి అకౌంట్‌కు రిక్వెస్ట్ వెళుతుంది. వారు యాక్సెప్ట్ చేశాకే ఖాతా పేరెంట్స్ కంట్రోల్‌లోకి వస్తుంది. వారు ఇతరులకు ఏం మెసేజ్ చేశారనేది చదవలేరు. కానీ, వారం రోజుల ముందు వరకూ మీ పిల్లలు ఎవరెవరితో ఛాట్ చేశారనే సంగతి తెలుస్తుంది. టైమ్ లిమిట్, స్లీప్ మోడ్ సెట్టింగ్స్‌లో మార్పులు చేసుకునే సదుపాయం ఉంది.

**పేరెంట్స్ అనుమతి లేకపోతే ఇవి చేయలేరు..**

తల్లిదండ్రులు ఓకే చెయ్యకుపండా పిల్లలు తమ ఖాతాను ప్రైవేటు అకౌంట్‌గా మార్చుకోలేరు. ఒకవేళ Account Privacyపై క్లిక్ చేసినా ఆల్రెడీ Private Account ఆప్షన్ ఎనేబుల్‌లో ఉన్నట్టు కనిపిస్తుంది. డిజేబుల్ చేయాలని ట్రై చేస్తే పేరెంట్స్ అకౌంట్ సెలెక్ట్ చేసుకోవాలని చూపిస్తుంది. Add Parent ఆప్షన్ పైనా క్లిక్ చేసి తర్వాత ఎంచుకోవాలి. అప్పుడు పేరెంట్స్‌కు మీ రిక్వెస్ట్ వెళుతుంది. వారు ఓకే చేస్తేనే టీన్ అకౌంట్ నుంచి పబ్లిక్ అకౌంట్‌గా ఛేంజ్ అవుతుంది.

## ఇన్నోవేటివ్యూ ఇండియా లిమిటెడ్.. రూ. 2,000 కోట్లు సమీకరణకు రంగం సిద్ధం..




**న్యూఢిల్లీ-నవభూమి:**దేశవ్యాప్తంగా పరీక్షలు, ఎలక్షన్లు మొదలైన భారీ కార్యక్రమాలకు ఆటోమేటెడ్ యాన్సిలరీ సెక్యూరిటీ, సర్వైలెన్స్ సొల్యూషన్స్ అందిస్తున్న టెక్ ఆధారిత కంపెనీ ఇన్నోవేటివ్యూ ఇండియా లిమిటెడ్ ఐపీఓకు సిద్ధమవుతోంది. ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్‌కి సంబంధించి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదాను (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓ కింద ఆఫర్ ఫర్ సేల్ మార్గంలో షేర్లను విక్రయించడం ద్వారా రూ. 2,000 కోట్ల వరకు సమీకరించాలని భావిస్తోంది.దేశీయంగా ఎగ్జామినేషన్ ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీ సొల్యూషన్స్ అందించే ఇన్నోవేటివ్యూ- దేశంలోనే అతి పెద్ద కంపెనీగా నిలిచింది. 2024 ఆర్థిక సంవత్సరంలో 73.7 శాతం మార్కెట్ వాటాతో ప్రథమ స్థానంలో నిలిచింది. త్వరలోనే ఈ ఐపీఓకు సంబంధించి పూర్తి వివరాలు బయటకు రాబోతున్నాయి. డీఏఎమ్ క్యాపిటల్ అడ్వైజర్స్ లిమిటెడ్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్ లిమిటెడ్, జేఎం ఫైనాన్షియల్ లిమిటెడ్, మోతీలాల్ ఓస్వాల్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ లిమిటెడ్, షనాన్ అడ్వైజర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు ఇన్నోవేటివ్ వ్యూ ఐపీఓకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి.

## చౌక రీఛార్జ్ ప్లాన్.. రూ. 108కే 60 రోజుల ప్రయోజనం

**న్యూఢిల్లీ-నవభూమి:**దేశంలో ప్రస్తుతం (భారత ప్రభుత్వ టెలికాం సంస్థ) ట్రెండ్ మొదలైందని చెప్పవచ్చు. ఎందుకంటే ఇటీవల మళ్లీ 17 ఏళ్ల తర్వాత ఈ సంస్థ లాభాల్లోకి వచ్చింది. ఈ క్రమంలోనే వినియోగదారులకు తక్కువ ధరల్లో రీఛార్జ్ ప్లాన్‌లను అందిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్న ఈ టెలికాం సంస్థ నిరంతరం వినియోగదారుల అవసరాల మేరకు ప్రత్యేకమైన సేవలను అందిస్తోంది. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో కూడా తన సేవలను విస్తరించి, విశ్వసనీయమైన నెట్‌వర్క్ కనెక్షన్లు అందిస్తోంది.60 రోజుల ప్రయోజనం..ప్రస్తుతం ఇటీవల లాంచ్ చేసిన 108 రూపాయల రీఛార్జ్ ప్లాన్ చర్చనీయాంశంగా మారింది. ఈ ప్లాన్ వినియోగదారులకు 60 రోజుల పాటు అద్భుతమైన ప్రయోజనాలను అందిస్తుంది. 108 రూపాయల ప్లాన్ ద్వారా వినియోగదారులు రోజుకు డేటాను పొందుతారు. ఇది 60 రోజుల పాటు లభిస్తుంది. అంటే మొత్తం 60% డేటా వస్తుంది. ఇది ఇంటర్నెట్ సేవలను తరచుగా ఉపయోగించే వారికి మంచి ఆప్షన్ అని చెప్పవచ్చు.

## ఎస్‌బీఐ గృహ రుణగ్రహీతలకు శుభవార్త




**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ ప్రామాణిక రుణ వడ్డీ రేట్లను తగ్గించింది. రెపో అనుసంధానిత రుణ రేటు (ఆర్ఎల్ఎల్ఆర్), బాహ్య ప్రామాణిక రుణ రేటు (ఈబీఎల్ఆర్)ను పావు (0.25) శాతం తగ్గిస్తున్నట్లు ప్రకటించింది.

**ఎస్‌బీఐ గృహ రుణగ్రహీతలకు శుభవార్త**

**రెపో అనుసంధానిత రుణ రేట్లు 0.25శాతం తగ్గింపు**

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ ప్రామాణిక రుణ వడ్డీ రేట్లను తగ్గించింది. రెపో అనుసంధానిత రుణ రేటు (ఆర్ఎల్ఎల్ఆర్), బాహ్య ప్రామాణిక రుణ రేటు (ఈబీఎల్ఆర్)ను పావు (0.25) శాతం తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. దాంతో ఈబీఎల్ఆర్ 9.15 శాతం నుంచి 8.90 శాతానికి దిగిరాగా.. ఆర్ఎల్ఎల్ఆర్ 8.75 శాతం నుంచి 8.50 శాతానికి తగ్గింది. తగ్గించిన వడ్డీ రేట్లు శనివారం నుంచే అమల్లోకి వచ్చాయి. ఈ నెలలో ఆర్‌బీఐ రెపో రేటును 0.25 శాతం తగ్గించిన నేపథ్యంలో బ్యాంక్ ఆ ప్రయోజనాన్ని తాజాగా రుణగ్రహీతలకు బదిలీ చేసింది.

దీంతో ఎస్‌బీఐ నుంచి ఈబీఎల్ఆర్, ఆర్ఎల్ఎల్ఆర్ అనుసంధానిత గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు తీసుకున్నవారిపై ఈఎంఐ భారం తగ్గనుంది. కాగా, ద్రవ్య సమీకరణ వ్యయ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్ఆర్), బేస్ రేటు, బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటు (బీపీఎల్ఆర్) మాత్రం యథాతథంగా కొనసాగుతాయని ఎస్‌బీఐ స్పష్టం చేసింది.

## 17 నుంచి కొత్త ఫాస్ట్ ట్యాగ్ రూల్స్.. ఇవి పాటించకుంటే ఫైన్



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశంలో ఇప్పటికే అనేక మంది వారి వాహనాలపై ఫాస్ట్ ట్యాగ్‌లను ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో మీరు కూడా ఫాస్ట్ ట్యాగ్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే, ఈ తాజా మార్పులను మాత్రం తప్పక తెలుసుకోవాలి. ఎందుకంటే ఫిబ్రవరి 17, 2025 నుంచి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొత్త ఫాస్ట్ ట్యాగ్ రూల్స్ అమలు చేయనుంది. ఈ నియమాల ప్రకారం మీరు కొత్త చెల్లింపు విధానాలను పాటించకపోతే, అదనంగా మీరు ఫైన్ చెల్లించాల్సి రావచ్చు. అయితే కొత్తగా అమలు చేయనున్న రూల్స్ ఏంటనేది ఇక్కడ చూద్దాం.

**ఫాస్ట్ ట్యాగ్ ప్రాసెస్..**

మీరు హైవేపై ప్రయాణిస్తూ ఒక జిల్లా నుంచి మరొక జిల్లా లేదా రాష్ట్రం నుంచి మరో రాష్ట్రం మారేటప్పుడు టోల్ ప్లాజా వద్ద రోడ్డు పన్ను చెల్లించడం తప్పనిసరి. కానీ ఫిబ్రవరి 17 నుంచి కొత్త ఫాస్ట్ ట్యాగ్ బ్యాలెన్స్ ధ్రువీకరణ విధానం అమల్లోకి రానుంది. ఈ కొత్త నియమాలు మీ జేబులపై ప్రభావం చూపిస్తాయి.

**కొత్త ఫాస్ట్ ట్యాగ్ నియమాలు..**

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 2025 జనవరి 28న కొత్త నియమాలను జారీ చేసింది. ఈ నిబంధనల ప్రకారం ఫిబ్రవరి 17, 2025 నుంచి మీరు టోల్ ప్లాజాకు చేరుకున్న తర్వాత 60 నిమిషాల కంటే ఎక్కువ సమయం తీసుకుంటే, ఫాస్ట్ ట్యాగ్ బ్లాక్ అవుతుంది. ఆ సమయంలో చెల్లింపులు జరగవు. అదేవిధంగా ట్యాగ్‌ను టోల్ ప్లాజా వద్ద చూపించిన తర్వాత కనీసం 10 నిమిషాలకు బ్లాక్‌లిస్ట్ చేయబడితే కూడా చెల్లింపులు జరగవు. ఈ కొత్త నియమాల ప్రకారం వినియోగదారులకు 70 నిమిషాల సమయం లభిస్తుంది. దీని ద్వారా వారు తమ ఫాస్ట్ ట్యాగ్ స్థితిని అప్‌డేట్ చేసుకోవచ్చు.

**వినియోగదారులపై ప్రభావం..**

ఈ క్రమంలో ఫాస్ట్ ట్యాగ్ నియమాల మార్పు వినియోగదారులపై ఎలా ప్రభావం చూపుతుందనేది ఆసక్తిగా మారింది. మీరు టోల్ ప్లాజాకు చేరుకుని, చివరి క్షణంలో ఫాస్ట్ ట్యాగ్ రీఛార్జ్ చేస్తే, అది మీకు ప్రయోజనం చేకూర్చదు. మీ ట్యాగ్ ముందే బ్లాక్‌లిస్ట్ చేయబడితే, టోల్ ప్లాజా వద్ద రీఛార్జ్ చేసినా, చెల్లింపులు జరగవు. దీని కారణంగా మీరు రెట్టింపు టోల్ ఛార్జీలు చెల్లించాల్సి వస్తుంది.

**రెట్టింపు ఛార్జీల తగ్గింపు**

ఫాస్ట్ ట్యాగ్ బ్లాక్ లిస్ట్‌లో ఉన్నప్పుడు మీరు టోల్ ప్లాజాను దాటినపుడు రెట్టింపు ఛార్జీలు వసూలు చేస్తారు. ఈ సమయంలో మీరు 10 నిమిషాల ముందు ట్యాగ్ రీఛార్జ్ చేస్తే, మీరు పెనాల్టీ వాపసు పొందవచ్చు. దీనివల్ల మీరు అదనపు ఛార్జీలు చెల్లించకుండా ఉండవచ్చు.

**ఫాస్ట్ ట్యాగ్ బ్యాలెన్స్ నిర్వహణ..**

ఈ క్రమంలో కొత్త నియమాలకు అనుగుణంగా మీరు మీ ఫాస్ట్ ట్యాగ్ బ్యాలెన్స్‌ను మానిటర్ చేసుకోవడం కూడా చాలా ముఖ్యం. మీరు ఇళ్ల నుంచి బయటకు వెళ్లేటప్పుడు, మీ ఫాస్ట్ ట్యాగ్ బ్యాలెన్స్‌ను చూసుకుని, అవసరమైతే ముందుగానే రీఛార్జ్ చేసుకోవాలి. అలా చేయడం వల్ల కొత్త మార్పులు అమల్లోకి వచ్చినప్పుడు, మీరు రెట్టింపు ఛార్జీల నుంచి తప్పించుకోవచ్చు.

**బ్లాక్ లిస్ట్ స్థితి ఎలా తెలుసుకోవాలి?**

మీ ఫాస్ట్ ట్యాగ్ బ్లాక్ లిస్ట్ స్థితి తెలుసుకోవడం చాలా అవసరం. దీని కోసం మీరు రవాణా శాఖ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. ఆ వెబ్‌సైట్‌లో "ఇ-చలాన్ స్థితిని తనిఖీ చేయండి" లేదా మరో ఆప్షన్‌ను ఎంచుకుని, మీ వాహన రిజిస్ట్రేషన్ నంబర్‌ను నమోదు చేయండి. ఇలా చేసినప్పుడు, మీరు మీ వాహనం బ్లాక్ లిస్ట్‌లో ఉందో లేదో తెలుసుకోగలుగుతారు. కొత్త ఫాస్ట్ ట్యాగ్ నియమాలు అమలు కాకుండా ఉండాలంటే, పైన చెప్పిన నియమాలు పాటించడం తప్పనిసరి. మీరు మీ ఫాస్ట్ ట్యాగ్‌ను గమనించి, ఫ్లైట్స్ లేదా టోల్ స్టేషన్ల వద్ద ప్రయాణించే ముందు 70 నిమిషాల వ్యవధిలో బ్యాలెన్స్ సరిచేసుకోవాలి.

## పెళ్లికి ముందే జంటగా ఫైనాన్షియల్ ప్లానింగ్



**న్యూఢిల్లీ-నవభూమి:**పరిణయం.. రెండు జీవితాల సంగమం. కడదాకా కలిసుండేందుకు ముడిపెట్టే బంధం. అందుకు ఇద్దరి మధ్య తరగనంత ప్రేమతో పాటు తగినంత డబ్బూ అవసరమే. ఎందుకంటే, భార్యా భర్తల సంబంధంలో డబ్బు చాలా సున్నితమైన, ప్రధాన అంశంగా మారింది.

పెళ్లికి ముందే జంటగా ఫైనాన్షియల్ ప్లానింగ్
- మనీ మ్యాటర్స్ ముందే మాట్లాడుకుంటే బెటర్
- తద్వారా వైవాహిక బంధానికి, భవిష్యత్‌కు భరోసా

పరిణయం.. రెండు జీవితాల సంగమం. కడదాకా కలిసుండేందుకు ముడిపెట్టే బంధం. అందుకు ఇద్దరి మధ్య తరగనంత ప్రేమతో పాటు తగినంత డబ్బూ అవసరమే. ఎందుకంటే, భార్యా భర్తల సంబంధంలో డబ్బు చాలా సున్నితమైన, ప్రధాన అంశంగా మారింది. ఇరువురి మధ్య ఆర్థిక విబేధాలతో వివాహ బం?ధం బీటలు వారే ప్రమాదం ఉంది. ఒక్కోసారి విడాకులకూ దారి తీయవచ్చు. అందుకే, పెళ్లికి ముందే జంటగా ఆర్థిక విషయాలు, లక్ష్యాలపై చర్చించుకోవడం మేలు. తద్వారా వారి వైవాహిక జీవితంలో ఎదురయ్యే ఆర్థిక సవాళ్లను జంటగా పరిష్కరించుకునేందుకు ముందు నుంచే సిద్ధం కావచ్చు. అయితే, కాపురానికి ముందే ఇలాంటి విషయాలను ప్రస్తావిస్తే కాబోయే భర్త లేదా భార్య తనను డబ్బు మనిషి అనుకుంటారన్న సందేహం ప్రతి జంటలోనూ ఉంటుంది. కానీ, మీ దృక్పథాన్ని, లక్ష్యాన్ని నిజాయితీగా, స్పష్టంగా వివరించగలిగితే మీ భాగస్వామితో బంధం మరింత బలపడుతుంది.

కుటుంబ ఖర్చులు లేదా పెట్టుబడుల గురించి చర్చించే ముందు ఆర్థిక విషయాల్లో మీ భాగస్వామి వైఖరిని అర్థం చేసుకునే ప్రయత్నం చేయండి. మీకు కాబోయే భర్త లేదా భార్య దృష్టిలో డబ్బు అంటే ఆర్థిక భరోసానా..? స్వేచ్ఛా జీవితమా..? లేదా వినోదం, విలాసాలా..? ఈ విషయాన్ని పసిగట్టగలిగితే మీ భాగస్వామి ఖర్చు చేసే విధానం, ఆర్థిక ప్రాధాన్యాలపై ఓ అంచనాకు రాగలుగుతారు. అలాగే, మీ ఆర్థిక దృక్పథంలో పోల్చి చూసుకోవచ్చు. తద్వారా వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టాక తలెత్తే అభిప్రాయ భేధాలను ముందుగానే నివారించుకునే వీలుంటుంది. అంతేకాదు, ఆర్థిక విషయాలపై ఏ కోణంలో చర్చ మొదలు పెట్టాలనే విషయంపైనా అవగాహన లభిస్తుంది. ఉదాహరణకు, మీరు పొదుపరి. కానీ, మీ భాగస్వామి ఆనందాల కోసం బాగా ఖర్చు చేస్తారనుకుందాం. ఈ సందర్భంలో ముందుగా చర్చించుకోవడం ద్వారా పెళ్లి తర్వాత మధ్యేమార్గంపై ఓ నిర్ణయానికి రావడంతోపాటు భవిష్యత్ ప్రణాళికను రచించుకునేందుకు వీలుపడుతుంది.

**పారదర్శకంగా చర్చించండి..**

పెళ్లికి ముందే ఆర్థిక విషయాల్ని చర్చించినా, అందులో పారదర్శకత లేకపోతే కాపురంలో సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. కేవలం ఆదాయం, ఖర్చులనే కాదు కుటుంబ ఆర్థిక లక్ష్యాలనూ గుర్తించి వాటిపైనా చర్చించాలి. ఖర్చులపై పరిమితులు, భవిష్యత్ అవసరాలు.. అందుకున్న పొదుపు మార్గాలనూ చర్చలో భాగం చేయండి. అప్పుడే మీ ఆర్థిక దృక్పథం కాబోయే భాగస్వామికి స్పష్టంగా అర్థమవుతుంది. తద్వారా వైవాహిక భవిష్యత్‌కు భరోసా లభిస్తుంది.


ఆర్థిక లక్ష్యాలను నిర్దేశించుకోండి..

జంట ప్రయాణంలో కారు, ఇళ్లు కొనుగోలు దగ్గరి నుంచి పిల్లల చదువు, రిటైర్మెంట్ వరకు ముందే ప్లాన్ చేసుకోండి. స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను ముందుగానే గుర్తించడం ద్వారా ఆది నుంచే అందుకోసం పొదుపు ప్రారంభించవచ్చు.

**నీది.. నాది**

డబ్బు విషయంలో భార్యాభర్తల మధ్య నీది.. నాది అనే తేడాలు రాకుండా చూసుకోవాలి. ముఖ్యంగా ఇద్దరూ సంపాదించేవారైతే, ఒకరి డబ్బును మరొకరు వినియోగించుకోవడం, ఎవరి సంపాదన ఎందుకోసం ఖర్చు చేయాలనే విషయాల్లో పెళ్లికి ముందే స్పష్టమైన అంగీకారానికి రావడం మేలు. అలాగే, జాయింట్ అకౌంట్లు, బీమా పాలసీలు, పెట్టుబడి పథకాలు.. వాటికి నామినీలుగా ఎవరుండాలనే విషయాలపైనా ఇరువురూ ఓ అవగాహనకు వస్తే మరింత మంచిది. జీవితంలో ఎప్పుడేం జరుగుతోందో ఎవరూ చెప్పలేరు. అందుకే, ఆర్థిక తక్షణావసరాలను తీర్చుకునేందుకు వీలుగా అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలి. కనీసం 3 నుంచి 6 నెలల ఆర్థిక అవసరాలను తీర్చగలిగేలా ఈ నిధిని ఏర్పాటు చేసుకోవాలి. అలాగే, జీవిత, ఆరోగ్య బీమా కవరేజీని సమకూర్చుకోవడం కూడా కీలకం.

## మహిళలకు శుభవార్త.. భారీగా తగ్గిన బంగారం ధర



**న్యూఢిల్లీ-నవభూమి:**గత రెండు రోజులుగా బంగారం ధరలు పెరుగుతునే వచ్చాయి. పసిడి రేటు అమాంతంగా పెరగడంతో మహిళలు బంగారం కొనాలంటేనే భయపడేవారు. 85 వేల మార్క్‌కు పైగా ఉండటంతో బంగారం ప్రియులు అటువైపు దృష్టి సారించలేదు. వరుసగా బంగారం ధరలు ఎక్కువగా ఉండటంతో పసిడి మీద ఇన్వెస్ట్‌మెంట్స్ కాస్త తగ్గాయి. రేట్లు తగ్గినప్పుడు కొద్దామనే భావన చాలా మందిలో కనిపించింది. వారికి ఊరటను కల్పిస్తూ ఎట్టకేలకు బంగారం ధర దిగి వచ్చింది. ఒక్కరోజు గ్యాప్‌లోనే భారీగా తగ్గింది. సెంట్రల్ బ్యాంక్ కొనుగోళ్లు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, అంతర్జాతీయ డిమాండ్ కారణంగా బంగారం ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. ఈ రోజు పసిడి ధరలు ఎలా ఉన్నాయనేది ఇప్పుడు చూద్దాం..

**హైదరాబాద్‌లో బంగారం ధరలు..**

ఫిబ్రవరి15వ తేదీతో పోలిస్తే 16వ తేదీన బంగారం ధరల్లో మార్పు కనిపించింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. 22 క్యారెట్ల ఆభరణాల గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ. 100 మేర తగ్గింది. దీంతో తులం ధర రూ. 78 వేల 900 వద్దకు చేరింది. ఇక 24 క్యారెట్ల మేలిమి బంగారం ధర 10 గ్రాములపై రూ. 109 మేర తగ్గింది. దీంతో తులం రేటు రూ. 86,070 వద్దకు దిగివచ్చింది.


**స్థిరంగా వెండి ధర..**

హైదరాబాద్ మార్కెట్లో బంగారం ధరలు తగ్గినప్పటికీ వెండి రేటు స్థిరంగా ఉంది. అంతకు ముందు రోజు కిలో వెండి రూ. 1000 మేర పెరగడంతో రూ. 1,08,000 వద్దకు చేరింది. ఇవాళ ఆ రేటులో మార్పు లేదు.

హైదరాబాద్: ఇవాళ వెండి ధర గ్రాము రూ. 108, కిలో రూ. 1,08,000 .

**ఆర్థిక పరిస్థితులతో మార్పులు..**

ప్రస్తుత ఆర్థిక, భౌగోళిక పరిస్థితులు మారడంతోనే బంగారం ధరలో మార్పులు కనిపించినట్లు తెలుస్తోంది. అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ క్షీణించడము దీనికి కారణం. ట్రంప్ పరిపాలన, ఇటీవల సుంకాల ఫలితంగా కూడా బంగారం ధరలు అస్థిరంగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితిలో మార్పులు కనిపిండము మరో కారణం.



# 119 మంది అక్రమ వలసదారులతో అమృత్‌సర్‌కు మరో విమానం




**అమృత్‌సర్-నవభూమి:** అక్రమ వలసదారుల తరలింపులో భాగంగా అమెరికా నుంచి మరో విమానం అమృత్‌సర్ విమానాశ్రయంలో దిగింది. ఈ విమానంలో మొత్తం 119 మంది భారతీయులు ఉన్నారు. వీరిలో 67 మంది పంజాబ్‌కు చెందినవారున్నారు. హరియాణాకు చెందిన వారు 33 మంది, గుజరాత్ 8, యూపీ 3, గోవా, మహారాష్ట్ర, రాజస్థాన్‌ల నుంచి ఇద్దరేసి ఉన్నారు. హిమాచల్, జమ్మూకశ్మీర్ కు చెందిన ఒక్కొక్కరున్నారు.
మరోవైపు తమ రాష్ట్రంలో విమానాలు దిగడాన్ని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ వ్యతిరేకించారు. పంజాబీలు మాత్రమే అక్రమంగా వలస వెళ్తారని చెప్పడానికా అని ఆయన ప్రశ్నించారు. అయితే ఇలాంటి సున్నితమైన విషయాల నుంచి రాజకీయ ప్రయోజనం పొందాలని చూడటం సరికాదని బీజేపీ విమర్శించింది.



## కుంభమేళాకు అర్థమే లేదు..
## లాలూ వివాదాస్పద వ్యాఖ్యలు



**పాట్నా-నవభూమి:** మహాకుంభమేళా పై ఆర్జేడీ చీఫ్, కేంద్ర మాజీ రైల్వే శాఖ మంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కుంభమేళాకు అర్థమే లేదని అని వ్యాఖ్యానించారు. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 18 మంది మరణించిన ఘటనకు రైల్వే తప్పిదమే కారణమని, దీనికి బాధ్యత వహించి రైల్వే మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.
'తొక్కిసలాట ఘటన చాలా కలవరపాటు కలిగిస్తోంది. కేంద్ర ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయలేదనే విషయాన్ని ఆ ఘటన బహిర్గతం చేస్తోంది. దీనికి బాధ్యత వహించిన రైల్వే మంత్రి రాజీనామా చేయాలి. ఇది పూర్తిగా రైల్వేల వైఫల్యం" అని లాలూ వ్యాఖ్యానించారు. ప్రయాగ్‌రాజ్ మహాకుంభ్‌కు లెక్కకు మిక్కిలిగా ప్రజలు తరలివస్తుండటంపై అడిగినప్పుడు "కుంభ్‌కు అర్థమే లేదు, ఇది పనికిరానిది" అని సమాధానమిచ్చారు.

**లాలూ వ్యాఖ్యలపై బీజేపీ ఆక్షేపణ**

కుంభమేళాకు అర్థమే లేదంటూ లాలూ ప్రసాద్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. హిందూ మతం పట్ల ఆర్జేడీ ఆలోచనా విధానానికి లాలూ వ్యాఖ్యలే నిదర్శనమని బీజేపీ బీహార్ విభాగం ప్రతినిధి మనోజ్ శర్మ అన్నారు. బుజ్జగింపు రాజకీయాల వల్లే లాలూ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, ఆర్జేడీ నేతలు హిందువుల మనోభావాలను అవమానించడం పరిపాటిగా మారిందని విమర్శించారు. కుంభమేళాకు వెళ్లే ప్రయాణికులతో శనివారం రాత్రి న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగి 18 మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. మృతులలో 11 మంది మహిళలు, నలుగురు చిన్నారులు కూడా ఉన్నారు. 14,15 ప్లాట్‌ఫాంలపై ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై ప్రధానమంత్రి మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన కుటుంబాలకు రైల్వే శాఖ రూ.10 లక్షల పరిహారం ప్రకటించింది. తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.1 లక్ష పరిహారం ఇస్తున్నట్టు ప్రకటించింది.

## 'శీష్ మహల్'పై విచారణకు కేంద్రం ఆదేశం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్‌పై కేంద్ర ప్రభుత్వం గురి పెట్టింది. కేజ్రీవాల్ హయాంలో ఢిల్లీలోని 6 ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డులో ఉన్న సీఎం అధికారిక నివాసాన్ని పునరుద్ధరించే పనులు చేపట్టిన విషయం తెలిసిందే. అయితే.. ఈ క్రమంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, శీష్ మహల్(అద్దాల మేడ)ను నిర్మించుకున్నారని బీజేపీ నాయకులు విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సదరు భవనం పునర్నిర్మాణంపై ప్రాథమిక పరిశీలన చేసిన సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ ఈ నెల 13న కేంద్రానికి నివేదిక ఇచ్చింది. భవన నిర్మాణ విషయంలో నిబంధనలను ఉల్లంఘించారని పేర్కొంది. ఈ క్రమంలో పూర్తిస్థాయి విచారణ కు కేంద్రం ఆదేశించింది.

## ఛత్తీస్‌గఢ్ 'స్థానిక' ఎన్నికల్లో బీజేపీ హవా



**న్యూఢిల్లీ-నవభూమి:** ఛత్తీస్‌గఢ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ హవా కొనసాగింది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో జయకేతనం ఎగరవేసిన కాషాయ పార్టీ తాజాగా 10 మున్సిపల్ కార్పొరేషన్లను సునాయాసంగా కైవసం చేసుకుంది. 10 మున్సిపల్ కార్పొరేషన్లు, 49 మున్సిపల్ కౌన్సిల్, 114 నగర పంచాయతీలతో సహా 173 పట్టణ, స్థానిక సంస్థలకు ఫిబ్రవరి 11న పోలింగ్ నిర్వహించగా... శనివారం ఓట్ల లెక్కింపు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ మీడియాతో మాట్లాడుతూ... ఈ విజయం రాష్ట్ర బీజేపీ చరిత్రలో మరిచిపోలేని రోజుగా అభివర్ణించారు. కాగా, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ 8 మున్సిపల్ కౌన్సిల్, 22 నగర పంచాయతీలను గెలుచుకుంది.

## జస్టిస్ గవాయ్ 'పరాన్నజీవుల' వ్యాఖ్య నిరుపేదలపై కాఠిన్యానికి నిదర్శనం

**న్యూఢిల్లీ-నవభూమి:** "ఉచిత' పథకాల ద్వారా ఒక పరాన్నజీవుల వర్గాన్ని సృష్టించట్లేదూ' అని ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ చేసిన వ్యాఖ్యలను 300 మందికి పైగా సామాజిక కార్యకర్తలు, న్యాయవాదులు, పాత్రికేయులు ఒక బహిరంగ లేఖలో ఖండించారు. ఢిల్లీలో ఇళ్లులేని వారికి ఆశ్రయం కల్పించాలంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం విచారణ సందర్భంగా జస్టిస్ గవాయ్ చేసిన ఈ వ్యాఖ్యలు పేదల పట్ల న్యాయ వ్యవస్థలో ఉన్న వ్యతిరేకతను ప్రతిఫలిస్తున్నాయని ఆ లేఖ విమర్శించింది. 'ఇళ్లు లేని వారంటే పట్టణ పేదల్లో అతిపేదలు. భవన నిర్మాణ కూలీలుగా, పారిశుధ్య కార్మికులుగా, బరువులు మోయడం వంటి కష్టమైన పనులు చేసుకుని జీవిస్తుంటారు. అలాంటి వారిని పరాన్నజీవులుగా వ్యాఖ్యానించడం కాఠిన్యతకు నిదర్శనమ'ని పేర్కొంది. అత్యంత బలహీన వర్గాలపై నిందలు వేయడం, వారిని వెక్కిరించడం తగదని సూచించింది.

# ఫిరోజ్ గాంధీ ముస్లిం కాదు పార్సీ.. హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు






**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో కులగణన సర్వే తర్వాత రాష్ట్రంలో బీసీలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని తేలిన సంగతి తెలిసిందే. అయితే కులగణనలో బీసీల సంఖ్యను తగ్గించి చూపారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆరోపించారు. కులగణన ద్వారా బీసీలకు కాంగ్రెస్ అన్యాయం చేస్తోందని కేంద్ర మంత్రి, బీజేపీ నేత కిషన్ రెడ్డి విమర్శించారు. ఆ తర్వాత తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఏకంగా ప్రధాని మోదీ పుట్టుకతో బీసీ కాదని.. తర్వాత ఆయన కులాన్ని బీసీల్లో చేర్చారని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే రాహుల్ గాంధీ కులమేంటని బీజేపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్నలో భాగంగా ఫిరోజ్ గాంధీ ముస్లిం అని చెబుతున్నారు.
క్లెయిమ్ ఏమిటి?..జవహర్ లాల్ నెహ్రూ నుంచి రాహుల్ గాంధీ వరకు ఉన్న ఫ్యామిలీ ట్రీని రాసిన బోర్డును పట్టుకొని 'దీన్ని బట్టి రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీది ఏ కులం??' అని ప్రశ్నిస్తూ.. బీజేపీ జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ఎక్స్‌లో ఫిబ్రవరి 15న ఓ పోస్టు చేశారు. ఇందులో ఇందిరా గాంధీ భర్త పేరును ఫిరోజ్ ఖాన్‌గా శ్రీవాణి పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ భార్య సోనియాను మోనియాగా పేర్కొన్నారు.
ఫిరోజ్ గాంధీని.. ఫిరోజ్ ఖాన్ గాంధీ అని.. ఆయన ముస్లిం అని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడిన వీడియో కూడా సోషల్ మీడియాలో కనిపించింది.
వాస్తవమేంటి..?..భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ భర్త ఫిరోజ్ గాంధీ. సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నట్లు ఈయన ముస్లిమా..? కాదా? అని తేల్చడం కోసం సజగ్ టీమ్ దర్యాప్తు ప్రారంభించింది. ఈ క్రమంలో గతంలోనూ ఫిరోజ్ గాంధీ మతం గురించి సోషల్ మీడియాలో ప్రచారం జరిగినట్లు గుర్తించింది.
వికీపీడియాలో అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఇందిరా గాంధీ భర్త పూర్తి పేరు ఫిరోజ్ జహంగీర్ ఫరేదూన్ ఘాండీ. ఆయన ముంబైలోని పార్సీ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి పేరు జహంగీర్ కాగా, తల్లి పేరు రతిమాయి. పార్సీలు ఇరాన్‌ను భారతదేశానికి వలస వచ్చారు. ఫిరోజ్ తండ్రి జహంగీర్ ఘాండీ మెరైన్ ఇంజినీర్‌గా పని చేసేవారు. ఫిరోజ్ చిన్న వయసులోనే ఆయన తండ్రి చనిపోయారు. దీంతో అలహాబాద్‌లోని లేడీ డఫెరిన్ హాస్పిటల్‌లో సర్జన్‌గా పని చేస్తున్న తన ఆంటీ షిరిన్ దగ్గరకు వెళ్లాల్సి వచ్చింది.
అలహాబాద్‌లోని ఇవింగ్ క్రిస్టియన్ కాలేజీలో చేరిన ఫిరోజ్.. స్వాతంత్ర్య పోరాటంలో భాగం కావడంతోపాటు నెహ్రూ కుటుంబంతో సాన్నిహిత్యం ఏర్పడింది. ఓ రోజు ఇవింగ్ క్రిస్టియన్ కాలేజీ బయట నెహ్రూ సతీమణి కమలా నెహ్రూ సత్యాగ్రాహంలో పాల్గొన్నారు. ఆమె అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై కింద పడిపోవడాన్ని గమనించిన ఫిరోజ్.. వెంటనే ఆమెకు సాయం చేశారు. అప్పటి నుంచి ఫిరోజ్ తరచుగా నెహ్రూ నివాసమైన 'ఆనంద్ భవన్'కు వెళ్తుండేవారు. ఆ రోజుల్లో ఆనంద్ భవన్ స్వాతంత్ర్య పోరాట యోధులకు కేంద్రంగా ఉండేది. మహాత్మా గాంధీ పట్ల గౌరవాభిమానాలతో ఫిరోజ్ తన ఇంటిపేరును గాంధీగా మార్చుకున్నారు. ఈ విషయమై జనసత్తా అనే హిందీ న్యూస్ వెబ్‌సైట్లో ప్రచురితమైన కథనాన్ని మీరు ఇక్కడ చూడొచ్చు. ఫిరోజ్ గాంధీని పెళ్లాడిన తర్వాత ఇందిర సైతం ఇందిరా గాంధీగా మారారు.
ఫిరోజ్ గాంధీ 48 ఏళ్ల వయసులోనే గుండెపోటుతో మరణించారు. ఫిరోజ్‌కు తొలిసారి హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు తన అంతిమ సంస్కారాలను పార్సీ సంప్రదాయం ప్రకారం చేయొద్దని ఆయన తన స్నేహితులతో చెప్పారు.
పార్సీలు చనిపోతే పార్థివ దేహాన్ని దహనం చేయడం లేదా పూడ్చిపెట్టడం లాంటివి చేయరు. దానికి బదులుగా టవర్ ఆఫ్ సైలెన్స్ కింద గద్దలు, రాబందులు, కాకుల్లాంటి పక్షులకు ఆహారంగా ఉంచుతారు. ఫిరోజ్ పార్సీ సంప్రదాయం ప్రకారం అంతిమ సంస్కారాలు వద్దని చెప్పడంతో.. 1960 సెప్టెంబర్ 8న ఆయన చనిపోగా.. మరుసటి రోజు హిందూ సంప్రదాయం ప్రకారం ఆయన అంతిమ సంస్కారాలు నిర్వహించారు. అయితే అంత్యక్రియలకు ముందు పార్సీ సంప్రదాయం ప్రకారం కొన్ని కార్యక్రమాలు జరిగేలా ఇందిరా గాంధీ చూసుకున్నారు.
ఫిరోజ్ గాంధీ చితాభస్మాన్ని మూడు భాగాలుగా విభజించి.. ఒక భాగాన్ని నెహ్రూ సమక్షంలో అలహాబాద్ సంగంలో (త్రివేణి సంగమంలో) కలపగా.. మరో భాగాన్ని ఆయన ఎక్కువ కాలం ఉన్న అలహాబాద్‌లోనే ఉంచారు. మూడో భాగాన్ని సూరత్‌లోని ఫిరోజ్ గాంధీ పూర్వీకుల శ్మశాన వాటికలో ఉంచారు. ఫిరోజ్ గాంధీ ముస్లిం అని అర్థం వచ్చేలా.. ఆయన పేరు ఫిరోజ్ ఖాన్ అని రాయడం సరైంది కాదు. ఫిరోజ్ ఖాన్ పార్సీ మతస్థుడు. ఆయనకు ఇస్లాంతో సంబంధం లేదు.

# తొక్కిసలాట ఘటనపై దర్యాప్తునకు రైల్వే శాఖ ద్విసభ్య కమిటీ



**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగి 18 మంది ప్రయాణికులు మృతి చెందిన ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తు మొదలైంది. ఘటనపై దర్యాప్తు జరిపేందుకు ద్విసభ్య కమిటీని రైల్వే శాఖ ఏర్పాటు చేసింది. నార్తరన్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ నర్సింగ్ డియో, ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ కమిషనర్ పంకజ్ గాంగ్వార్‌లతో ఈ కమిటీ ఏర్పాటు చేసినట్టు రైల్వే శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఘటనపై ఈ కమిటీ అత్యున్నత స్థాయి విచారణ జరుపుతుందని పేర్కొంది. దర్యాప్తులో భాగంగా రైల్వేస్టేషన్‌లోని వీడియా ఫుటేజ్‌లన్నీ భద్రం చేయాలని కమిటీ ఆదేశాలిచ్చింది. ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో పాల్గొనేందుకు న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌కు భారీ సంఖ్యలో ప్రయాణికులు చేరుకోవడంతో శనివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాటలో 18 మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. మృతులలో 11 మంది మహిళలు, నలుగురు చిన్నారులు ఉన్నారు. వీరిలో ఆహా దేవి (79), పింకీ దేవి (41), షీలా దేవి (50), వ్యోమ్ (25), పూనమ్ దేవి (40), లలితా దేవి (35), సురుచి (11), కృష్ణాదేవి (40), విజయ్ సహ్ (15), నీరజ్ (12), శాంతిదేవి (40) పూజ కుమార్ (8), సంగీత మాలిక్ (34), పునమ్ (34), మమతా ఝా (40), రియా సింగ్ (7), బేబీ కుమారి (24), మనోజ్ (47) ఉన్నారు. కాగా, మృతుల కుటుంబాలకు రైల్వే శాఖ రూ.10 లక్షలు పరిహారం ప్రకటించింది. తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.1 లక్ష పరిహారం ఇవ్వనున్నట్టు ప్రకటించింది. క్షతగాత్రులు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

**పరిస్థితి అదుపులో ఉంది..**

తొక్కిసలాట ఘటనపై విచారణకు ఇద్దరు సభ్యులతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని రైల్వే బోర్డు ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిసిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు. ప్రయాణికులందరిని ప్రత్యేక రైళ్లలో పంపామని, రైళ్ల రాకపోకలు యథాప్రకారం కొనసాగుతున్నాయని చెప్పారు.

## గొంతు కోసినా.. మేకులా బతికింది



**భోపాల్-నవభూమి:** ఆడపిల్ల ఇంటికి భారమని పురుట్లోనే చంపేసే ఎన్నో ఘటనలు చూశాం. మధ్యప్రదేశ్‌లోని రాయ్‌గడ్‌కు చెందిన ఓ తల్లి తన నెల వయస్సున్న పసిపాప గొంతుకోసింది. రక్తం ధారగా కారుతున్న పసిగుడ్డును ఆ తర్వాత చెత్త కుండీలో పడేసింది. ఈ పాపంలో ఆ కఠినాత్మురాలి తల్లి కూడా పాలుపంచుకొంది. జనవరి 11న రక్తం మడుగులో ఉన్న ఆ పాపను చూసిన కొందరు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆమెను 100 కి.మీ.దూరంలోని భోపాల్‌లో ఉన్న కమలా నెహ్రూ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆ సమయానికి ఆమె గొంతు నుంచి రక్తం కారుతూనే ఉంది. ఆమెకు చుట్టిన బట్ట కూడా రక్తంతో తడిచి ఎర్రగా మారింది. సత్వర వైద్యం అందించిన వైద్యులు పలు ఆపరేషన్లు చేశారు. తెగిన శిరలు, ధమనులు, నరాలు, ఇతర భాగాలను తిరిగి అతికించి కాపాడారు. ప్రభుత్వం నిర్వహించే శరణాలయానికి అప్పగించారు. సీసీటీవీ కెమేరాల ఆధారంగా దర్యాప్తు జరిపిన పోలీసులు పసిపాప తల్లి, అమ్మమ్మలను గుర్తించి అరెస్టు చేశారు. కాగా, బాలికకు శరణాలయంలోనే 'పిహు' అని నామకరణం చేశారు.

## అపహరణ.. అత్యాచారం.. అమ్మకం!

**ఆగ్రా-నవభూమి:** ఆ బాలిక వయస్సు 17 ఏళ్లు. ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. రాజస్థాన్‌లోని మెయిన్‌పురి వాళ్ల స్వగ్రామం. గతేడాది మే 18న ఎప్పటిలాగే ఆమె ట్యూషన్ కోసం ఇంటి నుంచి బయల్దేరింది. మళ్లీ రాలేదు. వాళ్ల ఊరి పక్కన ఉండే ఓ వ్యక్తి ఆ బాలికను కిడ్నాప్ చేశాడు. ఇటావాకు తీసుకువెళ్లి డ్రగ్స్ ఇచ్చి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత, బాలికను ఆగ్రాలోని రవి, బాబీ అనే వాళ్లకు అమ్మేశాడు. వాళ్లిద్దరూ బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తరువాత ఆమెను అజ్మేర్ తీసుకువెళ్లి.. అక్కడ ఆశా జైన్ అనే మహిళకు అమ్మేశారు. ఆశా జైన్ సదరు బాలికను అజ్మేర్‌కే చెందిన విష్ణు మాలీ అనే వ్యక్తికి రూ.3.5లక్షలకు అమ్మేసింది. విష్ణు మాలీకి టీనేజ్ అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని కోరిక. ఎక్కడా సంబంధం సెట్ కాలేదు. అందుకే, అతడు ఆశా జైన్ దగ్గర బాలికను కొనుక్కొని పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. అదే బాలికకు అదృష్టమైంది. టీనేజ్ అమ్మాయితో పెళ్లిపై ఎంతో మక్కువగా ఉన్న విష్ణు.. తన పెళ్లి ఫొటోలను సోషల్ మీడియాలో విరివిగా పోస్టు చేశాడు. ఆ పోస్టులు మెయిన్‌పురి వాళ్ల కంటపడ్డాయి. అప్పటికే, బాలిక అదృశ్యంపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు వెంటనే అజ్మేర్ వెళ్లి విష్ణు మాలీని, కిడ్నాపర్ నీరజ్‌ను అరెస్టు చేశారు.

# ఈ తప్పు మరో చోట జరగకూడదు..
# ఢిల్లీ తొక్కిసలాట తర్వాత ఆ పని చేస్తున్న రైల్వే శాఖ..




**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో ఎంతమంది తమ అయినవారిని కోల్పోయారో తెలియదు. ప్రస్తుతం, తొక్కిసలాట ఎలా జరిగింది. ఏ నిర్లక్ష్యం వల్ల ఈ దుర్ఘటన జరిగిందనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తొక్కిసలాటలో ఉన్న వారిలో 90 శాతం మంది మహా కుంభమేళా కోసం ఢిల్లీ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు వెళ్తున్న వారే. ఇప్పటికే మహాకుంభమేళా చుట్టుపట్ల వేలాది వాహనాలు నిలిచిపోయాయి. 15 నిమిషాలు వెళ్లాల్సిన దూరానికి కూడా దాదాపు 3 గంటలు పడుతోంది. ఇంత ట్రాఫిక్ ఉన్నప్పటికీ భక్తుల రద్దీ పెరుగుతుందే తప్ప తగ్గటం లేదు. త్రివేణి సంగమంలో భక్త సంద్రాన్ని నియంత్రించేందుకు యూపీ ప్రభుత్వం ఒక పక్క చర్యలు తీసుకుంటుంటే, మరో పక్క రైల్వే శాఖ కూడా అప్రమత్తమైంది. గత నెల జనవరి 13న ప్రారంభమైంది మహాకుంభమేళాలో ఇప్పటివరకూ 50 కోట్లకు పైగా భక్తులు పుణ్యస్నాలు చేశారు. ఫిబ్రవరి 26 చివరిరోజు కావడంతో ప్రయాగ్‌రాజ్‌కు జనప్రవాహం ఆగటం లేదు. వేలాది వాహనాలు త్రివేణి సంగమం వైపు కదలుతున్నాయి. దీంతో ప్రయాగ్‌రాజ్ పొరుగు నగరాల్లోనూ భారీ ట్రాఫిక్ నెలకొంది. ప్రయాగ్‌రాజ్ సరిహద్దులో ఉన్న మధ్యప్రదేశ్‌లోని రేవాలో కూడా వాహనాల సంఖ్య గత 24 గంటల్లో విపరీతంగా పెరిగింది. ఢిల్లీ రైల్వేస్టేషన్లో తొక్కిసలాట ఘటనలో శనివారం 18 మంది చనిపోవడంతో ట్రాఫిక్ మరింత పెరిగింది. దీంతో ఉత్తరప్రదేశ్, బీహార్‌లోని వివిధ రైల్వే స్టేషన్లలో అలర్ట్ ప్రకటించారు. సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత, యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ మహా కుంభమేళా వ్యవధిని పొడిగించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరారు. గత సంవత్సరాల్లో మహా కుంభమేళా 75 రోజులు కొనసాగిందని, ప్రస్తుత షెడ్యూల్ తక్కువగా ఉందని ఆయన పేర్కొన్నారు. రోడ్లపై అధిక సంఖ్యలో భక్తులు ఉన్నారని వారందరికీ పుణ్యస్నానాలు స్నానాలు చేసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

# పద్ధతి మార్చుకోని యూఎస్.. కాళ్లకు, చేతులకు బేడీలు



**పంజాబ్-నవభూమి:** తమ దేశంలోని అక్రమ వలసదారులను స్వదేశాలకు పంపే క్రమంలో అమెరికా తన పద్ధతిని ఏ మాత్రం మార్చుకోవడం లేదు. శనివారం రాత్రి అంటే.. ఫిబ్రవరి 15వ తేదీ రాత్రి మరో విమానం యూఎస్ నుంచి భారత్‌లోని అమృత్ సర్ చేరుకుంది. యూఎస్ మిలటరీకి చెందిన విమానంలో 116 మంది అక్రమ వలసదారులను స్వదేశానికి పంపింది. వారందరి కాళ్లకు చైనుతోపాటు చేతులకు బేడీలు వేసి పంపింది. అయితే ఈ ప్రయాణం సాగినంత సేపు.. తమను ఇలా బందీల్లా తీసుకు వచ్చారని పంజాబ్, హెూషియార్‌పూర్ జిల్లాలోని కుర్లా కలాన్ గ్రామానికి చెందిన దల్జీత్ సింగ్.. వాపోయారు. దాదాపు అర గంట ఆలస్యంగా.. అంటే శనివారం అర్ధరాత్రి 11.35 గంటలకు సీ 17 మిలటరీ ఎయిర్ క్రాఫ్ట్ అమృత్‌సర్ విమానాశ్రయం చేరుకుందని తెలిపారు. తన గ్రామానికిగా చెందిన వ్యక్తి ట్రావెల్ ఏజెంట్‌కు పరిచయం చేశాడని.. అతడి ద్వారా తాను అక్రమ మార్గంలో యూఎస్ చేరుకున్నానని వివరించారు. తన భర్తను ట్రావెల్ ఏజెన్సీ మోసగించిందంటూ దల్జీత్ సింగ్ భార్య ఆవేదన వ్యక్తం చేశారు. ఇక 116 మందిలో 65 మంది పంజాబ్, 33 మంది హర్యానా, 8 మంది గుజరాత్‌తోపాటు ఉత్తరప్రదేశ్, గోవా, మహారాష్ట్ర, రాజస్థాన్‌కు చెందిన వారు ఇద్దరిద్దరు ఉన్నారని ఉన్నతాధికారులు చెప్పారు. వీరిలో అత్యధికులు 18 నుంచి 30 ఏళ్ల మధ్య వారేనని వివరించారు. మరోవైపు యూఎస్ నుంచి అమృత్‌సర్ చేరుకున్న ఈ అక్రమ వలసదారులను స్వస్థలాలకు చేర్చేందుకు పంజాబ్, హర్యానా ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. ఇక మరో విమానం ఆదివారం యూఎస్ నుంచి అమృత్‌సర్ చేరుకొంటుందని తెలుస్తోంది. అయితే ఈ విమానం ఎప్పుడు.. చేరుకుంటుందనే అంశంపై స్పష్టమైన సమాచారం మాత్రం లేదని ఉన్నతాధికారులు వివరించారు. ఇంకోవైపు ఫిబ్రవరి 5వ తేదీన యూఎస్ నుంచి 104 మంది అక్రమ వలసదారులను తీసుకుని ఓ యుద్ధ విమానం అమృత్‌సర్ చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ విమానంలో సైతం వారి చేతులకు బేడీలు వేసి తీసుకు వచ్చారు. ఈ వ్యవహారంపై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పార్లమెంట్ సాక్షిగా విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ స్పష్టం చేశారు. అలాగే ప్రధాని మోదీ సైతం ప్రస్తుతం యూఎస్‌లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. అలాంటి వేళ.. ఇలాంటి ఘటనలు పునరావృతం కావడంపై కేంద్రంపై రాజకీయ పార్టీలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి.

## ఒక్క చుక్క రక్తంతో క్లోమ క్యాన్సర్ నిర్ధారణ




**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రాణాంతకమైన క్లోమ క్యాన్సర్‌ను కేవలం ఒక చుక్క రక్తంతో, అతి తక్కువ ఖర్చుతో గుర్తించే పరీక్ష త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఈ దిశగా ఒరెగాన్ హెల్త్ అండ్ సైన్స్ యూనివర్సిటీ (ఓహెచ్‌ఎసయూ) పరిశోధకులు పీఏసీ-ఎంఏఎన్‌ఎన్(ప్యాక్‌మాన్) అనే రక్తపరీక్షను అభివృద్ధి చేశారు. పరిశోధనల్లో భాగంగా ప్యాంక్రియాటిక్ డక్టల్ అడోనోకార్సినోమా (పీడీఏసీ) రోగుల్లో మరింత చురుగ్గా ఉండే నిర్దిష్ట ప్రొటీన్లు, ప్రధానంగా ప్రొటీజెస్ కోసం 350మంది రక్త నమూనాలను పరిశీలించారు. పీడీఏసీ అనేది క్లోమ క్యాన్సర్‌లో అత్యంత ప్రాణాంతకమైన రకం. ఇది సంధానకణజాలాన్ని బలహీనపర్చడం ద్వారా కేన్సర్ కణితులు పెరగడానికి దోహదం చేస్తుంది. ఈ ప్రొటీన్లను గుర్తించడం ద్వారా క్లోమ క్యాన్సర్‌ను 98శాతం కచ్చితత్వంతో నిర్ధారించగల పరీక్షను రూపొందించారు. ఈ అధ్యయనం వివరాలు సైన్స్ ట్రాన్స్‌లేషనల్ మెడిసిన్ జర్నల్‌లో తాజాగా ప్రచురితమయ్యాయి. కేవలం ఒక్క చుక్క రక్తాన్ని పరీక్షించడం ద్వారా 45 నిమిషాల్లోనే ఫలితం వెలువడే ఈ పరీక్షకు రూపాయి కంటే తక్కువ ఖర్చవుతుందని పరిశోధకులు పేర్కొంటున్నారు. శరీరంపై కోత పెట్టాల్సిన అవసరం లేకుండా అతి తక్కువ సమయంలో క్యాన్సర్‌ను గుర్తించే ఈ పరీక్ష.. వ్యాధి నిర్ధారణలో మేలిమలుపు కాగలదని, క్యాన్సర్ మరణాల నివారణకు తోడ్పడుతుందని భావిస్తున్నారు. కాగా, క్లోమ క్యాన్సర్ సోకిన తర్వాత బతికి బయటపడిన వారు చాలా తక్కువ. ప్రతి నలుగురిలో ఒక్కరే ఏడాది అంతకంటే ఎక్కువ కాలం జీవిస్తారని అంచనా. వ్యాధిని త్వరగా గుర్తించలేకపోవడమే దీనికి ప్రధాన కారణం. 2024లో క్లోమ క్యాన్సర్ బారిన పడి 50వేల మందికి పైగా మరణించారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
8 | హైదరాబాద్ సోమవారం 17 । ఫిబ్రవరి । 2025

# పవన్ కళ్యాణ్‌ను కలిసిన రాజేంద్ర ప్రసాద్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను ప్రముఖ నటుడు రాజేంద్ర ప్రసాద్ ఆదివారం మధ్యాహ్నం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలు చర్చించుకొన్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం పవన్‌కల్యాణ్‌ను ఆయన సన్మానించారు. రాజేంద్ర ప్రసాద్‌ను పవన్ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. ఈ ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అయ్యాయి. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఈ భేటీ జరిగింది.



నవచిత్ర



# గుబులు రేపుతున్న రుహానీ ఫోజ్



రుహానీ శర్మ పరిచయం అవసరం లేదు. చిలసౌ చిత్రంలో సుశాంత్ సరసన నాయికగా నటించింది. మొదటి సినిమాతోనే ఈ బ్యూటీ తనదైన నట ప్రతిభతో ఆకట్టుకుంది. ఆ తర్వాత 'డర్టీ హరి' లాంటి బోల్డ్ మూవీలో అద్భుత పెర్ఫామెన్స్ తో ఆకట్టుకుంది. హిట్ – ది ఫస్ట్ కేస్ చిత్రంలో మరోసారి ఫ్యాన్స్ ని ఆకట్టుకుంది. తెలుగు–తమిళంలో వరుసగా అవకాశాలు అందుకుంది. నేచురల్ బ్యూటీ రుహానీ సోషల్ మీడియాల్లోను భారీ ఫాలోయింగ్ ని ఆస్వాధిస్తోంది. ఈ హిమచల్ బ్యూటీ నిరంతర ఫోటోషూట్లతో అగ్గి రాజేస్తోంది. రుహానీ తాజా ఫోటోషూట్ ఇంటర్నెట్ లో గుబులు రేపుతోంది. ఈ భామ బ్లేజర్ లో మరోసారి తనలోని బోల్డ్ యాంగిల్ ని బయటపెట్టింది. భారీతనం నిండిన బ్లేజర్ ధరించిన రుహానీ థై సొగసుల్ని ఎలివేట్ చేసింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా షేర్ అవుతోంది. రుహానీ ఈ గెటప్‌లో స్టన్నింగ్ అంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు. "వెలుగు నీడల మధ్య కొట్టుకుపోవడం, ఆలోచనలు కవిత్వంగా మారడం..." అంటూ ఈ ఫోటోషూట్ కి రుహానీ పోయెటిక్ క్యాప్షన్ ఇచ్చింది. కరీర్ మ్యాటర్ కి వస్తే... రుహాని తదుపరి మీట్ క్యూట్ అనే సిరీస్ లో నటించింది. అలాగే యోడ్లీ ఫిల్మ్స్ నిర్మిస్తున్న 'ఆగ్రా' అనే చిత్రంతో బాలీవుడ్ లోకి అడుగుపెడుతోంది. ఈ సినిమాలో బోల్డ్ పెర్ఫామెన్స్ కి సంబంధించిన క్లిప్స్ ఇటీవల లీకయ్యాయి. దీనిపై చాలా మంది షాక్ కి గురవ్వడమే గాక ఈ సిరీస్ వివాదాల గురించి చర్చించుకున్నారు. ముఖ్యంగా సాఫ్ట్ గా కనిపించే రుహానీ ఇలాంటి బోల్డ్ సీన్స్ లో నటించడం చర్చకు వచ్చింది. రుహానీ ఇటీవల టాలీవుడ్‌కి దూరమైంది. ఇక్కడ సినిమాలేవీ ప్రకటించలేదు.

# ఎన్టీఆరే బెస్ట్ ఫెర్ఫార్మర్ అనేసిన హీరోయిన్..!



తెలుగు మూలాలున్నా సరే తమిళ నటిగా గుర్తింపు తెచ్చుకుని అక్కడ ఒక మోస్తారు పాపులారిటీ తెచ్చుకున్న బ్యూటీ ఐశ్వర్య రాజేష్ అమ్మడు తెలుగులో కూడా వరుస సినిమాలు చేయాలనే ఆలోచన ఉన్నా ఐదేళ్ల క్రితమే ఇక్కడ ఒకటి రెండు సినిమాలు చేసినా అవి ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు అందుకే కాస్త వెనకపడ్డది. ఐతే ఈ సంక్రాంతికి సంక్రాంతికి వస్తున్నాంతో సూపర్ హిట్ అందుకుని మళ్లీ వార్తల్లో నిలిచింది ఐశ్వర్య రాజేష్. హోమ్లీ లుక్‌తో తనదైన పాత్రల్లో మెప్పిస్తూ వస్తున్న ఐశ్వర్య సంక్రాంతికి వస్తున్నాం హిట్‌తో టాలీవుడ్‌లో కూడా సక్సెస్ సాధించింది. ఐతే ఈ హిట్‌తో మరిన్ని అవకాశాలు రాబట్టాలని చూస్తుంది అమ్మడు. సంక్రాంతికి వస్తున్నాం హిట్‌తో కెరీర్‌లో జోష్ కనబరుస్తుంది. ఇక హిట్ జోష్‌లో వరుస ఇంటర్వ్యూస్ చేస్తున్న ఐశ్వర్య రాజేష్ రీసెంట్ ఇంటర్వ్యూలో తెలుగులో బెస్ట్ పెర్ఫార్మర్ ఎవరన్న ప్రశ్నకు ఇంట్రెస్టింగ్ ఆన్సర్ ఇచ్చింది. తన దృష్టిలో బెస్ట్ పెర్ఫార్మర్ ఎన్టీఆర్ అని అన్నది. జూనియర్ ఎన్టీఆర్ అభిమానిని నేను. ఎన్టీఆర్ డైలాగ్ డెలివరీ, డ్యాన్సుల్లో స్పెషాలిటీ ఉంటుందని అన్నది ఐశ్వర్య రాజేష్. అందరి ప్రదర్శన ఇష్టమే కానీ ఎన్టీఆర్ నా ఫేవరెట్ అని చెప్పింది అమ్మడు. ఎన్టీఆర్ నటన గురించి ఇప్పటికే చాలామంది భామలు చెప్పారు. ఇప్పుడు ఆ లిస్ట్‌లో ఐశ్వర్య కూడా చేరింది. ప్రస్తుతం తారక్‌పై ఐశ్వర్య రాజేష్ చేసిన కామెంట్స్‌ని ఎన్టీఆర్ ఫ్యాన్స్ వైరల్ చేస్తున్నారు. ఇక ఐశ్వర్య కెరీర్ విషయానికి వస్తే సంక్రాంతికి వస్తున్నాంతో తెలుగులో తొలి సక్సెస్ అందుకుంది అమ్మడు. ఇలా హోంలీ రోల్స్‌తో తెలుగులో కూడా తన సత్తా చాటాలని చూస్తుంది ఐశ్వర్య. సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో మీనాక్షి చౌదరి కన్నా వెంకటేష్ భార్యగా నటించిన ఐశ్వర్య రాజేష్ కే ఎక్కువ మార్కులు పడ్డాయని చెప్పొచ్చు. ఎన్టీఆర్ తన ఫేవరెట్ అని చెప్పింది కాబట్టి ఈ కామెంట్స్ విన్న ఏ డైరెక్టర్ అయినా తారక్ సినిమాలో ఛాన్స్ ఉంటే మాత్రం ఐశ్వర్య రాజేష్ ని తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పొచ్చు.

# అమీర్ కొడుకు తేలిపోయాడు.. సైఫ్ కొడుకు నిరూపిస్తాడా?

సైఫ్ అలీ ఖాన్ –అమృతా సింగ్ కుమారుడు ఇబ్రహీం అలీ ఖాన్ నాదానియన్ చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నాడు. ఈ రొమాంటిక్ కామెడీలో ఖుషీ కపూర్ కథానాయిక. తొలుత ఈ చిత్రం అధికారికంగా నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుందని ప్రకటించారు. కానీ విడుదల తేదీని వెల్లడించలేదు. ఇప్పుడు ఈ చిత్రం ఫిబ్రవరిలోనే విడుదల కానుందని తెలుస్తోంది. తాజాగా నెట్‌ఫ్లిక్స్ ఇండియా అధికారిక ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ విషయాన్ని ధృవీకరించింది. నెక్ట్స్ రాబోయే చిత్రం నాదానియాన్ ఫిబ్రవరి 2025లోనే.. అని వెల్లడించింది. ఇబ్రహీం అలీ ఖాన్, ఖుషీ కపూర్ ఇప్పటికే ప్రమోషన్లను ప్రారంభించారు. ఫిబ్రవరి 14న ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఖుషీ ఇన్‌స్టాగ్రామ్‌లో ఇబ్రహీంతో కలిసి ఉన్న ఫోటోలను షేర్ చేయగా వైరల్ అయ్యాయి. ఈ జంట రొమాంటిక్ పోస్టర్లు ఆకట్టుకున్నాయి. నాదానియన్ చిత్రాన్ని ధర్మాటిక్ ఎంటర్‌టైన్‌మెంట్ లో కరణ్ జోహార్ నిర్మించారు. షౌనా గౌతమ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని కరణ్ జోహార్, అపూర్వ మెహతా, సోమెన్ మిశ్రా నిర్మించారు. ఈ రొమాంటిక్ డ్రామా కథాంశం యువతరం మెచ్చే లవ్ డ్రామాతో ఆకట్టుకుంటుందని సమాచారం. ఒక అపార్థం తన స్నేహితులను విరోధులుగా మార్చినప్పుడు.. లవ్ కోసం ధనవంతురాలైన పియా తన ప్రియుడిగా నటించడానికి కెరీర్‌నే జీవితంగా భావించే కొత్త విద్యార్థి అర్జున్‌ను నియమించుకుంటుంది. ఆ తర్వాత ఏం జరిగిందన్నదే ఈ సినిమా. సలార్ –2 నుంచి కాకపుట్టించే అప్డేట్! నాదానియన్ సినిమా మొదటి పోస్టర్‌లో ఇబ్రహీం అలీ ఖాన్, ఖుషీకపూర్ ఒకరినొకరు కౌగిలించుకుని కనిపించారు. ప్రతి ప్రేమకథలో థోడి సి నాదానీ (కొంచెం మూర్ఖత్వం) ఉంటుంది! అనే క్యాప్షన్ ఆకట్టుకుంది. ఈ సినిమా నుంచి పాటలు ఇప్పటికే విడుదల కాగా యువతరాన్ని ఆకట్టుకున్నాయి. ఖుషి కపూర్ ఇటీవలే అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ సరసన లవ్ యాపా చిత్రంలో నటించింది. ఈ సినిమా ఆశించిన వసూళ్లను సాధించలేదు. అమీర్ కొడుకు జనాల్ని ఆకర్షించడంలో ఫెయిల్ అయ్యాడు.. సైఫ్ కొడుకు నిరూపిస్తాడా లేదా? అన్నది ఇప్పటికి సస్పెన్స్. నెట్ ఫ్లిక్స్ లో నాదానియాన్ ఏమేరకు ఆదరణ దక్కించుకుంటుందో వేచి చూడాలి.




# ఆ చీర ధరించే వరకూ నాకు ఒత్తిడే.. ఆ కథేంటంటే..



"ప్రేమమ్'లో 'మలార్' పాత్రతో ఒక్కసారిగా పాపులర్ అయింది సాయిపల్లవి . 'మలర్' నుంచి 'సత్య' వరకూ ఏ పాత్ర చేసినా ప్రాణం పెట్టి నటించారు. అందం, అభినయంతో ప్రేక్షకుల్ని అలరించి లేడీ పవర్‌స్టార్‌గా గుర్తింపు పొందింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె జాతీయ అవార్డు కోసం తాను ఎదురుచూస్తున్నానని చెప్పారు. అందుకు బలమైన కారణం ఉందన్నారు. "ఉత్తమ నటిగా నేషనల్ అవార్డు అందుకోవాలని నాకెంతో ఆశగా ఉంది. ఎందుకంటే, నాకు 21 ఏళ్ల వయసు ఉన్నప్పుడు మా మామ్మ ఓ చీర ఇచ్చింది. పెళ్లి చేసుకున్నప్పుడు దానిని కట్టుకోమని చెప్పింది. అప్పటికి నేను సినిమాల్లోకి రాలేదు. కాబట్టి పెళ్లి చేసుకున్నప్పుడు దానిని కట్టుకుందామనుకున్నా. ఆ తర్వాత మూడేళ్లకు సినిమాల్లోకి అడుగుపెట్టా. నా తొలి చిత్రం 'ప్రేమమ్' కోసం వర్క్ చేశా. పరిశ్రమలోకి వచ్చిన తొలినాళ్ళలో ఏదో ఒక రోజు తప్పకుండా ఒక ప్రతిష్ఠాత్మక అవార్డు అందుకుంటానని నమ్మాను. జాతీయ అవార్డు అంటే ఆ రోజుల్లో ఎంతో గొప్ప. కాబట్టి, దానిని అందుకున్న రోజు ఈ చీర కట్టుకుని అవార్డు ప్రదానోత్సవానికి హాజరు కావాలని నిర్ణయించుకున్నా. దానిని అందుకున్నా, అందుకోకపోయినా.. ఈ చీర ధరించే వరకూ నాపై ఒత్తిడి ఉంటూనే ఉంటుంది" అని సాయి పల్లవి చెప్పారు.'గార్గి' చిత్రానికిగాను సాయిపల్లవికి జాతీయ అవార్డు వరిస్తుందని అభిమానులు ఎంతో ఆశపడ్డారు. కాకపోతే, చివరకు నిరాశ ఎదురైంది. ఆ ఏడాది నిత్యామేనన్‌ను నేషనల్ అవార్డు వరించింది. తాజాగా తండేల్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చింది సాయి పల్లవి. నాగచైతన్య హీరోగా నటించిన ఈ చిత్రానికి చందూ మొండేటి దర్శకత్వం వహించారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయాన్ని అందుకుంది. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాస్ దీనిని నిర్మించారు.

# భారత్‌తో మ్యాచ్ ఓడినా.. అలా జరిగితేనే మేం హ్యాపీ.. పాకిస్తాన్ వైస్ కెప్టెన్ ఏం అన్నాడంటే..



**న్యూదిల్లీ–నవభూమి:** క్రికెట్ అభిమానులను ఉర్రూత లూగించేందుకు మరో క్రికెట్ సమరం మొదలవుతోంది. పాకిస్తాన్ వేదికగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఈ నెల 19 నుంచి మొదలు కాబోతోంది. తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్ న్యూజిలాండ్ జట్లు తలపడుతున్నాయి. అలాగే టీమిండియా తమ తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో ఆడనుంది. క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగించేందుకు మరో క్రికెట్ సమరం మొదలవుతోంది. పాకిస్తాన్ వేదికగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఈ నెల 19 నుంచి మొదలు కాబోతోంది. తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్ న్యూజి లాండ్ జట్లు తలపడుతున్నాయి. అలాగే టీమిం డియా తమ తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 20న బంగ్లా దేశ్‌తో ఆడనుంది. ఇక క్రికెట్ ప్రేమికులందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూసే ఇండియా –పాకిస్తాన్ మ్యాచ్ ఫిబ్రవరి 23న దుబాయ్‌లో జరగ నుంది. భారత్, పాక్ రెండు దేశాల అభిమానులు కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తు న్నారు. ఇండియా–పాకిస్తాన్ మ్యాచ్‌కి సంబంధిం చిన టికెట్లు ఎప్పుడో హాట్ కేకుల్లా అమ్ముడు పోయాయి. ఈ రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు లేనందున కేవలం ఐసీసీ ఈవెంట్స్‌లోనే తలపడుతున్నాయి. దీంతో ఛాంపియన్స్ ట్రోఫీలో జరిగ్గి భారత్–పాక్ మ్యాచ్‌కు విపరీతమైన క్రేజ్ మొదలైంది. ఛాంపియన్స్ ట్రోఫీలో ఇండియా వర్సెస్ పాకిస్థాన్ మ్యాచ్ గురించి పాక్ వైస్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘా మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. పాకిస్థాన్ మాజీ క్రికెటర్ సల్మాన్ భట్‌తో జరిగిన చిట్‌చాట్‌లో తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. ఇండియా, పాకిస్థాన్ మ్యాచ్ అంటే ప్రపంచం మొత్తం స్పెషల్‌గా చూస్తుంది. మైదానంలోకి దిగే ఆటగాళ్లపై ఒత్తిడి విపరీతంగా ఉంటుంది. కానీ, అంతిమంగా అదొక మ్యాచ్ మాత్రమే. ఒకవేళ మేం ఇండియాపై గెలిచి, ఛాంపియన్స్ ట్రోఫీ సాధించలేకపోతే, ఆ విజయంతో ఉపయోగం లేదు. ఒకవేళ మేం ఇండియాపై ఓడిపోయినా ఛాంపియన్స్ ట్రోఫీ గెలిస్తే మాత్రం అది నా దృష్టిలో పెద్ద విషయం.

# చాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత్‌కు గట్టి షాక్.. అసలైనోడే దూరం




**న్యూదిల్లీ–నవభూమి:** ప్రతిష్టాత్మక చాంపియన్స్ ట్రోఫీ కోసం సన్నద్ధం అవుతోంది భారత జట్టు. మరో మూడ్రోజుల్లో మెగా టోర్నీ మొదలు కానుండటంతో టీమిండియా ఆటగాళ్లంతా ప్రాక్టీస్‌లో మునిగిపోయారు. ఈ టోర్నమెంట్ కోసం ఇప్పటికే దుబాయ్‌కు చేరుకున్న రోహిత్ సేన.. నెట్స్‌లో తీవ్రంగా చెమటోడ్చుతోంది. మరో ఐసీసీ కప్పును ఎగరేసుకుపోవాలని చూస్తోంది. రోహిత్–కోహ్లీకి మరో ట్రోఫీని బహుమతిగా ఇవ్వాలని ఆటగాళ్లంతా కసి మీద ఉన్నారు. ఈ తరుణంలో జట్టుకు ఊహించలేని షాక్ తగిలింది. అదేంటో ఇప్పుడు చూద్దాం..

ఇలా అయిందేంటి?..యంగ్ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు గాయమైంది. చీలమండ గాయంతో బాధపడుతున్న కుర్ర బ్యాటర్.. ఈ కారణంగా రంజీ ట్రోఫీ సెమీఫైనల్ నుంచి తప్పుకున్నాడు. దీంతో అతడు చాంపియన్స్ ట్రోఫీలో ఆడటం కూడా అనుమానంగా మారింది. ఆ టోర్నమెంట్‌కు ప్రకటించిన స్క్వాడ్‌లో జైస్వాల్ లేడు. కానీ ట్రావెలింగ్ రిజర్వ్‌లో ఒకడిగా ఉన్నాడు. ఎవరైనా ఆటగాళ్లు గాయపడితే అతడ్ని రీప్లేస్ చేయాలని బీసీసీఐ భావించింది. కానీ ఇప్పుడు అతడే ఇంజ్యూరీ బారిన పడటంతో బోర్డు పెద్దలకు ఏం చేయాలో పాలుపోవడం లేదని తెలుస్తోంది.

నవక్రీడ

# నన్ను కావాలనే బ్లాక్ చేశారు.. ధావన్ సంచలన వ్యాఖ్యలు



**న్యూదిల్లీ–నవభూమి:** టీమిండియా వెటరన్ ఓపెనర్ శిఖర్ ధావన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వాళ్లు తనను కావాలనే బ్లాక్ చేశారని అన్నాడు. అతడు ఇంకా ఏమన్నాడంటే.. నన్ను కావాలనే బ్లాక్ చేశారు.. ధావన్ సంచలన వ్యాఖ్యలు..టీమిండియాకు ఆడిన టఫెస్ట్ క్రికెటర్లలో వెటరన్ ఓపెనర్ శిఖర్ ధావన్ ఒకడు. ఏళ్ల పాటు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఈ ధనాధన్ బ్యాటర్.. పరుగులు వరద పారిస్తూ టీమ్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఎన్నో మ్యాచుల్లో ఒంటిచేత్తో మెన్ ఇన్ బ్లూకు గెలుపులు అందించాడు. ఎప్పుడూ ఫిట్‌గా ఉండే ధవన్.. బరిలోకి దిగితే బౌలర్ల బెండు తీసేవాడు. భారీ షాట్లతో విరుచుకుపడేవాడు. అందుకే అతడ్ని గబ్బర్ అని పిలుస్తుంటారు ఫ్యాన్స్. ఇంటర్నేషనల్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించినా ఇంకా పలు టీ20 లీగ్స్ ఆడుతూ బిజీగా ఉన్నాడు ధావన్. అయితే అతడు తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తనను వాళ్లు బ్లాక్ చేశారని అన్నాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**